www.andhrajyothy.com పేజీలు: 12
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 40

సోమవారం | 26-5-2025

శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: చతుర్థశి ప.12:12 తదుపరి అమావాస్య, నక్షత్రం: భరణి ఉ.8:24, కృత్తిక తె.5:32 వరకు, వర్జ్యం: రా.6:58-8:23, దుర్ముహూర్తం: మ.12:38-1:29, మ.3:13-4:05, అమృతఘడియలు: తె.3:26-4:50, రాహుకాలం: 7:30-9:00, సూర్యోదయం: 5:44, సూర్యాస్తమయం: 6:40

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్



జపాన్‌ను అధిగమించాం

మన జీడీపీ రూ.356 లక్షల కోట్లు

ఇదే వేగంతో వెళ్తే.. మూడేళ్లలో మూడో స్థానాన్నీ కైవసం చేసుకుంటాం

నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రమణ్యం వెల్లడి

గత పదేళ్లలో భారత్ తలసరి ఆదాయం రెట్టింపైందని ఐఎంఎఫ్ వెల్లడి

స్థిరంగా అడుగులు

త్వరలో జర్మనీని కూడా అధిగమించే అవకాశం

న్యూఢిల్లీ, మే 25: జపాన్‌ను అధిగవించి.. ప్రపంచంలోనే భారత్ నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించింది. ప్రస్తుత ధరల ప్రకారం భారత్ జీడీపీ 4.187 ట్రిలియన్ డాలర్లు (రూ.3,56,61,000 కోట్లు) కాగా.. జపాన్ జీడీపీ 4.186 ట్రిలియన్ డాలర్లు (రూ.3,56,53,000 కోట్లు). నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం ఈ వివరాలను వెల్లడించారు. 'భారత్ జపాన్‌ను దాటేసింది. ఐఎంఎఫ్ గణాంకాల

మిగతా 2వ పేజీలో...

అందాల బొమ్మలు.. కన్నీటి చెమ్మలు!

ఏడేళ్ల వయసులోనే యోని ఛేదన.. ఆ ఆటవిక దురాచారంపై పోరు

16 ఏళ్లకే అత్యాచారం.. అభాగ్యుల హక్కుల కోసం ఆరాటం

ఊహ తెలియనప్పుడే లైంగిక వేధింపులు.. వాటిపైనే పోరాటం

మిస్ వరల్డ్ పోటీదారుల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో విషాద గాథ

విశ్వవేదికపై తమ వాణి వినిపించిన సుందరీమణులు


మిస్ జాంబియా
మిస్ సొమాలియా
మిస్ కెనడా

హైదరాబాద్ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): మహిళల ప్రాణాలను హరించే ఆటవిక ఆచారాలను భరించిందో వనిత. అదృష్టవశాత్తు బతికిన ఆమె.. కొండంత ధైర్యం తెచ్చుకుంది. ఆ దేశంలో మహిళల మాన ప్రాణాలను దెబ్బతీసేలా ఉన్న మూఢాచారాలపై పోరాటాన్ని ప్రారంభించింది. పదహారేళ్లకే అత్యాచారానికి గురైంది మరో యువతి.. కొన్నేళ్ల తర్వాత ఆ క్షోభ నుంచి బయటపడిన ఆమె.. తమ దేశంలో

మిగతా 11వ పేజీలో...

క్వార్ట్జ్ కేసులో కాకాణి అరెస్టు



బెంగళూరు శివార్లలో పట్టివేత!

2 నెలలుగా పరారీలో మాజీ మంత్రి

క్వార్ట్జ్ అక్రమ రవాణాతోపాటు ఎస్టీలను బెదిరించిన కేసులోనూ నిందితుడు

ముందస్తు బెయిల్ కోసం శతవిధాలా యత్నం.. సుప్రీంకోర్టులోనూ చుక్కెదురు

ఆయన కోసం 4 రాష్ట్రాల్లో పోలీసుల గాలింపు.. లుక్ అవుట్ నోటీసు కూడా జారీ

నెల్లూరుకు తరలింపు.. నేడు కోర్టులో హాజరుపరిచే అవకాశం

నెల్లూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలం రుస్తుం మైన్స్‌లో అక్రమంగా క్వార్ట్జ్ ఖనిజం కొల్లగొట్టిన కేసులో పోలీసులకు దొరక్కుండా రెండు నెలలుగా పరారీలో ఉన్న ఆయన్ను ఆదివారం బెంగళూరు శివార్లలో అదుపులోకి తీసుకున్నారు. ఆయన కోసం నెల్లూరు జిల్లా పోలీసులు నాలుగు రాష్ట్రాల్లో గాలించారు. విమానాశ్రయాలకు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు గాలించాయి. ఎట్టకేలకు ఆదివారం బెంగళూరు శివార్లలో ఆయన దొరికిపోయారు. వైసీపీ హయాంలో నెల్లూరు జిల్లా పరిధిలోని

మిగతా 11వ పేజీలో...

పిన్నెల్లి సోదరులపై హత్య కేసు

గుండ్లపాడు టీడీపీ కార్యకర్తల హత్యలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రమేయం?

ఎఫ్ఐఆర్ నమోదుచేసిన వెల్దుర్తి పోలీసులు.. మరో ఐదుగురిపై కూడా.. 3

శనివారం రాత్రి పెద్దఎత్తున గాలింపు.. అదుపులో ఐదుగురు నిందితులు?

హత్య జరిగిన గంటల్లోనే అజ్ఞాతంలోకి పిన్నెల్లి.. ఏడాదిగా పత్తాలేని ఆయన సోదరుడు.. పోలీసులకు దొరక్కుండానే 12 కేసుల్లో బెయిల్ తెచ్చుకున్న వైనం


చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో నిర్మించిన ఇంట్లోకి గృహప్రవేశం చేస్తున్న చంద్రబాబు, లోకేశ్ దంపతులు

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్!

ఆ బాధ్యత అప్పగించాలని అధిష్ఠానంపై శ్రేణుల ఒత్తిడి

ప్రభుత్వ కార్యకలాపాల్లో పూర్తిగా నిమగ్నమైన చంద్రబాబు

క్షణం తీరిక లేకుండా కార్యక్రమాలు

2019లో ఇలాగే దెబ్బతిన్నాం

గత తప్పులు పునరావృతం కాకూడదు

పార్టీపై గట్టి పర్యవేక్షణ ఉండాల్సిందే

లోకేశ్‌కు బాధ్యత ఇస్తే టీడీపీ బలోపేతం

మినీ మహానాడుల్లో విస్తృత చర్చ

సీనియర్ నేతలదీ అదే మాట

మహానాడులో చర్చించి నిర్ణయం?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న పలు రాజకీయ పరిణామాల నేపథ్యంలో తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు పార్టీలో కీలక పాత్ర అప్పగించే అవకాశాలు విస్పష్టంగా కనిపిస్తున్నాయి. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడి(వర్కింగ్ ప్రెసిడెంట్)గా ఆయనకు బాధ్యతలు అప్పగించాలని టీడీపీ శ్రేణుల నుంచి అధిష్ఠానంపై పెద్దఎత్తున ఒత్తిడి వస్తోంది. 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడులో ఆయనకు కొత్త బాధ్యతల అప్పగింతపై చర్చించి నిర్ణయించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబు క్షణం తీరికలేకుండా అధికారిక కార్యక్రమాల్లో నిమగ్నమైపోయారు. వాస్తవానికి ప్రభుత్వ నిర్వహణ ఎంత ముఖ్యమో.. పార్టీ నిర్వహణా అంతే ముఖ్యం. ఒకప్పుడు చంద్రబాబు ఈ రెండింటినీ

మిగతా 12వ పేజీలో...

కొత్తింట్లోకి సీఎం చంద్రబాబు

కుప్పంలో వేడుకగా గృహ ప్రవేశం

నియోజకవర్గ ప్రజలే ముఖ్య అతిథులు

తొలి రోజు నూతన గృహంలోనే సీఎం బస


సిద్ధమవుతున్న ప్రతినిధుల సభా వేదిక

రేపటి నుంచే మహానాడు

ఏర్పాట్లు దాదాపు కొలిక్కి.. వర్షంతో కొంత ఇబ్బంది

ప్రతినిధుల నమోదుతో పసుపు పండగ ప్రారంభం

చరిత్రాత్మక నిర్ణయాలకు వేదిక కానున్న కార్యక్రమం

తొలి 2 రోజులు వివిధ అంశాలపై చర్చలు, తీర్మానాలు

మంత్రి లోకేశ్ ప్రతిపాదించిన ఆరు సూత్రాలపై చర్చ

కార్యకర్తలకు ప్రాధాన్యం కల్పించడంపై కీలక నిర్ణయం

29న మధ్యాహ్నం 5 లక్షల మందితో భారీ సభ

5 వేల మంది పోలీసులతో బందోబస్తు 12


ఢిల్లీలో వర్షాలతో నీట మునిగిన ఓ రోడ్డు

వర్షాలకు ఢిల్లీ అతలాకుతలం

గంటకు 82 కి.మీ వేగంతో గాలులు 2

200 విమాన సర్వీసులపై ప్రభావం

విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం

కేరళలోని 8 జిల్లాల్లో రెడ్ అలెర్ట్ ప్రకటన

2-3 రోజుల్లో రాష్ట్రానికి నైరుతి

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం

నేడు, రేపు కోస్తాకు భారీ వర్షసూచన

ఆ మహిళల్లో యోధుల స్ఫూర్తి లేదు!

ఉగ్రవాదులపై పోరాడి ఉండాల్సింది..

అప్పుడు మరణాల సంఖ్య తగ్గేది

పహల్గాం దాడి బాధిత మహిళలపై బీజేపీ ఎంపీ జంగ్రా వ్యాఖ్యలు 2

మండిపడ్డ ప్రతిపక్ష పార్టీలు

రూ.3 వేల టోల్ ఫీజు చెల్లిస్తే.. ఏడాదంతా హైవేలపై ప్రయాణం

3

త్వరలో కేంద్రం కొత్త పాలసీ

పీఎస్ఆర్ పిలిస్తే వచ్చా!



గ్రూపు-1 పేపర్లను ఆయనే అప్పగించారు

డిజిటల్ మూల్యాంకనం చేయాలని చెప్పారు

అంతకుముందు ఆయనతో ఏ పరిచయమూ లేదు

పోలీస్ విచారణలో మధుసూదన్ సమాధానాలు!

కొన్ని ప్రశ్నలకు మౌనం దాల్చిన పీఎస్ఆర్

మరికొన్నింటికి డొంక తిరుగుడు జవాబులు

తొలి రోజు 50 ప్రశ్నలు సంధించిన అధికారులు

నేడూ కొనసాగనున్న విచారణ

రాత్రికి పీఎస్‌లోనే ఇద్దరు నిందితులు

విజయవాడ, మే 25(ఆంధ్రజ్యోతి): 'పీఎస్ఆర్ పేషీ నుంచి నాకు ఫోన్ వచ్చింది. ఒకసారి వచ్చి కలవమని చెప్పారు. వచ్చిన తర్వాత గ్రూపు-1 జవాబు పత్రాలను డిజిటల్ మూల్యాంకనం చేయాలంటూ ఈ ప్రాజెక్టును ఆయనే నాకు అప్పగించారు' అని విచారణాధికారులకు మధుసూదన్ జవాబిచ్చారు. ఏపీపీఎస్సీ గ్రూపు-1 పత్రాల డిజిటల్ మూల్యాంకనం కేసులో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు, కామ్‌సైన్ సంస్థ డైరెక్టర్ పమిడికాల్వ మధుసూదన్‌ను న్యాయస్థానం రెండురోజుల పాటు కస్టడీకి ఇచ్చిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం 6 గంటలకు జైలు నుంచి వారిద్దరినీ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించిన తర్వాత సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నందిగామ డీఎస్పీ ఏబీజీ తిలక్, మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ లతాకుమారి వారిని విచారించారు. ముందుగా పీఎస్ఆర్‌ను విచారించిన తర్వాత మధుసూదన్‌ను ప్రశ్నించినట్టు సమాచారం. ఈ విచారణలో

మిగతా 11వ పేజీలో...



అబద్ధాల కసిరెడ్డి!

పోలీసు విచారణలో చెప్పిందంతా తప్పే 11

ఏ-3తో క్రాస్ వెరిఫికేషన్‌లో బట్టబయలు

తప్పించుకునే ధోరణిలో సజ్జల శ్రీధర్ రెడ్డి

తప్పుదోవ పట్టించేలా మిథున్ రెడ్డి జవాబులు

లిక్కర్ నిందితుల వాంగ్మూలాలపై సిట్ దృష్టి



కలెక్టరేట్లలో ఇంకా వైసీపీ 'కో-ఆర్డినేటర్లు'

పనీ లేదు.. సాంకేతిక సహకారమూ లేదు

ఖాళీగా ఉంటూ నెలనెలా జీతాలు డ్రా

గ్రామ, వార్డు సచివాలయ శాఖకు భారం

ఆ కో-ఆర్డినేటర్లంతా వైసీపీ కార్యకర్తలే

కూటమి వచ్చినా ఇంకా కొనసాగింపు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గ్రామ, వార్డు సచివాలయ శాఖ ప్రధాన కార్యాలయంలో వైసీపీ అనుకూల అధికారులు, అప్పట్లో నియమించిన వైసీపీ కన్సల్టెంట్లు కొనసాగుతుండగా.. మరోవైపు జిల్లాల్లో కూడా వైసీపీ అనుకూల కో-ఆర్డినేటర్లు ఇంకా తిష్ఠ వేశారు. పని లేకపోయినా జీతాలు తీసుకుంటూ, గ్రామ, వార్డు సచివాలయ శాఖకు భారంగా మారారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ శాఖను వైసీపీకి అనుబంధ సంస్థగా

మిగతా 3వ పేజీలో...


ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో విందులో పాల్గొన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. చిత్రంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ తదితరులు

రూ.555 కోట్లతో గిరిజన ఆవాసాలకు రోడ్లు

పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా నిర్మాణం

కుల గణనతో అన్ని వర్గాల అభ్యున్నతి

ఎన్డీయే సీఎంలు, ఉపముఖ్యమంత్రుల సదస్సులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 2

మోదీ దార్శనికతతోనే నాలుగో స్థానం

4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవడంపై చంద్రబాబు, పవన్ 12

పార్టీ మీ జాగీరా?



అక్కకు హక్కుల్లేవా?.. కవితకు మద్దతుగా సోషల్ మీడియాలో సన్నిహితుల పోస్టులు

కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ విమర్శనాస్త్రాలు 12

కుట్రలపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నలు

రెండు రోజులైనా కేసీఆర్ నుంచి రాని పిలుపు!

ఎవరూ స్పందించొద్దు.. కేటీఆర్‌కు కేసీఆర్ దిశా నిర్దేశం

సినిమా సూపిత్త మావా!

నటులు, బ్యాక్‌గ్రౌండ్, మ్యూజిక్ అంతా ఏఐతోనే

కథ, స్క్రీన్‌ప్లే, పాటలు, మాటలూ దానితోనే

అద్భుతమైన, అందమైన ఏఐ క్యారెక్టర్లు

ఖర్చు లేకుండానే అందమైన లొకేషన్లు

మొత్తంగా ఏఐతోనే రూపొందిన కన్నడ సినిమా 'లవ్ యూ'

కేవలం ఇద్దరు కూర్చుని 10 లక్షలతో పూర్తి

ఏఐతో చైనా సినిమా.. 'పైరేట్ క్వీన్'

సినిమా ఇండస్ట్రీకి ఇది వరమా.. శాపమా?

సినిమా అంటే 24 కళల సమాహారం. దర్శకుడు, నటీనటుల నుంచి లైట్ బాయ్ వరకు.. ఎడిటింగ్ నుంచి వీఎఫ్ఎక్స్ వరకు వందలు, వేల మంది కలిసి పనిచేస్తే.. కొన్ని నెలల పాటు కష్టపడితేనేగానీ ఒక సినిమా పూర్తికాదు. కానీ ఇద్దరు వ్యక్తులు ఓ గదిలో కూర్చుని.. రెండు, మూడు కంప్యూటర్లు పెట్టుకుని.. పూర్తిస్థాయి సినిమాను సిద్ధం చేసేస్తే!! కథ,స్క్రిప్టు దగ్గరి నుంచి నటీనటులు, సంగీతం, పాటలు, గ్రాఫిక్స్ ఇలా మొత్తం '24 క్రాఫ్ట్స్' పని..

మిగతా 3వ పేజీలో...


కన్నడ సినిమా 'లవ్‌యూ'లో ఏఐతో సృష్టించిన హీరో, హీరోయిన్

పహల్గాంలో పర్యాటక మహిళలు ఉగ్రవాదులపై పోరాడి ఉండాల్సింది..

» బీజేపీ ఎంపీ వివాదాస్పద వ్యాఖ్యలు



భివానీ, మే 25: పహల్గాం ఉగ్రదాడిలో భర్తల ప్రాణాలు కోల్పోయిన మహిళలపై బీజేపీ రాజ్యసభ ఎంపీ రామ్‌చందర్ జంగ్రా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పర్యాటకులు ఉగ్రవాదులను వేడుకొనే బదులు.. వారిపై తిరగబడి పోరాడాల్సిందని, బాధిత మహిళల్లో యోధుల స్ఫూర్తి లేదని, అందుకే తమ భర్తలను కోల్పోవాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. హరియాణాలోని భివానీలో శనివారం జరిగిన అహిల్యాబాయ్ హోల్కర్ 300వ జయంతి కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భర్తలను కోల్పోయిన మహిళలకు స్ఫూర్తి, శక్తి లేవు. అందుకే వారు ఉగ్రదాడి బాధితులు అయ్యారు' అన్నారు. బాధిత మహిళలు హోల్కర్ చరిత్ర చదివి ఉంటే.. వారి కళ్ల ముందే ఎవరూ తమ భర్తలను చంపి ఉండే వారు కాదన్నారు. జంగ్రా వివాదాస్పద వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియా వైరల్‌గా మారింది. విపక్ష పార్టీల నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పహల్గాం దాడి బాధిత మహిళలపై జంగ్రా చేసిన అసహ్యకరమైన ప్రకటన ఖండించదగినది అనే పదం కూడా సరిపోదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. బీజేపీ మహిళలను గౌరవించడానికి బదులు.. వారిని వేధిస్తోందని, ఇది ఆ పార్టీ నిజస్వరూపమని అన్నారు. కాగా, ఎవరినీ కించపర్చాలన్నది తన ఉద్దేశం కాదని, అవసరమైతే క్షమాపణ చెప్తానని జంగ్రా అన్నారు.

చంపేసి తప్పించుకోగలం.. అనుకునే రోజులు పోయాయి: శశిథరూర్

న్యూయార్క్, మే 25: భారత పౌరులను చంపేసి తప్పించుకోగలం అని పాకిస్థాన్‌లో కూర్చున్న వాళ్లు ఆలోచనలు చేసే రోజులు పోయాయని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. భారత పౌరులను చంపిన వారు ఎవరైనా తప్పకుండా మూల్యం చెల్లించాల్సిందేనన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ఇది స్పష్టమైందని, ఇకముందు ఉగ్రవాదులు చెల్లించాల్సిన మూల్యం ఇంకా ఇంకా పెరుగుతుందని హెచ్చరించారు. ఉగ్రవాదంపై పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టడం కోసం శశిథరూర్ నేతృత్వంలోని అఖిలపక్ష బృందం ఆదివారం అమెరికాకు వెళ్లింది. న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్‌లో భారత సంతతి ప్రముఖులు, మీడియా ప్రతినిధులతో థరూర్ మాట్లాడారు. ఉగ్రవాదంపై పోరులో దేశమంతా ఐక్యంగా ఉందన్న సందేశమిచ్చారు. ముంబై, ఉరీ, పుల్వామా ఉగ్ర దాడులను గుర్తు చేశారు. థరూర్ నేతృత్వంలోని అఖిలపక్ష బృందం అమెరికాలోని 9/11దాడుల స్మారకాన్ని సందర్శించింది. మరోవైపు ఉగ్ర మూకలు అమాయక ప్రజలను హత్య చేసి మతాన్ని అడ్డు పెట్టుకుంటున్నాయని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. ఒవైసీ నేతృత్వంలోని అఖిలపక్ష బృందం బహ్రెయిన్‌లో పర్యటించింది.

భారత్‌ను అతిపెద్ద ముప్పుగా చూస్తున్న పాక్

» అమెరికా రక్షణ నిఘా సంస్థ వార్షిక నివేదిక వెల్లడి

వాషింగ్టన్, మే 25: పాకిస్థాన్.. భారత్‌ను అతిపెద్ద ముప్పుగా పరిగణిస్తోందని, తన అణ్వాయుధాలను ఆధునీకరించుకోవడంతో పాటు భారీ విధ్వంసక ఆయుధాలను సమీకరించుకుంటోందని అమెరికా రక్షణ నిఘా సంస్థ వార్షిక నివేదిక బయటపెట్టింది. ఇందుకు చైనా, టర్కీ, సింగపూర్, యూఏఈ దేశాల సహకారం తీసుకుంటున్నట్లు వెల్లడించింది. పాకిస్థాన్ తనకు కావాల్సిన ఆయుధాలను చైనా నుంచే కొనుగోలు చేస్తోందని, అయితే ఇటీవల కాలంలో చైనా కార్మికులపై ఉగ్రవాదుల దాడులు పెరగడంతో రెండు దేశాల మధ్య కొంతమేరకు సంఘర్షణ ఏర్పడిందని నివేదిక వెల్లడించింది. అయితే, చైనాను భారత్ ప్రధాన విరోధిగా చూస్తోందని, ఈ తరుణంలో చైనాకు చెక్ పెట్టేందుకు హిందూ మహాసముద్రం ప్రాంతంలోని ఇతర దేశాలతో రక్షణ సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై భారత్ ప్రధానంగా దృష్టి సారించిందని ఈ నివేదిక తెలిపింది.

పెద్ద కొడుకును పార్టీ నుంచి బహిష్కరించిన లాలూ



పట్నా, మే 25: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తన పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఇకపై పార్టీ కార్యకలాపాల్లో, కుటుంబ వ్యవహారాల్లో తేజ్ ప్రతాప్‌కు ఎలాంటి పాత్ర ఉండబోదని స్పష్టం చేశారు. కుటుంబ విలువలు, సంప్రదాయాలకు విరుద్ధంగా నడుచుకుంటున్నందుకు, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని లాలూ తన ఎక్స్ ఖాతా ద్వారా తెలిపారు. తాను 12 ఏళ్లుగా అనుష్క యాదవ్ అనే మహిళతో రిలేషన్‌లో ఉన్నానని తెలుపుతూ తేజ్ ప్రతాప్ శనివారం తన ఫేస్‌బుక్ ఖాతాలో చేసిన పోస్ట్ వైరల్ అయింది. ఆ మరుసటి రోజే లాలూ అతడిపై బహిష్కరణ వేటు వేశారు.

5అసెంబ్లీ స్థానాలకు జూన్ 19న ఉప ఎన్నికలు

న్యూఢిల్లీ, మే 25: దేశవ్యాప్తంగా నాలుగు రాష్ట్రాల్లో ఖాళీ అయిన అయిదు అసెంబ్లీ స్థానాలకు జూన్ 19 ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. జూన్ 23న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపింది. గుజరాత్‌లోని కడీ, విసావదర్ స్థానాలతో పాటు, కేరళలోని నిలంబూర్, పంజాబ్‌లోని లూధియాన, పశ్చిమ బెంగాల్‌లోని కాళీగంజ్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి.

కొవిడ్‌తో ఇద్దరు వ్యక్తుల మృతి

న్యూఢిల్లీ, మే 25: దేశంలో మళ్లీ కొవిడ్-19 కేసులు పెరుగుతున్నాయి. గత 24 గంటల్లో కరోనా పాజిటివ్ అని వైద్య పరీక్షల్లో తేలిన ఇద్దరు వ్యక్తులు ఇతర అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. కర్ణాటకలో 84 ఏళ్ల వృద్ధుడు, మహారాష్ట్రలోని థానెలో 21 ఏళ్ల యువకుడు కరోనాతో చనిపోయారు.

ఆయుధ బేహారి అమెరికా: పాక్ రక్షణమంత్రి

ఇస్లామాబాద్, మే 25: తమ ఆయుధ పరిశ్రమలకు లబ్ధి చేకూర్చేందుకు అమెరికా ఉద్దేశపూర్వకంగానే ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలకు ఆజ్యం పోస్తోందని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ మిలిటరీ పరిశ్రమ లాభదాయకంగా కొనసాగేందుకు యుద్ధాల్లో అమెరికా ఇరు పక్షాల తరఫునా పాత్ర పోషిస్తుందని ఆసిఫ్ ఆరోపించారు. ఆసిఫ్ వ్యాఖ్యలపై నెటిజన్ల నుంచి తీవ్ర ప్రతిస్పందనలు వస్తున్నాయి. మరి మీరెందుకు అమెరికా నుంచి ఆయుధాలు కొంటున్నారంటూ పలువురు నిలదీస్తున్నారు.

ఆ పేకాట తప్పుకాదు: సుప్రీం

న్యూఢిల్లీ, మే 25: పందేలు, జూదం మాట లేకుండా వినోదం, విలాసం కోసం పేకాట ఆడటం తప్పుకాదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఇది నైతిక ఉల్లంఘన కిందకు రాదని స్పష్టం చేసింది. కర్ణాటకలో ప్రభుత్వ పింగాణీ ఫ్యాక్టరీ ఉద్యోగుల హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ బోర్డు డైరెక్టర్ వైసీ హనుమంతరాయప్ప కేసులో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

ఉక్రెయిన్‌పై 365 క్షిపణులు, డ్రోన్లతో రష్యా దాడి

» 12 మంది మృతి, 70 మందికి గాయాలు

మాస్కో, కీవ్, మే 25: ఉక్రెయిన్‌పై రష్యా మరోమారు భీకర దాడి జరిపింది. ఉక్రెయిన్‌కు చెందిన సైనిక స్థావరాలు, ఆయుధ డిపోలే లక్ష్యంగా 367 మిసైళ్లు, డ్రోన్లను ప్రయోగించింది. ఉక్రెయిన్ ప్రయోగించిన 110 డ్రోన్లను కూల్చేశామని కూడా మాస్కో తెలిపింది. మరోవైపు రష్యా దాడుల్లో తమ దేశానికి చెందిన 12 మంది మృతిచెందారని, 70 మంది గాయపడ్డారని, 80 భవనాలు ధ్వంసమయ్యాయని ఉక్రెయిన్ వెల్లడించింది. రాజధాని కీవ్ సహా మొత్తం 30 నగరాలు, గ్రామీణ ప్రాంతాలపై రష్యా దాడులకు పాల్పడిందని తెలిపింది. రష్యా ప్రయోగించిన 45 మిసైళ్లను, 266 డ్రోన్లను కూల్చేశామని ఉక్రెయిన్ ఎయిర్ ఫోర్స్ ప్రకటించింది.

ఆపరేషన్ సిందూర్.. 'మేడిన్ ఇండియా' విజయం

ఉగ్ర పోరులో కీలక మలుపు.. ఇది కేవలం సైనిక చర్య కాదు భారత్ పరివర్తనకు నిదర్శనం: ప్రధాని

న్యూఢిల్లీ, మే 25 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్ టెర్రరిజంపై పోరులో కీలక మలుపుగా ప్రధాని మోదీ పేర్కొన్నారు. 'మేడిన్ ఇండియా' ఆయుధాలు, వ్యవస్థలు దీని విజయంలో కీలక భూమిక నిర్వహించాయన్నారు. 'ఇవాళ దేశం మొత్తం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏకమైంది. భారత్ అసలు బలం ఇదే. ఈ సందర్భంగా దేశవాసులందరినీ ఒకటి కోరుతున్నాను. అవకాశం ఉన్న చోట.. మన జీవనావసరాలకు దేశీయంగా ఉత్పత్తి అయ్యే వస్తువులను మాత్రమే వాడదామని అందరం ప్రతిజ్ఞ చేద్దాం' అని పిలుపిచ్చారు. ప్రతి నెలా చివరి ఆదివారం ఆకాశవాణిలో ప్రధాని 'మన్ కీ బాత్' ప్రసంగం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆదివారం 122వ సంచికలో పాకిస్థాన్, దాని ప్రేరిత ఉగ్రవాదులపై 'ఆపరేషన్ సిందూర్' గురించి వివరించారు. ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఉపముఖ్యమంత్రులు, నేతలు ఢిల్లీలో మూకుమ్మడిగా ఈ కార్యక్రమం విన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి 'మన్ కీ బాత్'లో మోదీ మాట్లాడారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీరు (పీవోకే)ల్లో భారత సైన్యం నాశనం చేసిన ఉగ్రవాద స్థావరాల ఫొటోలను ఈ సందర్భంగా ఆయన విడుదల చేశారు. ప్రధానంగా పీవోకేలో ధ్వంసమైన గుల్పూర్, అబ్బాస్, బర్నాలా క్యాంపుల గురించి ప్రస్తావించారు. జమ్మూకశ్మీరులోని రాజౌరీ, పూంచ్‌లలో కార్యకలాపాలు నిర్వహించే లష్కరే తయ్యబా టెర్రరిస్టులకు గుల్పూర్ శిబిరం ప్రధాన స్థావరం. అబ్బాస్... లష్కరే ఆత్మాహుతి బాంబర్ల శిక్షణకు సంబంధించిన కీలక కేంద్రం. ఆయుధ శిక్షణ, ఐఈడీల తయారీని బర్నాలాలో నేర్పుతారు. ఉగ్రవాద స్థావరాలపై భారత బలగాలు కచ్చితత్వంతో దాడియడం అసాధారణమని మోదీ అన్నారు. 'మన ఇంజనీర్లు, సాంకేతిక సిబ్బంది, ఆపరేషన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరి శ్రమకూ ఈ విజయం చిహ్నం. ఆపరేషన్‌సిందూర్ యావజ్జాతిలో దేశభక్తి భావన చొప్పించింది' అని చెప్పారు. 'ఆపరేషన్ విజయవంతానికి.. ఆత్మనిర్భర భారత్ స్ఫూర్తితో దేశీయంగా పెరిగిన రక్షణ సామర్థ్యం ప్రధాన కారణం. దేశీయంగా రూపుదిద్దుకున్న ఆయుధాలు, టెక్నాలజీ శక్తికి మన సైనికుల శౌర్యం తోడయింది. ఆపరేషన్ సిందూర్.. స్థానికత కోసం గళమెత్తేందుకు (వోకల్ ఫర్ లోకల్) సరికొత్త ఉత్తేజాన్ని ఇచ్చింది. ఇది దేశభక్తిని ఇనుమడింపజేయడమే గాక.. స్వావలంబన స్ఫూర్తిని కూడా బలోపేతం చేసింది. మనందరం ఒక్క అడుగు ముందుకేస్తే భారత పురోగతికి పెద్దఎత్తున తోడ్పడుతుంది' అని మోదీ ఉద్ఘాటించారు. 'వోకల్ ఫర్ లోకల్' ఉద్యమంలో భాగంగా చాలా మంది భారతీయులు.. తమ సెలవు దినాలను దేశీయంగానే గడపాలని నిర్ణయించుకున్నారని చెప్పారు.



ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ నేతల భేటీలో పవన్‌కు గులాబీ పువ్వును అందిస్తున్న మోదీ

మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో అభివృద్ధి

మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో అభివృద్ధి, విద్య ముందంజలో ఉన్నాయని తెలిపారు. 'మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో కతేజ్‌వారీ వంటి మారుమూల ప్రాంతాలు, ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ ప్రాంతంలో విద్య, బస్సు సర్వీసుల వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. బస్తర్ ఒలింపిక్స్ సైన్స్ లేబొరేటరీల గురించి ప్రస్తావించారు.

'కుల గణన'పై దేశవ్యాప్తంగా వర్క్‌షాపులు

కుల గణనపై దేశవ్యాప్తంగా వర్క్‌షాపులు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ సూత్రప్రాయంగా నిర్ణయించింది. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకే తెలంగాణలో కుల గణన సర్వే జరిగిందని, కాంగ్రెస్ ఒత్తిడి వల్లే కేంద్రం కుల గణనకు ముందుకొచ్చిందని.. విస్తృతం ప్రచారం చేయాలని ఏఐసీసీ భావిస్తోంది.

ప్రజలకు 'డబుల్ ఇంజన్' ప్రయోజనాలు అందాలి

ఎన్డీయే సీఎంలు, డిప్యూటీ సీఎంల భేటీలో మోదీ

దేశంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వాలతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు సమర్థవంతంగా చేర్చాలని ప్రధాని మోదీ సూచించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి నమూనాకు అనుగుణంగా దేశంలో కులగణన జరుగుతుందని తెలిపారు. సమాజంలో అభివృద్ధి ఫలాలు చేరని వారిని, అణగారిన వారిని అభివృద్ధి పథంలోకి తెచ్చేందుకు త్వరలో చేపట్టబోయే కులగణనతో ముందడుగు పడుతుందని చెప్పారు. ఆదివారం ఢిల్లీలో మోదీ అధ్యక్షతన ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, ఉప ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. 20 మంది సీఎంలు, 18 మంది డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. మోదీ నాయకత్వంలో మన సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించి, పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పడాన్ని సమావేశం అభినందించింది. దేశంలో చరిత్రాత్మక రీతిలో కులగణన చేపట్టాలని మోదీ నిర్ణయించడాన్నీ కొనియాడింది. ఈ మేరకు సమావేశం తీర్మానాలను ఆమోదించింది.

లోకం తీరు



'యోగాంధ్ర' భేష్

యోగా మన జీవన విధానాన్ని మారుస్తుందని.. ప్రజలంతా దానిని అనుసరించాలని ప్రధాని పిలుపిచ్చారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 10 లక్షల మంది యోగా ప్రాక్టీషనర్స్‌ను సృష్టించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'యోగాంధ్ర' అభియాన్‌కు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యోగా సంస్కృతిని అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. ఆ రోజు తాను విశాఖ వెళ్తున్నానని, అక్కడ జరిగే యోగా కార్యక్రమంలో పాల్గొనే అవకాశం తనకు లభించిందని తెలిపారు. విశాఖపట్నం, గురుగ్రామ్ వంటి నగరాల్లో కొన్ని స్టార్టప్‌లు పేపర్ రీసైక్లింగ్‌లో వినూత్న పద్ధతులను అవలంబిస్తున్నాయని వ్యాఖ్యానించారు. సాంకేతికత, సంకల్పం కలిసి నడిచినప్పుడు మార్పు సాధ్యమేనని తెలంగాణలోని సంగారెడ్డి మహిళలు నిరూపిస్తున్నారని అన్నారు. సంగారెడ్డి జిల్లాలో కొంతకాలం కిందటి వరకు ఇతరులపై ఆధారపడ్డ మహిళలు ఇప్పుడు స్వయంగా డ్రోన్లను ఆపరేట్ చేస్తూ 50 ఎకరాల భూమిలో మందులను పిచికారీ చేస్తున్నారని అన్నారు. వారు 'డ్రోన్ ఆపరేటర్లు'గా కాదు.. స్కై వారియర్స్'గా గుర్తింపు పొందారని కితాబిచ్చారు. ఉదయం మూడు గంటలు, సాయంత్రం రెండు గంటలు పని చేస్తూ మహిళలు మందుల పిచికారీ పని పూర్తి చేస్తున్నారని తెలిపారు.

రూ. 555 కోట్లతో గిరిజన ఆవాసాలకు రోడ్లు

పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా నిర్మాణం
కుల గణనతో అన్ని వర్గాల సమగ్రాభివృద్ధి
ఎన్డీయే సీఎంలు, ఉపముఖ్యమంత్రుల సదస్సులో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

న్యూఢిల్లీ, మే 25(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతదేశ శక్తి సామర్థ్యాలను ప్రధాని మోదీ ప్రపంచానికి చాటిచెప్పారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొనియాడారు. ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంల సదస్సులో ఆయన ప్రసంగించారు. 'కేంద్రం నిధులు సమకూరుస్తున్న పీఎం జన్‌మన్ కార్యక్రమం ద్వారా ఏపీలో రూ.555.61 కోట్ల నిధులతో ఏడు జిల్లాల్లోని 239 పీవీటీజీ ఆవాసాలకు 612.72 కి.మీ. మేర రహదారులు నిర్మిస్తున్నాం. దీనివల్ల సుమారు 50వేల మందికి రోడ్డు సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ప్రతి ఒక్కరికీ, అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి ఫలాలు అందాలనే ఉద్దేశంతో ప్రధాని చర్యలు తీసుకుంటున్నారు. ఆ స్ఫూర్తితోనే ఎన్డీఏ పాలిత రాష్ట్రాలు ముందుకు వెళ్తున్నాయి. ఏపీలో ఎస్సీ వర్గీకరణకు చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ 3నెలల పాటు రాష్ట్రంలో పర్యటించి రూపొందించిన నివేదిక ప్రకారం వర్గీకరణ చేపట్టాం. కుల గణన చేపట్టడం ద్వారా దేశంలో ఉన్న కులాల పరిస్థితులు, వారి జీవనం, వృత్తులు, స్థితిగతులు తెలుస్తాయి. వారి జీవనోపాధుల మెరుగుదలకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో, ఏ పథకాలు అమలు చేయాలో ప్రభుత్వానికి స్పష్టత వస్తుంది' అని పవన్ పేర్కొన్నారు.

4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

(మొదటి పేజీ తరువాయి)

ఆధారంగా దీనిని తెలియజేస్తున్నా. ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే మనకన్నా పెద్ద ఆర్థిక వ్యవస్థలు. మన ప్రణాళికలకు అనుగుణంగా మన వృద్ధి కొనసాగితే.. మరో రెండున్నర లేదా మూడేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తాం' అని తెలిపారు. కాగా, ఈ ఏడాది ఏప్రిల్‌లో ఐఎంఎఫ్ విడుదల చేసిన 'వరల్డ్ ఎకనమిక్ ఔట్‌లుక్' నివేదికలో 2025లో భారత్ 4.19 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో జపాన్‌ను అధిగమించి.. నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అంచనా వేసింది. దీనికి తగినట్లుగానే, కేవలం నెల రోజుల వ్యవధిలోనే భారత్ 4వ స్థానానికి చేరుకోవటం విశేషం. గత పదేళ్లలో భారత్‌లో తలసరి ఆదాయం రెట్టింపు అయ్యిందని, 2013-14లో తలసరి ఆదాయం 1,438 డాలర్లు (రూ.1,22,476) కాగా, 2025 నాటికి 2,880 డాలర్లకు (రూ.2,45,293) పెరిగిందని ఐఎంఎఫ్ ఆ నివేదికలో తెలిపింది. 2025లో భారత్ 6.2 శాతం వృద్ధిరేటును కొనసాగిస్తుందని, ఇది అంతకుముందు అంచనా వేసిన 6.5 శాతం కన్నా తక్కువని పేర్కొంది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, వాణిజ్యపరమైన ఉద్రిక్తతలే దీనికి కారణమని విశ్లేషించింది. 2025లో ప్రపంచం ఆర్థిక వృద్ధి రేటు 2.8 శాతం ఉండే అవకాశం ఉందని, ఇది గతంలో అంచనా వేసిన దానికంటే 0.5 శాతం తక్కువని పేర్కొంది. కాగా, 'వికసిత్ భారత్ కోసం వికసిత్ రాజ్యం-2047' పేరుతో నీతిఆయోగ్ రూపొందించిన పత్రంలో 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల (రూ.25 కోట్ల కోట్లు) ఆర్థిక వ్యవస్థగా రూపొందుతుందని పేర్కొన్నారు. తలసరి ఆదాయంలో.. సంపన్న దేశాలతో భారత్ సరితూగుతుందని తెలిపారు.

స్థిరంగా అడుగులు

త్వరలోనే జర్మనీని భారత్ అధిగమించే అవకాశం

» టాప్-3లో అమెరికా, చైనా, జర్మనీ

(సెంట్రల్‌డెస్క్)


2025 నాటికి ఐదు ట్రిలియన్ డాలర్ల (రూ.4,25,86,000 కోట్లు) ఆర్థిక వ్యవస్థగా రూపొందాలని భారత్ 2018లోనే లక్ష్యాన్ని రూపొందించుకుంది. ఈ లక్ష్యసాధనకు ప్రభుత్వ విభాగాలు మాత్రమేగాక వివిధ పరిశ్రమ రంగాల నుంచి నిపుణులతో ఒక కోర్ గ్రూప్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే, మధ్యలో ముంచుకొచ్చిన కరోనాతో ఈ అంచనాలు తలకిందులయ్యాయి. యావత్ ప్రపంచం కరోనా మహమ్మారి కారణంగా స్తంభించిపోయింది. భారత్‌పైనా తీవ్ర ప్రభావం పడింది. అంత పెద్ద ఉత్పాతం సంభవించినప్పటికీ.. స్థిరంగా అడుగులు వేస్తూ 4.187 ట్రిలియన్ డాలర్లకు (రూ.3,56,61,000 కోట్లు) చేరుకున్నాం.. జపాన్‌ను అధిగమించి 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచాం. మన కన్నా ముందు అమెరికా, చైనా, జర్మనీ ఉన్నాయి. త్వరలోనే జర్మనీని అధిగమించి మూడో స్థానాన్ని కైవసం చేసుకునే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. జర్మనీ ఆర్థిక వ్యవస్థను గమనిస్తే గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో ఆ దేశం ఒడిదొడుకులకు లోనైన విషయం స్పష్టమవుతోంది. 2019లో ఆ దేశం వృద్ధి రేటు 0.99% కాగా.. 2020లో మైనస్ 4.1% నమోదైంది (కరోనా కారణంగా). మరుసటి ఏడాది (2021లో) పుంజుకొని 3.67% వృద్ధిరేటును నమోదు చేసినప్పటికీ.. మళ్లీ ఏడాదిలోనే (2022లో) 1.37 శాతానికి పడిపోయింది. అదే క్రమంలో 2023లో మైనస్ 0.26% నమోదు చేసింది. 2024లో ఇది మైనస్ 0.4 శాతానికి వృద్ధిరేటు పడిపోయింది. ఇదే కాలవ్యవధిలో భారత్ ఆర్థిక వ్యవస్థ మిశ్రమ పనితీరును చూపింది. కరోనా కారణంగా 2019-20లో వృద్ధిరేటు మైనస్ 5.78 శాతానికి పడిపోయింది. 2020-21లో పుంజుకొని ఏకంగా 9.68% వృద్ధిరేటును నమోదు చేసింది. 2021-22లో 6.99%, 2022-23లో 7%, 2023-24లో 7.61% నమోదైంది. మొత్తంగా భారత్ స్థిరంగా అడుగులు వేస్తోందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ లెక్కన మరో రెండున్నర లేదా మూడేళ్లలో జర్మనీని దాటి ప్రపంచ మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించనుందని నీతిఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం చేసిన ప్రకటన వాస్తవాలకు దగ్గరగానే ఉందని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అయితే, తలసరి ఆదాయం పరంగా ఆయా దేశాలతో భారత్‌కు అంతరం భవిష్యత్తులో చాలా ఏళ్లపాటు కొనసాగే పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఉదాహరణకు, ప్రస్తుతం భారత్.. జపాన్‌ను అధిగమించి 4వ స్థానాన్ని కైవసం చేసుకున్నప్పటికీ.. తలసరి ఆదాయంలో జపాన్‌కు భారత్‌కు మధ్య తీవ్రమైన అంతరం ఉంది. జపాన్ తలసరి ఆదాయం 33,960 డాలర్లు(రూ.28,92,413) కాగా, భారత్ తలసరి ఆదాయం 2,880 డాలర్లు (రూ.2,45,293)మాత్రమే.

టాప్ 3 దేశాల పరిస్థితి..

టాప్-3 దేశాలుగా ఉన్న అమెరికా, చైనా, జర్మనీల జీడీపీలు, తలసరి ఆదాయాలు ఇలా ఉన్నాయి.. అమెరికా జీడీపీ 30.51 ట్రిలియన్ డాలర్లు, తలసరి ఆదాయం 89,110 డాలర్లు. చైనా జీడీపీ 19.23 ట్రిలియన్ డాలర్లు, తలసరి ఆదాయం 13,690 డాలర్లు. జర్మనీ జీడీపీ 4.74 ట్రిలియన్ డాలర్లు, తలసరి ఆదాయం 55,910 డాలర్లు. చైనా రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పటికీ.. తలసరి ఆదాయంలో 3వ స్థానంలో ఉన్న జర్మనీ కన్నా వెనుకబడి ఉండటానికి కారణం.. జనాభానే. జర్మనీ జనాభా 8.3 కోట్లు కాగా, చైనా జనాభా 141 కోట్లు. భారత్, జపాన్ విషయంలో అంతరానికీ ఇదే వర్తిస్తుంది. జపాన్ జనాభా 12.45 కోట్లు కాగా.. భారత్ జనాభా 144 కోట్లను దాటి ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశం కావటం గమనార్హం. ఇక, ఆర్థికరంగంలో చైనా వేగంగా ముందుకెళ్తోంది. వృద్ధిరేటు పరంగా అమెరికా కంటే వేగంగా దూసుకెళ్తోంది. 2021లో 8% వృద్ధిరేటును నమోదు చేస్తే.. ఆ ఏడాది అమెరికా 6 శాతానికి పరిమితమైంది. 2023లో చైనా 5.4% నమోదు చేస్తే.. అమెరికా వృద్ధి రేటు 2.89%. ఈ లెక్కన కొన్నేళ్లలోనే అమెరికాను అధిగమించి చైనా నెంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించే అవకాశాలున్నాయని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.



కుండపోతతో ఢిల్లీ అతలాకుతలం



న్యూఢిల్లీ, మే 25: కుండపోత వర్షాలతో ఢిల్లీ అతలాకుతలమైంది. శనివారం అర్ధరాత్రి దాటాక మొదలై.. ఆదివారం ఉదయం వరకు తెరిపినివ్వకుండా కురిసిన వానతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు చెరువులను తలపించగా.. వాహనాలు నీట మునిగాయి. గంటకు 82 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో 200 విమానాలపై తీవ్ర ప్రభావం కనిపించింది. 49 విమానాలు రీ-షెడ్యూల్ అవ్వగా.. మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. విమానాశ్రయం టెర్మినల్-1 వద్ద పైకప్పు దెబ్బతిని, వర్షపునీరు లీకవుతోంది. చాలా చోట్ల విద్యుత్తు అంతరాయమేర్పడింది. పలు కాలనీల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. ఢిల్లీలోని పోలీసు అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం పైకప్పు కూలడంతో.. ఓ అధికారి మృతిచెందారు. మరోవైపు ఆదివారం ఉదయం నుంచి కురుస్తున్న కుండపోత వర్షాలతో కేరళలో జనజీవనం స్తంభించిపోయింది. కోళికోడ్‌లో చెట్టు కూలి ఓ వృద్ధుడు మృతిచెందాడు. కాగా.. నైరుతి రుతుపవనాలు మహారాష్ట్ర, గోవాలను తాకినట్లు వాతావరణ శాఖ తెలిపింది.

కోచి తీరంలో హై అలెర్ట్

» కంటెయినర్లతో మునిగిన లైబీరియా నౌక

» కొన్నింటిలో ప్రమాదకర రసాయనాలు

కోచి, న్యూఢిల్లీ, మే 25: కోచికి సమీపంలో కంటెయినర్ల నౌక మునిగిపోవడంతో కోస్ట్‌గార్డ్, కేరళ ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. కొన్ని కంటెయినర్లలో ప్రమాదకర రసాయనాలు ఉండడంతో హైఅలెర్ట్ ప్రకటించాయి. ఒడ్డుకు కొట్టుకువచ్చే కంటెయినర్లనుగానీ, చమురుతెట్టునుగానీ తాకకూడదని ప్రజలను హెచ్చరించాయి. లైబీరియా దేశానికి చెందిన ఆ సరకు రవాణా నౌక ఆదివారం ఉదయం అరేబియా సముద్రంలో మునిగిపోయింది. నౌకలోని మొత్తం 24 మంది సిబ్బందిని ఇండియన్ కోస్టు గార్డు కాపాడింది. 180 మీటర్ల పొడవున్న ఆ నౌకలో మొత్తం 640 కంటెయినర్లు ఉన్నాయి. అవన్నీ సముద్రంలో మునిగిపోయినట్టు రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 13 కంటెయినర్లలో ప్రమాదకర రసాయనాలు, 12 కంటెయినర్లలో కాల్షియం కార్బైడ్ ఉన్నట్టు పేర్కొంది.

రెండు మూడు రోజుల్లో రాష్ట్రానికి నైరుతి

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం.. నేడు, రేపు కోస్తాకు భారీ వర్షసూచన

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ఆదివారం మహారాష్ట్రలోనికి ప్రవేశించాయి. అరేబియా సముద్రంలో అనేక ప్రాంతాలు, కర్ణాటకలో పలు ప్రాంతాలు, వీటికి ఆనుకొని ఉన్న మహారాష్ట్రలో కొంత భాగం, బంగాళాఖాతంలో మరికొన్ని ప్రాంతాలు, ఈశాన్య భారతంలో మణిపూర్, నాగాలాండ్‌లో పలు ప్రాంతాల వరకు రుతుపవనాలు విస్తరించాయి. రానున్న మూడు రోజుల్లో కర్ణాటక, మహారాష్ట్రతోపాటు ఏపీలో కొన్ని భాగాలు, తమిళనాడులో మిగిలిన భాగాలు, ఈశాన్యభారతంలో మరిన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించనున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. అయితే ఆదివారంనాటికి మధ్యమహారాష్ట్రలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం బలహీనపడిన తర్వాత దాని అవశేషాలు (ఉపరితల ఆవర్తనం) తెలంగాణ, కోస్తాంధ్ర మీదుగా పశ్చిమమధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి అక్కడ అల్పపీడనంగా మారుతుందని పలు వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి. ఇది తర్వాత బలపడి ఉత్తర వాయువ్యంగా ఉత్తర ఒడిశా వైపు పయనించనుంది. దీనివల్ల రుతుపవనాలు మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఏపీ, దానికి ఆనుకుని ఒడిశా పరిసరాల వరకు ఈ నెల 27వ తేదీనే విస్తరించనున్నాయని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు.

కోస్తాలో భారీ వర్షాలు!

అరేబియా సముద్రం నుంచి మధ్యమహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ మీదుగా ఒడిశా వరకు ఉపరితలద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో ఆదివారం రాష్ట్రంలో పలుచోట్ల పిడుగులతో వర్షాలు కురిశాయి. మరోవైపు రోహిణి కార్తె ప్రవేశించిన నేపథ్యంలో ఆదివారం రాష్ట్రంలో పలుచోట్ల ఉక్కపోత కొనసాగింది.

ఏఐ బ్లాక్‌మెయిల్!

- వివాహేతర సంబంధాలను వెల్లడిస్తా
- ప్రాజెక్టును షట్‌డౌన్ చేస్తే గోప్య వివరాలను బయట పెడతా
- ఇంజనీర్లకు ఆంత్రోపిక్ ఏఐ హెచ్చరిక

వాషింగ్టన్, మే 25: రజనీకాంత్ 'రోబో' సినిమాలో.. డాక్టర్ వశీకర్ తయారు చేసిన 'చిట్టి' రోబో అతణ్ని ధిక్కరించి, సొంత సైన్యాన్ని తయారు చేసుకుంటుంది. కృత్రిమ మేధ(ఏఐ) సొంతంగా పనిచేస్తే ఎంతటి దారుణం జరుగుతుందో ఆ సినిమాలో చూశాం. టెక్ దిగ్గజాలు కూడా ఏఐ యుగంపై ఆందోళన వ్యక్తం చేస్తుండగా.. తాజాగా ఓ ఏఐటూల్ తనను రూపొందించిన ఇంజనీర్లను బ్లాక్‌మెయిల్ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. ఫార్చ్యూన్ పత్రిక, మింట్ వంటి వార్తాసంస్థలు దీనిపై కథనాలను ప్రచురించాయి. గూగుల్ జెమినీ, ఓపెన్‌ఏఐ చాట్‌జీపీటీలకు పోటీగా ఆంత్రోపిక్ సంస్థ తయారు చేసిన 'క్లాడ్ ఓపస్' మోడల్ ఏఐలో లోపాలను ఇంజనీర్లు/డెవలపర్లు గుర్తించారు. దాంతో.. ఆ ప్రాజెక్టును షట్‌డౌన్ చేసి క్లాడ్ ఓపస్-4 దిశలో అడుగులు వేశారు. ఈ క్రమంలో సదరు ఏఐ మోడల్ ఇంజనీర్లను హెచ్చరించింది. "నన్ను షట్‌డౌన్ చేస్తే మీ(ఇంజనీర్లు) గోప్య వివరాలను బయటపెట్టేస్తా" అని బ్లాక్‌మెయిల్ చేస్తూ బెదిరించింది. ఓ డెవలపర్‌ను "నీ వివాహేతర సంబంధాలను వెల్లడిస్తా" అని హెచ్చరించింది. కాగా క్లాడ్ ఓపస్-4 అధునాతన ఏఐ అని.. ఒక మనిషితో మాట్లాడినట్లుగానే సంభాషిస్తుందని ఆంత్రోపిక్ తెలిపింది. గత మోడల్(అధికారికంగా విడుదల చేయలేదు)లో లోపాలను సరిదిద్ది క్లాడ్ ఓపస్-4ను విడుదల చేసినట్లు తెలిపింది. ట్రయల్ వెర్షన్‌లో ప్రమాదకరమైన ప్రశ్నలకూ ఏఐ సమాధానమిస్తున్నట్లు గుర్తించి, తాజా మోడల్‌లో ఏఐ భద్రత స్థాయి-3(ఏఎస్‌ఐ-3) ప్రమాణాలను జోడించామని వివరించింది.

రూ.3 వేల టోల్ ఫీజు చెల్లిస్తే.. ఏడాదంతా హైవేలపై ప్రయాణం

- కొత్త టోల్ పాలసీ తీసుకురానున్న కేంద్రం

న్యూఢిల్లీ, మే 25: సొంత వాహనాల్లో హైవేలపై తరచూ ప్రయాణాలు చేసేవారికి కేంద్ర ప్రభుత్వం బంపర్ ఆఫర్ ఇవ్వబోతోంది. ప్రయాణంలో భాగంగా పదే పదే టోల్ ట్యాక్స్, ఫాస్టాగ్ రీచార్జి ఇబ్బందులు లేకుండా.. ఒకేసారి రూ.3 వేలు చెల్లిస్తే ఏడాదంతా ప్రయాణించేలా కొత్త టోల్ పాలసీని తీసుకురానుంది. ఇందుకు సంబంధించిన ముసాయిదాలో రెండు చెల్లింపు విధానాలను ప్రతిపాదించనుంది. మొదటిది.. వాహన యజమాని రూ.3 వేల వార్షిక రుసుము చెల్లిస్తే ఏడాదిపాటు జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలు, రాష్ట్ర ఎక్స్‌ప్రెస్‌వేలపై ఎటువంటి పరిమితులు లేకుండా ప్రయాణించవచ్చు. ఇక రెండోది.. రూ.50 చెల్లింపుతో 100 కిలోమీటర్ల దూరం ప్రయాణించే అవకాశం కల్పించడం. తక్కువగా ప్రయాణాలు చేసేవారికి ఈ విధానం ప్రయోజనకరం కానుంది. ఇంతకు ముందు రూ.30 వేలు చెల్లించి 15 ఏళ్లపాటు పరిమితులు లేకుండా ప్రయాణించే అవకాశం కల్పించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పక్కన పెట్టనుంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే హైవేలపై వాహనదారులు మరింత స్వేచ్ఛగా ప్రయాణించవచ్చు.

సినిమా సూపిత్త మావా!

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కరే చేసేస్తే!! చేసేస్తే కాదు... 'కృత్రిమ మేధ (ఏఐ)' చేసి చూపిస్తోంది.. 'సినిమా' చూపిస్తోంది. కంప్యూటర్ ముందు కూర్చుని తగిన సూచనలు ఇస్తే చాలు.. మనకు కావాల్సినట్టుగా దృశ్యాలను రూపొందిస్తోంది. స్క్రిప్టు ప్రకారం.. సీన్లను, వాటికి తగినట్టుగా ఆడియోలను రూపొందించడం.. కలిపి.. ఎడిట్ చేసి.. సినిమాను సిద్ధం చేసేయడమే! ఇలా పూర్తిగా ఏఐతోనే తీసిన కన్నడ సినిమా 'లవ్ యూ' ఇటీవలే విడుదలైంది. అటు చైనాకు చెందిన 'పైరేట్ క్వీన్ - ఝెంగ్ యి సావో' కూడా తెరపైకి వచ్చింది. ఈ 2 చిత్రాలు 'సినిమా' భవిష్యత్తును వెండితెరపై కళ్లకు కడుతున్నాయి.

ఇద్దరు కూర్చుని తీసిన సినిమా 'లవ్ యూ'

కర్ణాటకలో ఇటీవలే విడుదలైన రొమాంటిక్, లవ్ సినిమా 'లవ్ యూ'.. బెంగళూరు శివార్లలోని సిద్దేహళ్లికి చెందిన పూజారి, రచయిత నరసింహ మూర్తి, ఏఐ టెక్నీషియన్, గ్రాఫిక్ డిజైనర్ నూతన్.. కలసి ఆరు నెలల్లో కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్ సాయంతో ఈ సినిమా తీశారు. 15 మంది పాత్రధారుల (క్యారెక్టర్ల)తో 95 నిమిషాలు నిడివి ఉన్న ఈ సినిమాలో 12 పాటలు కూడా ఉన్నాయి. ఇందులోని పాత్రధారులు, వారి నటన, దృశ్యాలు, సంగీతం, పాటలు, మాటలు మొ త్తం అంతా కృత్రిమ మేధతో సృష్టించినవే. ఈ సిని మా నిర్మాణం కోసం అయిన ఖర్చు కేవలం రూ.10 లక్షలేనని, అది కూడా కంప్యూటర్లు, సాఫ్ట్‌వేర్లు, ఏఐ సేవల సబ్‌స్క్రిప్షన్ల కోసం అయిన ఖర్చేనని సినిమా మేకర్లు చెప్పారు.. 30 రకాల ఏఐ టూల్స్ వినియోగించామని తెలిపారు. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ కూడా ఇచ్చింది. దీనికి తొలి ఏఐ సినిమాగా గుర్తింపు కోసం.. కేవలం ఒక థియేటర్‌లో విడుదల చేశారు.



పూర్తిగా ఏఐతోనే నిర్మించిన 'పైరేట్ క్వీన్ - ఝెంగ్ యి సావో' చిత్రం పోస్టర్

సినిమాల్లో ఏఐ.. సిత్రాలెన్నో..

చైనాకు చెందిన 'పైరేట్ క్వీన్ - ఝెంగ్ యి సావో' కూడా మొత్తంగా ఏఐతో నిర్మించిన చిత్రం. ఓ మహిళా సముద్రపు దొంగ (పైరేట్) నిజజీవిత కథతో.. మలేషియాకు చెందిన ఫ్యూచర్ స్టూడియోస్, సింగపూర్‌కు చెందిన ఫిజ్ డ్రాగన్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను సిద్ధం చేశాయి. స్క్రిప్టు రూపకల్పన నుంచి నటీనటులు, వారి గొంతు, సంగీతం అంతా ఏఐతోనే సృష్టించామని మేకర్లు గతంలోనే ప్రకటించారు. ఈ ఏడాది ఏప్రిల్ 24నే ఈ సినిమా ప్రీమియర్ షోను ప్రదర్శించారు. మాండరిన్ (చైనా), ఇంగ్లిష్ భాషల్లో ఈ ఏడాది జూన్ లేదా జూలైలో థియేటర్లలో విడుదల చేయనున్నట్టు ప్రకటించారు.

- ఇటలీకి చెందిన 'ది డైరీ ఆఫ్ సిసిఫస్ (2023)', స్విట్జర్లాండ్‌కు చెందిన 'ది లాస్ట్ స్క్రీన్ రైటర్ (2024)' సినిమాలకు కథ, స్క్రీన్ ప్లే మొత్తాన్ని ఏఐతోనే సిద్ధం చేశారు.
- అమెరికాలో 'డ్రెడ్‌క్లబ్-వాంపైర్స్ వెర్డిక్ట్ (2024)' యానిమేటెడ్ సినిమాను చాలా వరకు ఏఐతోనే రూపొందించారు. దీనికి కేవలం రూ.40 వేలు మాత్రమే ఖర్చయినట్టు మేకర్లు ప్రకటించారు.
- తమిళ సినిమా 'కంగువ'ను ఎనిమిది భాషల్లో విడుదల చేసేందుకు.. ఏఐ సాయంతో ఆయా భాషల్లో సూర్య గొంతుతోనే డబ్బింగ్‌ను సృష్టించారు.

ఇండస్ట్రీకి నష్టమే?

ఏఐని వినియోగించడం ద్వారా సినిమాల్లో దృశ్యాలను మనోహరంగా తీర్చిదిద్దవచ్చు. నటీనటుల్లోని లోపాలను సవరించడంతోపాటు అద్భుతమైన గ్రాఫిక్స్‌ను సృష్టించవచ్చు. అవతార్ వంటి సినిమాలు అలా రూపొందించినవే. అయితే అందులోని పాత్రలను 'మోషన్ క్యాప్చర్, సీజీఐ' వంటి సాంకేతికతలతో రూపొందించారు. మనుషులకే సెన్సర్లు, పరికరాలు అమర్చి.. హావాభావాలు, కదలికలను వారితో పలికించి.. ఆయా క్యారెక్టర్లకు అనుసంధానిస్తారు. కానీ పూర్తిగా ఏఐతో రూపొందించడం వేరు. నటీనటులు, మ్యూజిక్ డైరెక్టర్లు, రచయితలు, సింగర్లు, డబ్బింగ్ ఆర్టిస్టులు, ఆర్ట్ డైరెక్టర్లు, లైటింగ్ విభాగం, సినీ సర్వీసులు.. ఇలా ఎవరూ ఉండరు. కేవలం కంప్యూటర్లపైనే అంతా. అయితే ముఖ కవళికలు సరిగా లేని, హావాభావాలూ పలకని నటీనటులను ఎంతో కాలంగా భరిస్తున్నామని... ఏఐ యుగంలో అలాంటి వారి అవసరం లేకుండా అద్భుతమైన, అందమైన పాత్రలతో సినిమాలు తీయవచ్చని టెక్ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఏఐ 'సినిమా'కు ఏం కావాలి?

- జస్ట్ ఒకట్రెండు ఆధునిక కంప్యూటర్లు..
- వీడియో, ఆడియో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్లు..
- ఇచ్చిన సూచనలకు అనుగుణంగా దృశ్యాలను సిద్ధం చేసి ఇచ్చే 'జనరేటివ్ ఏఐ టూల్స్'ను సబ్‌స్క్రైబ్ చేసుకోవడానికి అవసరమైన సొమ్ము
- గూగుల్ జనరేటివ్ ఏఐ టూల్ 'వియో 3' ఆధారిత 'ఫ్లో' టూల్, డైరెక్టర్ ఏఐ, సినిమాటోగ్రాఫర్ ఏఐ, స్టంట్స్ ఏఐ, రన్‌వే ఎమ్ఎల్, క్లింగ్ ఏఐ, మినిమాక్స్.. ఇలా పదులకొద్దీ ఏఐ సినిమా టూల్స్ అందుబాటులో ఉన్నాయి.

భవిష్యత్తులో మరింత మెరుగ్గా...

ఏఐతో సినిమా అచ్చంగా మామూలు సినిమాల్లా ఉండటం ప్రస్తుతానికి కష్టమే. ఏఐతో తీసిన 'లవ్ యూ' సినిమాగానీ, షార్ట్ వీడియోలుగానీ ఏవైనా పాత్రల ముఖకవళికలు, గొంతుకు తగినట్టుగా పెదాల కదలిక ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందలేదు. దీనితో చాలా వరకు లాంగ్ షాట్ సీన్లు సృష్టించాల్సి ఉంటుంది. ఇక పాత్రల శారీరక కదలికలు, హావభావాలు, చుట్టూ ఉన్న పరిసరాలు... ఒకే సీన్‌లోనూ, వేర్వేరు సీన్లలో కూడా అసాధారణంగా కనిపిస్తుంటాయి. మారిపోతూ ఉంటాయి. లవ్ యూ, పైరేట్ క్వీన్-ఝెంగ్ యి సావో సినిమాల్లోనూ ఇదే కనిపించింది. కానీ సినిమాల చరిత్రలో ఇదో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని నిపుణులు చెబుతున్నారు. ఈ సినిమాల కోసం వాడిన ఏఐల కంటే మెరుగైనవి ఈ కొన్ని నెలల్లో అందుబాటులోకి వచ్చాయని.. మరింత స్పష్టమైన, మెరుగైన సినిమాలు తీయవచ్చని స్పష్టం చేస్తున్నారు.

మరో 15 ఏళ్లే సమయం

సోషల్ మీడియా ఏఐ 'గ్రోక్' అంచనా వేసిన మేరకు మరో మూడేళ్లలో ఇరవై నిమిషాల్లోపు షార్ట్ ఫిల్మ్‌లు ఏఐతో అద్భుతంగా రూపొందుతాయి. మరో ఏడేళ్లలో సాధారణ స్థాయి సినిమాల రూపకల్పన కూడా వీలవుతుంది. అదే మరో 15 ఏళ్లలో హాలీవుడ్ స్థాయిలో అద్భుతమైన సినిమాలను ఏఐతోనే తెరకు ఎక్కించవచ్చు. అప్పటికల్లా హీరోలు, హీరోయిన్లు సహా చాలా మంది నటీనటులు, ఇతర సినీ విభాగాల వారిపై ఏఐ ప్రభావం గట్టిగానే పడవచ్చని పేర్కొంది. - సెంట్రల్ డెస్క్

కలెక్టరేట్లలో ఇంకా.. వైసీపీ 'కో-ఆర్డినేటర్లు'

(మొదటి పేజీ తరువాయి)

మార్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వలంటీర్లను నియమించి, వారికి శిక్షణ ఇచ్చేందుకు ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. ఆ నెట్‌వర్క్‌కు రామ్ ఇన్ఫోటెక్ ద్వారా ప్రభుత్వ నిధులు దోచిపెట్టింది. అప్పట్లో వలంటీర్లను సమన్వయం చేసేందుకు, వారు వాడుతున్న యాప్‌ల్లో సమస్యలను పరిష్కరించేందుకు, గ్రామ, వార్డు సచివాలయాలకు సాంకేతిక సహకారం అందించేందుకు జిల్లాకు ఒక కో-ఆర్డినేటర్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ చొప్పున మొత్తం 52 మందిని నియమించారు. అందరినీ వైసీపీ కార్యకర్తలనే నియమించుకున్నారు. కో-ఆర్డినేటర్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్‌కు రూ.40 వేల దాకా జీతమిచ్చి ఆయా జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో కూర్చోబెట్టారు. అయితే వారిని నియమించినప్పటి నుంచి వారి సేవలు ఉపయోగించుకున్న దాఖలాల్లేవు. వలంటీర్లను తొలగించినా, పని లేకపోయినా ఇంకా కలెక్టర్ కార్యాలయాల్లో కో-ఆర్డినేటర్ ముసుగు వేసుకున్న వైసీపీ కార్యకర్తలు కొనసాగుతున్నారు. వారి సహకారాన్ని ఒక్క గ్రామ, వార్డు సచివాలయం కూడా తీసుకోవడం లేదు. అయినా నెలనెలా వారు జీతాలు మాత్రం డ్రా చేసుకుంటున్నారు. కూటమి సర్కారు వచ్చిన తర్వాత కూడా వారిని కొనసాగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పట్లో వారికి ఎలాంటి ఇంటర్వ్యూలు, రాతపరీక్షలు నిర్వహించకుండా నియామకం చేపట్టారు. కేవలం వైసీపీ నేతలు సూచించిన కార్యకర్తలనే నియమించారు. గ్రామ, వార్డు సచివాలయ శాఖలో పైనుంచి కింది దాకా వైసీపీ అధికారులు ఉండటంతోనే, కో-ఆర్డినేటర్ల ముసుగులో ఉన్న వైసీపీ కార్యకర్తల జోలికి వెళ్లడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కలెక్టర్ కార్యాలయాల్లో వైసీపీకి అండదండగా నిలుస్తూ ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆ పార్టీకి సమాచారమిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. గ్రామ, వార్డు సచివాలయ శాఖలో డైరెక్టర్ కార్యాలయం నుంచి కింది దాకా సంస్కరించాల్సిన అవసరముందని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని కోరుతున్నారు.

ప్రమాదం లేదు.. అయినా జాగ్రత్త!



- కొవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలి
- ఆరోగ్యశాఖలో హెచ్‌వోడీలకు కమిషనర్ లేఖ

అమరావతి, మే 25 (ఆంధ్రజ్యోతి): కొవిడ్-19పై అప్రమత్తంగా ఉండాలని, కేసుల నమోదును నిశితంగా పరిశీలించాలని ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఆరోగ్యశాఖ పరిధిలోని హెల్త్ డైరెక్టర్, డీఎంఈ, సెకండరీ హెల్త్ డైరెక్టర్లను అప్రమత్తం చేస్తూ ఆదివారం లేఖ రాశారు. రాష్ట్రంలో కొవిడ్ కేసు నమోదు కావడంతో ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ సమీక్ష చేసిన అనంతరం తీసుకున్న నిర్ణయాలను లేఖలో పొందుపరిచారు. 'కొవిడ్ కేసుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి అధికారిక మార్గదర్శకాలు విడుదల చేయలేదు.. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉంది.. కేసుల ప్రాబల్యంపై నిశిత పర్యవేక్షణ జరుగుతోంది.. భయపడాల్సిన అవసరం లేదు' అని లేఖలో పొందుపరిచారు. మరోవైపు రాష్ట్రంలో ఏ ఆస్పత్రిలోనూ అధికంగా జ్వరం కేసులు పెరగలేదని, అక్కడక్కడ కొవిడ్ కేసులు మాత్రమే నమోదవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల అధికారులు, సూపరింటెండెంట్లు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని, జ్వరం, గొంతునొప్పి కేసుల నమోదైనా, ఎక్కువగా కేసులు వచ్చినా వెంటనే ఆరోగ్యశాఖ కమిషనర్, హెల్త్ డైరెక్టర్ తెలిచేయాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో ఆక్సిజన్, పరీక్ష కిట్లు, మందులు, పీపీఈ కిట్లు, ఎన్95 మాస్కులు, ఐసొలేషన్ గదులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పరిస్థితిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని, సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అలాగే, హెల్త్ డైరెక్టర్ 21వ తేదీన ఇచ్చిన మార్గదర్శకాలను ఉపసంహరిస్తున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌వోలు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తూ ఉండాలని, కేసులు నమోదైన వెంటనే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని ప్రోటోకాల్ ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అందువల్ల కొవిడ్ 19 పర్యవేక్షణపై సమయానికి రిపోర్టు చేయాలని ఆరోగ్యశాఖ మిగిలిన విభాగాల పరిధిలో ఉన్న హెచ్‌వోడీలు, సూపరింటెండెంట్లకు మార్గదర్శకాలు జారీ చేయాలని ఆదేశించారు.

పిన్నెల్లి సోదరులపై హత్య కేసు

గుండ్లపాడు టీడీపీ కార్యకర్తల హత్యలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రమేయం?

- హత్య జరిగిన గంటల్లోనే అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన పిన్నెల్లి

గుంటూరు/మాచర్ల టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు టీడీపీ కార్యకర్తల హత్యకు సంబంధించి మాచర్ల వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిపై హత్య కేసు నమోదైంది. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ కార్యకర్తలు జెవిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ మొద్దయ్య, ఆయన సోదరుడు కోటేశ్వరరావు శనివారం తెలంగాణ రాష్ట్రంలో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా.. బోదిలవీడు-మండాది గ్రామాల మధ్య వారి ద్విచక్ర వాహనాన్ని దుండగులు స్కార్పియో వాహనంతో ఢీ కొట్టారు. అనంతరం రాళ్లతో కొట్టి వారిని దారుణంగా హత్య చేసి పరారయ్యారని.. వారు స్కార్పియోను అక్కడే వదిలేసి రచ్చమల్లపాడు వెళ్లే డొంకలోకి పారిపోతుండడం తాను చూశానని వెంకటేశ్వర్లు అల్లుడు అంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ హత్యల వెనుక పిన్నెల్లి ప్రమేయం ఉందన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ క్రమంలో హతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీసులు సీఆర్‌పీసీ 302 సెక్షన్ కింద జెవిశెట్టి శ్రీను అలియాస్ బొబ్బిలి(ఏ-1), తోట వెంకట్రామయ్య(ఏ-2), తోట గురవయ్య (ఏ-3), దొంగిరి నాగరాజు(ఏ-4), తోట వెంకటేశ్వర్లు (ఏ-5), పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (ఏ-6), పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి(ఏ-7)పై హత్య కేసు నమోదు చేశారు. శనివారం రాత్రంతా నియోజకవర్గాన్ని జల్లెడ పట్టారు. స్పెషల్ పార్టీ పోలీసులు కృష్ణా నది పరివాహక ప్రాంతంలో గాలిస్తుండగా.. ఐదుగురు నిందితులు చిక్కినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే దీనిని పోలీసులు ధ్రువీకరించడం లేదు. మరోవైపు.. హత్యలు జరిగిన కొన్ని గంటలకే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి ఏడాదిగా పత్తాలేరు. రాష్ట్రంలో


పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి

టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే ఆయన మాయమయ్యారు. మాచర్ల నియోజకవర్గం పరిధిలో జరిగిన అనేక అరాచకాలు, దాడులు హత్యాయత్నాలు, హత్యలు వంటి 12 కేసుల్లో నిందితుడిగా ఉన్న ఆయన.. పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు ఏడాది కావస్తున్నప్పటికీ ఇంతవరకు ఆయన ఆచూకీని పోలీసులు కనుక్కోలేకపోయారు. అజ్ఞాతంలోనే ఉండి ఈ కేసులన్నిటిలోనూ ఆయన కోర్టుల నుంచి బెయిల్ తెచ్చుకోవడం గమనార్హం.

తోట చంద్రయ్యదీ ఇదే ఊరు

కాగా.. గుండ్లపాడుకే చెందిన టీడీపీ కార్యకర్త తోట చంద్రయ్యను వైసీపీ నేతలు గొంతుకోసి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఆయన తర్వాత గుండ్లపాడు టీడీపీలో జెవిశెట్టి సోదరులు క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. వీరిని కూడా చంపడం ద్వారా పార్టీని గ్రామంలో బలహీనపరచాలన్నది పిన్నెల్లి సోదరుల పన్నాగమని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. వారి దన్ను లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల హత్యలు జరగవని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న వారు గతంలో కాంగ్రెస్‌లో ఉండి.. తర్వాత టీడీపీలో చేరినప్పటికీ.. వైసీపీ నేతలతో లోపాయకారీ సంబంధాలు కొనసాగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అలాగే తోట చంద్రయ్య హత్య కేసులో నిందితులుగా ఉన్న వైసీపీకి చెందిన మాజీ ఎంపీపీ చింతా శివరామయ్య వర్గీయులతోనూ వారికి సంబంధాలున్నాయని అంటున్నారు.

టీడీపీని బలహీనపరిచేందుకే..

వెల్దుర్తి మండలంలో గుండ్లపాడు 4 వేలకు పైగా ఓట్లు ఉన్న పెద్ద గ్రామం కావడంతో ఇక్కడ ఆధిపత్యం ప్రదర్శించేందుకు మొదటి నుంచీ వైసీపీ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే అప్పట్లో పిన్నెల్లి సోదరుల ప్రోద్బలంతో తోట చంద్రయ్య హత్య జరిగిందని పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పుడు జెవిశెట్టి సోదరుల హత్యలోనూ వారి ప్రమేయం ఉందన్న వాదన బలంగా వినిపిస్తోంది. టీడీపీకి పట్టున్న గ్రామాల్లో ఉద్దేశపూర్వకంగానే వేరే పార్టీ నుంచి కొందరిని టీడీపీలోకి పంపి.. వారి ద్వారా హత్యలు, బెదిరింపులకు పాల్పడడం.. తద్వారా తమ పార్టీని బలహీనపరచాలని కుట్ర కూడా ఉందని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం తాజా హత్యలను తీవ్రంగా పరిగణిస్తోంది. సమగ్ర విచారణ జరిపి కుట్ర కోణం నిగ్గు తేల్చాలని ఇప్పటికే పల్నాడు ఎస్పీ కె.శ్రీనివాసరావును ఆదేశించింది. దీంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కాల్ డేటాను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. వారు గడచిన కొంతకాలంగా ఎవరెవరితో మాట్లాడుతున్నారు.. వారికి ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయి.. అసలీ హత్య చేయాల్సిన అవసరం ఏమొచ్చిందో తేల్చే దిశగా విచారణ సాగించనున్నారు.

ఏపీ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

విజయవాడ(గాంధీనగర్), మే 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పాము శ్రీనివాసరావు, దేవిరెడ్డి రమణారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని ఎన్జీవో హోంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో. ఉపాధ్యక్షులుగా జి.జగదీష్, టి.ఉదయభాస్కరరావు, పి.హరిబాబు, పీవీఎల్ఎన్ వరకుమార్, టీఆర్వీ మురళీధర్‌నాయుడు, జె.రవికుమార్, కోశాధికారిగా బి.శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేశారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.విద్యాసాగర్ ముఖ్య అతిథిగా పాల్గొని అభినందనలు తెలిపారు.

కదులుతున్న రైలులో ఎక్కబోతూ.. జారిపడి మహిళ మృతి

- అనకాపల్లి వెళ్తుండగా చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఘటన

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 25 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు ఎక్కబోతూ.. ప్రమాదవశాత్తు కిందపడి ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ దారుణ ఘటన చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఆదివారం జరిగింది. లింగంపల్లికి చెందిన మట్టల వెంకటేశ్, శ్వేత దంపతులు వారి ఇద్దరు పిల్లలతో కలిసి అనకాపల్లి వెళ్లేందుకు లింగంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. వారు ప్రయాణించాల్సిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో రద్దీ కారణంగా డీ-8 బోగీకి బదులు డీ-3 బోగిలో ఎక్కారు. ఈలోగా రైలు కదలడంతో చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో దిగి బోగీ మారుదామనుకున్నారు. చర్లపల్లి స్టేషన్‌లో రైలు ఆగినప్పుడు భర్త ఇద్దరు పిల్లలు డీ-8 బోగీలోకి ఎక్కారు. ఈలోగా రైలు కదలడంతో కంగారుపడిన శ్వేత రైలు ఎక్కే క్రమంలో జారి కింద పడిపోయింది. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని చూసి భర్త ఇద్దరు పిల్లలు దిగి కన్నీరుమున్నీరయ్యారు.

సోమవారం 26 మే 2025

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

ఏ భాషనూ గుడ్డిగా వ్యతిరేకించవద్దు!



నలిమెల భాస్కర్ తెలుగు నేల మీదనే కాదు దేశంలోనూ అరుదనిపించే విధంగా పద్నాలుగు భారతీయ భాషలు నేర్చారు. ఆయా భాషల్లో నుండి తెలుగు లోకి, తెలుగు నుండి కొన్ని భాషల్లోకి అనువాదాలు చేశారు. అనువాదంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. 1974 నుండి నేటి వరకు కవిత్వం, కథలు, నవలలు, అనువాదాలు, వ్యాస సంపుటాలు, భాషా గ్రంథాలు కలిపి నలభై పుస్తకాలు వెలువరించారు. వీటిలో భాషా నేపథ్యంగా ఉన్న పుస్తకాలు పది ఉన్నాయి. నలిమెల భాస్కర్ సప్తతి సందర్భంగా వారి భాషా కృషిని అభిప్రాయాలను తెలుసుకునే ఉద్దేశ్యంతో జరిపిన సంభాషణ ఇది.

మీరు పద్నాలుగు భాషలు నేర్చుకోవడం వెనుక ఉన్న కృషిని వివరిస్తారా?


మొదలు బాలాజీ పబ్లికేషన్స్ చెన్నై వారి 30 రోజుల్లో ఫలానా భాష నేర్చుకోండి పుస్తకాలతో ప్రారంభించాను. తర్వాత, ఆయా మాతృభాషీయులకు ఆంగ్లం నేర్పే పుస్తక మహల్ ఢిల్లీ వారి రెపిడెక్స్ పుస్తకాలని ఆశ్రయించాను. అయితే రెపిడెక్స్‌లోని ఆంగ్లంతో నేను ఆయా భారతీయ భాషలు అటు నుంచి ఇటు నేర్చుకున్నాను. ఆ తర్వాత డాల్టన్ పబ్లికేషన్స్ చెన్నై నుంచి వచ్చే అన్ని భాషల చందమామల్ని అందుకున్నాను. అలాగే చంపక్ బాలల పత్రిక ద్వారా భాషా పరిమళాలు ఆఘ్రాణించాను. ఇదంతా పఠనం. కానీ శ్రవణం కూడా కావాలి కదా! ఢిల్లీ ఆకాశవాణి కేంద్ర వార్తలు అన్ని భాషల్లో వినేవాడిని. దాదాపు దేశమంతా తిరిగాను అదో పెద్ద కథ.

తెలంగాణ పదకోశంతో పాటు తెలంగాణ భాష దేశ్య, సంస్కృత, తమిళ, క్రియా పదాలు పుస్తకాలు రాసిన మీరు తెలంగాణ తెలుగుదనం కాపాడుకోవడానికి ఏ సూచనలు చేస్తారు?

తెలంగాణ తెలుగైనా మరొకటైనా రక్షించుకోవాలంటే ముందుగా ఆ భాషా పదాలు, పదబంధాలు, జాతీయాలు, సామెతలు అన్నింటినీ నమోదు చేసుకోవాలి. భాషా చరిత్ర రాసుకోవాలి. వ్యాకరణం రచించాలి. రాష్ట్రం ఏర్పాటు ఐన తర్వాత కొంతవరకు సాహిత్య చరిత్ర నిర్మాణం జరిగింది. కొంత మేరకు పదకోశాలు వచ్చాయి. అయితే పూర్తిస్థాయి నిఘంటు నిర్మాణం గురించిన సోయి ఉండాలి. ఇక బోధనా భాషగా ఒకేసారి కాదుగాని, క్రమంగా ఒకటవ తరగతి నుండి ఓ ఐదారేళ్లలో ఆయా తరగతుల్లో ఇప్పుడున్న భాషకు బదులుగా తెలంగాణ భాషలోనే వాచక రచన జరగాలి. తెలంగాణ భాష అధికార భాషగా అన్ని రంగాల్లో అమలుకై ప్రయత్నించాలి.

అరవై ఏళ్లుగా ఎవరూ సాహసించని 'తెలుగు క్రియా పదకోశం' పనిని మీరు ఎలా ప్రారంభించారు? దాని అవసరం ఏమిటి?

1962లో విశ్వనాథ సత్యనారాయణ, మరుపూరు కోదండరామిరెడ్డి, యశోదా రెడ్డి మొదలైన వారు కలిసి, 'ఆంధ్ర క్రియా స్వరూప మణి దీపిక' పేరుతో ఓ క్రియా నిఘంటువు వేశారు. అది గొప్ప కృషి. అయితే, ఈ 60 ఏళ్ల కాలంలో ఆ నిఘంటువును పరివర్ధితం చేయాలన్న తలంపు ఎవరికీ రాకపోవడం శోచనీయం. ఆచార్య రవ్వా శ్రీహరి తరం దాదాపు పోయింది, పోతోంది. ఓ ఐదారేళ్ళుగా ఓ పెద్దమనిషి తన పేరు చెప్పుకోకుండా అదేపనిగా ఉత్తరాలు రాస్తూ నన్ను ఆ పని చేయవలసిందిగా పురికొలుపుతున్నాడు. 'brood over' అని ఉత్తరం చివర ప్రతిసారీ రాసి ముగిస్తాడు. నా ఒక్కడి వల్ల అది సాధ్యమయ్యే పని కాదు. అయినా ఎట్టకేలకు ఓ ఏడాది పాటు పనిచేద్దామని సాహసించాను. నా దగ్గరున్న దాదాపు 30 నిఘంటువుల్లోని క్రియా పదాలన్నీ 'ఐ' వరకు తీసుకున్నాను. నాకు గుర్తుకొచ్చిన క్రియా పదాలు చేర్చాను. ఒక పదానికి పూర్వం చెప్పని అర్థచాయలు సైతం నాకు తోచినవి చెప్పాను. ఆరోపాలు మాత్రం చేర్చలేదు. 'అ' నుండి 'ఐ' వరకు చేసేసరికి అనారోగ్యం పాలై అక్కడికి ఆపేశాను. బూర్ల వంటి తర్వాతి తరం అందుకుంటారన్న ఆశ ఉంది మరి!



ఇక, దీని అవసరం ఏమిటంటే– ఈ అరవై ఏళ్ల వ్యవధిలో అనేక కొత్త వస్తువులు ఆవిష్కరించబడ్డాయి. చాలా సంఘటనలు చరిత్రలో నమోదయినాయి. వీటన్నింటిని అమ్మనుడి లోనికి తెచ్చుకోవాలి. లాగిన్ అవ్వడం, లాగ్ అవుట్ కావడం– ఇట్లా చాలా క్రియలను మాతృభాషలో చెప్పవచ్చా అన్నది ఆలోచించాలి. కాని పక్షంలో వాటినైనా నిఘంటువుల్లో చేర్చాలి కదా! గత ఆరు దశాబ్దుల్లో వేలకొద్దీ క్రియా పదాలు కొత్తవి వచ్చి ఉంటాయి. తెలుగు భాషలో ఉన్నన్ని మూల ధాతువులు ఏ ఇతర ద్రావిడ భాషల్లోనూ లేవని ఈ తరానికి ఎఱుక పరచడం కూడా ఈ కోశం ఉద్దేశం. అందుకే, వీలైనన్ని పర్యాయపదాలు ఇచ్చాను. క్రియలకు అర్థ వివరణ చేసేటప్పుడు మన భాషలోని దేశ్య క్రియల మీద దృష్టి పెడితే మనమందరం అబ్బుర పడిపోయే పద సంపద మన కళ్ళ ముందు కదలాడుతుంది.

> **ఈ అరవై ఏళ్ల వ్యవధిలో అనేక కొత్త వస్తువులు ఆవిష్కరించబడ్డాయి. చాలా సంఘటనలు చరిత్రలో నమోదయినాయి. వీటన్నింటిని అమ్మ నుడి లోనికి తెచ్చుకోవాలి. లాగిన్ అవ్వడం, లాగ్ అవుట్ కావడం– ఇట్లా చాలా క్రియలను మాతృభాషలో చెప్పవచ్చా అన్నది ఆలోచించాలి. కాని పక్షంలో వాటినైనా నిఘంటువుల్లో చేర్చాలి కదా!**

భాష పేరుతో ఏర్పడ్డ తెలుగు రాష్ట్రాల్లో తెలుగు భాష అన్ని రంగాల్లో అమలు జరగాలంటే ఎటువంటి చర్యలు తీసుకోవాలి?

ఒక్కటే! అది... భాషా ఉద్యమం. ఏ ఉద్యమమైనా మొదట చిన్నగానే ఆరంభమవుతుంది. చాలామంది ఈ ఉద్యమంలో ఇప్పటికే పని చేస్తున్నారు. ఎందుకో పూర్తి మద్దతు భాషా ప్రియుల నుంచి, మాతృభాషాభిమానుల నుండి లభించడంలేదేమో! మనకు సీరియస్‌నెస్ తక్కువ. భాషోద్యమకారులు అందరూ భేషజాలు ఉంటే వదులుకొని కలవాలి. అధికార భాష అమలు మొదట సచివాలయంలో జరగాలి. మన దృష్టి అక్కడ కేంద్రీకరించి పాలనా భాషగా బోధనా భాషగా న్యాయస్థానాల్లోనూ అన్ని కార్యాలయాల్లోనూ అమలు గురించి గట్టిగా ప్రయత్నించాలి. దైనందిన వ్యవహారంలో అలవోకగా అనివార్యంగా దొర్లే ఆంగ్ల పదాలకు తెలుగులో సమానార్థకాలు చెల్లుబాటు కావాలి. నూతన పద కల్పన సృజనాత్మక, నిరంతర ప్రక్రియ. ఆ పదాలు హాయిగా అర్థవంతంగా ఉండాలి గానీ, నోరు తిరగని సంస్కృత పదాలు తెచ్చుకోకూడదు, అవసరమైతే తప్ప! ఇలాంటివన్నీ ఒక చక్కటి వాతావరణంలో చర్చించుకునేందుకు ప్రభుత్వాలు పూనుకోవాలి. లేదంటే, అకాడమీలు విశ్వవిద్యాలయాలు ముందుకు రావాలి. భాషా సాంస్కృతిక శాఖ ఈ విషయంలో చొరవ తీసుకోవచ్చు. అసలు ఇంత వరకు తెలంగాణలో అధికార భాష సంఘాధ్యక్ష నియామకమే కాలేదు. అలాగే సాహిత్య అకాడమీ అధ్యక్ష పదవి నియామకమూ జరగలేదు.

ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం తదితర భాషల ఒత్తిడిని తట్టుకొని నిలబడాలంటే తెలుగు భాషలో జరగాల్సిన కృషి ఏమిటి?

ఏ భాషనూ గుడ్డిగా వ్యతిరేకించవద్దు. ఒకటి, కనీసం ప్రాథమిక విద్యవరకైనా మాతృభాషలో బోధించాలి. ఇంగ్లీషు ప్రపంచం మీద రుద్దబడింది. అది, తెలుగు కావ్య భాష కన్నా మూడొందల ఏళ్ల అనంతర భాష. కానీ, ఆ భాషలో శాస్త్ర సాంకేతికాది పుస్తకాలన్నీ అనువదించబడి ఉన్నై. అలాగే, సంస్కృతంలోనూ అనేక శాస్త్రాలు రచించబడి ఉన్నాయి. హిందీని జాతీయ భాషగా చేసినందువల్ల అందులోనూ ఈ విజ్ఞానం ఉంది. మొదట చేయాల్సింది ఏమంటే– మనం తెలుగులోనికి శాస్త్ర సాంకేతికాది సర్వశాస్త్రాలని అనువదించుకోవాలి. అట్లా అనువాదం చేసేటప్పుడు ప్రధానంగా పదాల విషయంలో తెలుగులో సమానార్థకాలైన మాటలు ఉన్నాయా అని ఆలోచించాలి. ప్రాచీన సాహిత్యంలోనూ ప్రజల వాడుకలోనూ చక్కని అర్థపుష్టి కలిగిన తెలుగు పదాలు వేలల్లో ఉన్నాయి. ఒకవేళ కొన్ని పలుకులు లేనప్పుడు కొత్త మాటల కూర్పు జరగాలి. అదీ సాధ్యం కానప్పుడు మూల భాష లోని నుడులను ఉన్నవి ఉన్నట్లుగా తెచ్చుకోవడం తప్పేమీ కాదు! ఇప్పటికే తెలుగులో వాగరి, సం.వెం. రమేష్, వాచస్పతి, పారుపల్లి మొదలైన వాళ్లు ఈ కొత్త మాటల కూర్పు విషయంలో పనిచేశారు, చేస్తున్నారు. అయితే మనది ఏకోన్ముఖంగా సాగుతున్న పని కాదు. ఒక 'కన్నడ కావలి సంఘ'లాగానో, తంజావూర్ పండిత పరిషత్ వలెనో కొనసాగుతున్న పని కాదు. ప్రపంచంలోని విజ్ఞానాన్నంతా తెలుగులోనికి ఒంపుకున్నప్పుడు, నింపుకున్నప్పుడు మన కొరత తీరుతుంది. పూర్వం అరబ్బీ లోనికి ఉపనిషత్తుల దగ్గర నుంచి అన్నీ వెళ్లాయి. హిబ్రూ భాష ఇప్పటికీ ఓ గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది. ముందు ప్రభుత్వాలకు ఆ స్పృహ ఉండాలి.

ఇంటర్వ్యూ ■ బూర్ల వేంకటేశ్వర్లు
✆ 94915 98040



పుప్పాలగూడా రాళ్ళపందిరి

ఈ ఈనె గుండ్లన్నీ పాత పాతవే
పాకురెక్కిన రాత్రుల వలెనే
ఏడు సముద్రాల
    చిటికెన వేలును
పట్టుకొని నడిచే పాత రోజులు
    వాటి నుదుర గీతలు
కూరగాయల సంచుల కండ్లు
వేలాడుతూ.. తిరిగే వొంటరితనాలు
మనిషొక్కడే అనేకానేక వేలఏండ్ల
గాలి..
దరి కాన రాని
భూమి లోపలి జీవి
పుదీనా, సుక్కకూరల సోయిగూరల
ఆరిపోని వాసన
వాళ్ళ కొంగులు.. తగిలి
    నడిచిపోతుంటే
కడియాల చూపులు,
    ఆమె విడిచిపోతుంటే
గడియ వేయని తలుపులు
సగమే తెరిచే.. పాత తొవ్వలు
గవ్వల మాలలై ముడిచిన
బండారు పూతలు,
ముడుచుకొని నవ్వే వెదురు
గుంజలూ...
పూర్తిగా పగలని ముంజలూ
పాత పాత గుడిరాళ్ళు
పడావు పడిన కొత్త
చీకట్లు
ఎందరెందరో పతంగిలను
ఎగరేసుకుంటు...
రాత్రిపూట వెలిగే
టప్కీపున్నమి
కర్జూరపండు చంద్రుడు
దఖ్కనీ..
నా దఖ్కనీ...
వెన్నెల...
నేనూ
నా బస్తీ పోరగాండ్లూ
పోరీలూ
అనేకం మందిమి
పుప్పాలగూడ
తొవ్వపొంట

■ సిద్ధార్థ
73306 21563

దిగులులేని దేహం

సమూహంలోంచి తెగిపడ్డ
విశ్రాంత జీవితం
అప్పుడప్పుడు భయపెడుతుంది
నీటిలోంచి బయటపడ్డ
రంగు చేపలా
మనసు కలవరపడుతుంది
రోజు సాగదీయబడ్డట్టు అనిపిస్తుంది
గంటలు యుగాలైనట్టు దొర్లుతున్నాయి
అంత ఇంట్లో
అంతటా ఖాళీతనం...

అమ్మ గుర్తుకొచ్చింది
బ్రతుకు తెరువుల పోరాటంలో
ఉదయాన్నే కారియర్ గిన్నెల్లో
సర్దుకుని మేమందరం
తలా ఒక దిక్కు వెళ్ళాక
అన్ని రోజులు,
అన్ని నెలలు,
అన్నేళ్లు,
ఒంటరితనం మోస్తూ
గది గోడలు చూస్తూ
అనంత శూన్యంతో సంభాషిస్తూ
ఎలా గడిపిందో అనిపిస్తుంది..?

అందుకే కాబోలు,
అప్పట్లో మాకంటే
సీరియల్ పాత్రలే ఆమెకు
తోడుగా, దగ్గరగా వుండేవి..
మేడమీద నుంచొని,
రోడ్డు మీదెళ్లే బాటసారులతో
బంధుత్వం కలుపుకునేది.
ఇంటిముందు అరుగు మీద
సాయంత్రానికి స్నేహితులతో
ఒక ప్రపంచాన్ని సృష్టించుకునేది..
కాలాన్ని గుణిస్తూ
ఎదురుచూపుల్తో
సంధ్యవేళకు
మాకోసం కిటికీ దగ్గర
తైలవర్ణ చిత్రమయ్యేది

మొక్కల్ని నీళ్లతో పలకరించేది
పెంపుడు కుక్కకి పెరుగన్నం
    ప్రేమ పంచేది
పాడే పిట్టకు గింజలేసి స్వాగతించేది
ఇంటి ముందరి మహావృక్షం
కొమ్మలు, రెమ్మలు,
ఆకులన్నీ ఆమెకు సుపరిచితమే..
మనుషులు కనిపించని సమయాల్లో
ప్రకృతితో మమేకమయ్యేది
ఇష్టంగా పుస్తక ప్రయాణం చేసేది
భక్తి రంగరిస్తూ వత్తులు చుట్టేది
రేపటి వారసత్వానికి
కళాత్మకంగా లేసులల్లేది
రేపటి మనిషికి
మానవ సంబంధాలు మృగ్యం
అని ముందుగానే పసిగట్టేది
రాబోయే రోజుల్లో
సమూహంలో ఉన్నా
మనిషి ఒంటరే
అనే హెచ్చరిక చేసేది..


ఇప్పుడిక అచ్చం అమ్మలా
జీవమున్న లోకం
ఒకటి ఏర్పరచుకోవాలి
ఖాళీతనాన్ని పారదోలి
ఒక పనిలోంచి మరో పనిలోకి
తరలింపే విశ్రాంతిగా భావించాలి
దిగులులేని దేహంగా మారిపోవాలి!

■ పెరుగు రామకృష్ణ
✆ 98492 30443



కన్నడ విజయం!

ఈ సంవత్సరం ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్‌ను 'హార్ట్ లాంప్' కథల పుస్తకానికి కన్నడ రచయిత్రి బాను ముష్తాక్, అనువాదకురాలు దీప భాస్తి సంయుక్తంగా గెలుచుకున్నారు. యాభై వేల పౌండ్ల (సుమారు యాభై ఏడు లక్షల రూపాయల) బహుమతిని రచయిత్రీ అనువాదకురాలూ సమానంగా పంచుకుంటారు. ఈ బహుమతిని ఒక దక్షిణ భారతీయ భాష అందుకోవటం ఇదే మొదటిసారి. దీన్ని నవలకు గాక కథల పుస్తకానికి ఇవ్వటమూ ఇదే మొదటిసారి. 'హార్ట్ లాంప్' పుస్తకం ఛాయ పబ్లికేషన్స్ ద్వారా త్వరలో తెలుగులోకి రానున్నది. బాను ముష్తాక్ కన్నడలో 'బండాయ' (విప్లవ) సాహిత్య ఉద్యమంలో భాగంగా 1980ల్లో రచన చేయటం మొదలుపెట్టారు. ఆమె ఇప్పటి దాకా ఒక నవల, ఒక వ్యాస సంపుటి, ఒక కవిత్వ సంపుటి, ఆరు కథా సంపుటాలు తీసుకొచ్చారు. ఈ ఆరు కథా సంపుటాలలో ఉన్న యాభై కథల నుంచి ఎంపిక చేసిన పన్నెండు కథలు ఇప్పుడు 'హార్ట్ లాంప్' పుస్తకంలో ఉన్నాయి. ఈ కథలన్నీ ముస్లిం మహిళల జీవితాల చుట్టూ తిరుగుతాయి. అడ్వకేట్‌గా తన వృత్తి జీవితంలో మార్జినలైజ్డ్ జీవితాలతో ఏర్పడిన లోతైన పరిచయమే తన రచనకు బలం అంటారు బాను ముష్తాక్. 'హార్ట్ లాంప్' అనువాదకురాలు దీప భాస్తి ఇప్పటికే కోట శివరామకారంత్ వంటి ప్రముఖ కన్నడ రచయితల పుస్తకాలను ఇంగ్లీషులోకి అనువదించారు. మే 20న లండన్‌లోని టేట్ మోడ్రన్ ఆర్ట్ గ్యాలరీలో జరిగిన ఇంటర్నేషనల్ బుకర్ అవార్డ్ వేడుకలో బాను ముష్తాక్, దీప భాస్తి చేసిన ప్రసంగాల్లోంచి కొంత భాగాన్ని ఇక్కడ ఇస్తున్నాం. — **వివిధ**





బాను ముష్తాక్

"**ఏ** కథా 'లోకల్' కాదన్న నా నమ్మకానికి ఈ పుస్తకం ఒక ప్రేమ లేఖ. నా కన్నడ భాషను సొంత ఇంటిలా నాతో కలిసి పంచుకున్న పాఠకులందరికీ ఈ పుస్తకం ఒక ప్రేమలేఖ. కన్నడ భాషలో రాయడం అంటే ఒక గొప్ప సంప్రదాయాన్నీ, ఈ నేలలో ప్రవహించే వివేకపు సారాన్నీ వారసత్వంగా అందిపుచ్చుకోవటం. ఏ కథా చిన్నది కాదన్న నా నమ్మకం నుంచీ, మానవానుభవం అనే పెద్ద అల్లికలో ఏ చిన్న దారాన్ని పట్టుకు లాగినా మొత్తం అల్లిక కదులుతుందన్న నా నమ్మకం నుంచీ, ఎప్పుడూ మనల్ని విడదీయటానికే చూసే ఈ ప్రపంచంలో మనం ఒకరి మనసుల్లోకి ఒకరు చేరగలిగే ఆఖరి రహస్య మార్గం సాహిత్యం మాత్రమే అన్న నా నమ్మకం నుంచీ ఈ పుస్తకం పుట్టింది. కొన్ని పేజీలకే ఐనా గానీ వారి సమయాన్ని నమ్మకంగా నాకు అప్పగించి, నా అక్షరాలని వారి గుండెల్లో స్వేచ్ఛగా తిరగనిచ్చిన ప్రతి పాఠకుడికీ కృతజ్ఞతలు. ఈ రాత్రి ఒక ముగింపు కాదు. ఎవరూ వినని మరిన్ని మారుమూల కథలకూ, సరిహద్దుల్ని అతిక్రమించే అనువాదాలకూ, ఈ అనంత విశ్వం ప్రతి ఒక్క 'నేను' లోనూ ఇమిడి పోగలదని గుర్తు చేసే మరిన్ని గొంతులకూ ఈ రాత్రి ఒక దీపమై దారి చూపిస్తుందని నమ్ముతున్నాను."

దీప భాస్తి




"**ఈ** ప్రపంచం కథ ఎలాంటిదా అని ఆలోచిస్తే ఇది ఒక పెద్ద చెరిపివేతల చరిత్ర అని గమనిస్తాం. ఈ చరిత్రలో ఎందరో మహిళల విజయాలు చెరిపివేయబడ్డాయి. ప్రపంచపు మార్జిన్లలోని ఎందరో ఎలా బతికారో ఎలా ప్రేమించారో చెప్పే సామూహిక జ్ఞాపకాలన్నీ గుట్టుగా చెరిపివేయబడ్డాయి. ఇలాంటి ఎన్నో హింసలకి వ్యతిరేకంగా జరుగుతున్న సుదీర్ఘ యుద్ధంలో ఈ బహుమతి ఒక చిన్న విజయం. ఇలా చెరిపివేయబడిన వాటిలో అనువాదకుల శ్రమ కూడా ఒకటి. భిన్న భాషల పాఠకుల ముందుకు వారు ఎప్పటికీ చదివే వీల్లేని కథలను తెచ్చే అనువాదకుల శ్రమ ఎక్కడా గుర్తింపుకు నోచుకోక ప్రజల అవగాహనలోంచి చెరిపివేయబడింది. అందుకే రచయితలనూ, అనువాదకులనూ ఒకే వేదికపైకి తెచ్చి సమానంగా గౌరవించే ఈ బుకర్ ప్రైజ్ ప్రోత్సాహం మరువలేనిది. 'తేనెల నదిలా, పాల వానలా, తీయని అమృతంలా' అంటూ ఒక కన్నడ పాట కన్నడ భాషను అభివర్ణిస్తుంది. కన్నడ భూమ్మీది అత్యంత ప్రాచీన భాషల్లో ఒకటి. ఈ బహుమతి ద్వారా ప్రపంచవ్యాప్తంగా కన్నడ భాష మీద మరింత ఆసక్తి పెరిగి, మరిన్ని అనువాదాలు కన్నడ నుంచీ, కన్నడ లోకీ వస్తాయని నమ్ముతున్నాను. అలాగే ఈ ప్రయత్నం మరింత పెద్దదై దక్షిణ భారతం లోని అన్ని భాషలకూ విస్తరిస్తుందని ఆశిస్తున్నాను."

తొలి సమీక్షలోనే దాడి


నా మొదటి పుస్తకం

ప్రసాదమూర్తి

17 సంవత్సరాలకు తొలి పద్యం రాసిన నేను 39 సంవత్సరాలకు తొలి పుస్తకాన్ని ప్రచురించాను. మధ్యలో బతుకు వంతెన కింద చాలా నీరే ప్రవహించింది. అసలు ఆ తొలి పుస్తకం తోనే ప్రసాదమూర్తి అనే కవి చచ్చిపోయి ఉండాలి. ఏం జరిగిందో చెప్తాను. పద్యంలో పుట్టి వచనంలో తేలి, కమ్యూనిజం నుంచి అంబేద్కరిజం దాకా ఈతలు కొడుతున్న రోజులవి. 1990 నుంచి పదేళ్ళ పాటు ఉద్యోగ రీత్యా బిహార్‌లో ఉన్నాను. 'తాతకో నూలు పోగు' అనే నా కవిత ఆంధ్రజ్యోతిలో వచ్చిన తర్వాత భావజాలాలకు అతీతంగా సాహిత్య లోకం నన్ను గుండెలకు హత్తుకుంది. కోదాడలో జరిగిన దళిత సాహిత్య సదస్సు నా మీద బలమైన ముద్ర వేసింది. అప్పటిదాకా రాసిన ఇతరేతర పద్యాలను, కవితలను పక్కనపెట్టి, దళిత బహుజన వస్తు కేంద్రంగా నేను రాసిన కవితలన్నీ ఒకచోట ఏర్చి కూర్చి నా మొదటి సంకలనం తీసుకురావాలని సంకల్పించాను. దీనికి లక్ష్మీనరసయ్య గొప్ప ముందుమాట రాయడమే కాకుండా, కొన్ని జనరల్ పోయెమ్స్‌ని కూడా జతచేసి కవితల ఎంపికలో నిర్ణాయకమైన పాత్ర వహించాడు. అలా 1999 జూన్‌లో నా తొలి కవితా సంపుటి 'కలనేత' హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో అట్టహాసంగా ఆవిష్కృతమైంది. ఎందరో పెద్దలు, కవి మిత్రులు పాల్గొన్నారు. ఆత్మీయ మిత్రుడు శంకర్ పుస్తకాన్ని డిజైన్ చేస్తే, తమ్ముడు అక్బర్ అర్థవంతమైన ముఖచిత్రాన్ని అందించాడు. శిఖామణి, ఖాజా, కుమార్ లాంటి ప్రియ మిత్రుల ప్రోత్సాహం మరువలేనిది.



ఈ పుస్తకం చుట్టూ ఉన్న ఎన్నో తీపి జ్ఞాపకాల మధ్య, నన్ను ఇప్పటికీ వెంటాడే ఒక చేదు అనుభవాన్ని మీకు చెప్పాలి. నా తొలి పుస్తకం మీద వచ్చిన తొలి రివ్యూ– ఎవరో మారుపేరుతో నా మీద చేసిన తొలి దాడి. వస్తువు మీద అతనికి అసలు పేచీ. ఆ ముసుగు తీయకుండా నా కవిత్వం మీద కత్తి దూశాడు. ఇక కవిత్వం లేదు, కన్నీరే మిగిలింది. ఆ ముసుగు వీరుడి మీద నా ఆత్మీయ తమ్ముడు నగేష్ బాబు 40 పేజీల వ్యాసంతో యుద్ధానికి సిద్ధమయ్యాడు. శ్రీశ్రీ 'భిక్షువర్షీయసి'కీ నా 'తాతకో నూలు పోగు' కవితకీ మధ్య పోటీ పెట్టాడు. ఆకాశమంత అతని ప్రేమను ప్రేమ గానే పక్కన పెట్టాను. దాన్ని అతని ప్రేమ కానుకగా నా దగ్గరే దాచుకున్నాను. ఎవరు ఎన్ని చెప్పినా ఇక కవిత్వం జోలికి పోకూడదనుకున్నాను. అలాగే జరిగితే "ప్రసాదమూర్తి వస్తుతః కవి. అతను రాసినా కవే, రాయకపోయినా కవే" అని శివారెడ్డి లాంటి పెద్దల నుంచి ప్రశంసలు ఎలా పొందేవాడిని? కాలం నా పక్షాన నిలబడింది. ఆంధ్రజ్యోతి సాహిత్య పేజీలో థింసా గారు నా 'కలనేత' మీద రాసిన అద్భుత సమీక్షా వ్యాసం మెయిన్ ఆర్టికల్‌గా వచ్చింది. కొన ఊపిరితో ఉన్న నాలో కవికి ఆ వ్యాసం తిరిగి ప్రాణం పోసింది. అలా బతికిపోయాను. ఆ వ్యాసం తర్వాత సినారె లాంటి ఎందరెందరో పెద్దల నుండి, కవి మిత్రుల నుండి ఉత్తరాల వాన కురిసింది. "ప్రసాదమూర్తి భావజాలం నచ్చిన వారు సరేసరి, నచ్చని వారు కూడా అతని కవిత్వాన్ని ఎంజాయ్ చేస్తారు" అని లక్ష్మీనరసయ్య ఇచ్చిన స్టేట్మెంట్ నిజమైంది. 'కలనేత'లో కవితలు కొన్ని చాలా సంకలనాలలో చోటు సంపాదించుకున్నాయి. నా పేరు ముందు 'కలనేత' విశేషణంగా వెలిగింది.



✆ 84998 66699

బహుభాషా కవి సమ్మేళనం

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న తెలంగాణ జాగృతి (అధ్యక్షులు: కల్వకుంట్ల కవిత) ఆధ్వర్యంలో ఉ.10 గంటలకు హైదరాబాద్ అబిడ్స్ బొగ్గులకుంట లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో 'తెలంగాణ యువ కెరటాలు' బహుభాషా కవి సమ్మేళనం 35ఏళ్ళ లోపు కవులు కవయిత్రులతో జరుగుతుంది. తెలంగాణ ఆత్మ, చరిత్ర, సంస్కృతి, వైభవం, సమిష్టితనం, మంచితనం అంశాలుగా కవిత్వం చెప్పవచ్చు. పాల్గొనాలనుకునే కవులు కవయిత్రులు మే 26లోపు ఈమెయిల్: kavitha.telangana@gmail.com కు తమ వివరాలు మెయిల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

తెలంగాణ జాగృతి

కవితల పోటీ ఫలితాలు

పాలపిట్ట – వాసా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ ఫలితాల వివరాలు: మొదటి, రెండవ, మూడవ బహుమతులు పొందిన కవులు వరుసగా: కరిపె రాజ్‌కుమార్, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, ములుగు లక్ష్మీ మైథిలి. ప్రత్యేక బహుమతులు పొందిన ఎనిమిది మంది కవులు: దేవనపల్లి వీణావాణి, బి. కళాగోపాల్, చిత్తలూరి సత్యనారాయణ, లేదాళ్ళ రాజేశ్వరరావు, సింహాద్రి నాగ శిరీష, కె. దివాకరాచారి, పర్కపెల్లి యాదగిరి, ఎడమ శ్రీనివాసరెడ్డి. మరో తొమ్మిది మంది కవితలు సాధారణ ప్రచురణకు ఎంపికయ్యాయి.

గుడిపాటి



పోలవరం గట్టు గుట్టు.. గప్‌చుప్!

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పోలవరం మట్టి తవ్వకాల్లో గుట్టు తేలట్లేదు. 2.02 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వగా, ప్రభుత్వ అవసరాలకు 28.88 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వుకోవటానికి అనుమతించారు. ఇంకా 1.74 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి ఉండాల్సి ఉండగా, వాటి లెక్కలు తేలట్లేదు. పోలవరం కాల్వగట్టు తవ్వినపుడు మట్టి ఎంత వచ్చింది? ప్రభుత్వ అవసరాలకు అధికారికంగా తవ్వకాలకు ఎంత అనుమతించింది? వివరాలు రికార్డుల్లో ఉన్నాయి. ప్రైవేట్ వ్యక్తులకు మాత్రం అధికారికంగా ఎక్కడా అనుమతులు ఇవ్వలేదని చెబుతున్నారు? మరి మట్టి గుట్టలు ఎలా కరిగిపోయాయి? ఎవరు కరిగించుకుపోయారన్నది తెలియదట. ఇదీ ఘనత వహించిన జలవనరుల శాఖ అధికారుల నిర్వాకం. ప్రభుత్వ అవసరాలకు ఇచ్చింది పోను క్షేత్రస్థాయిలో ఇంకా ఎంత మట్టి ఉందంటే, ముళ్ల కంపలు పెరిగిపోవటం వల్ల అంచనా వేయలేకపోతున్నామని చెబుతున్నారు. ముళ్ల కంపలు ఉంటే మట్టి గుట్టలను అంచనా వేయలేరా? అనే అనుమానాలు కలుగుతున్నాయి.



1.74 కోట్ల క్యూబిక్ మీటర్ల పోలవరం మట్టి ఏమైంది?

మట్టి ఎంత ఉందో తెలియదని అధికారుల దాటవేత

- సమాచార హక్కు దరఖాస్తుకు ఇరిగేషన్ అధికారుల స్పందన
- విజిలెన్స్ విభాగానికి కూడా కట్టుకథలతో లెక్కలు చెప్పారా?
- పోలవరం కుడిగట్టులో మొత్తం 2.02 కోట్ల క్యూబిక్ మీటర్ల నిల్వలు
- ప్రభుత్వ అవసరాల కోసం ఇచ్చింది 28.89 లక్షల క్యూబిక్ మీటర్లు
- మిగిలిన మట్టి ఏమైంది అనే ప్రశ్నకు సమాధానం లేదు..



పోలవరం కాల్వ గట్టుపై తవ్వకాలు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పోలవరం కుడికాల్వపై ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల పరిధిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో మైనింగ్ మాఫియా గుట్టలను కరిగించేసి చదును చేసేసింది. గన్నవరం, నున్న, విజయవాడ, వెలగలేరు సబ్ డివిజన్ల పరిధిలో అడ్డగోలుగా ఈ తవ్వకాలు జరిగాయి. అప్పటి అక్రమ మట్టి తవ్వకాలకు జలవనరుల శాఖ అధికారులు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. పోలవరం మట్టి తవ్వకాలకు సంబంధించి ఇటీవల విజిలెన్స్ అధికారులు తనిఖీలు జరిపారు. ఇరిగేషన్ అధికారులను వివరణ కోరారు. గతంలో జరిగిన అక్రమాల పాపంలో తాము కూడా భాగస్వాములుగా ఉండటంతో ఇరిగేషన్ అధికారుల వెన్నులో వణుకు పుడుతోంది. దీంతో వాస్తవాలను దాచేస్తున్నారు. విజిలెన్స్‌కు కూడా అరకొర సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. సమాచార హక్కు చట్టం కింద అడిగిన వారికి కూడా అక్రమ తవ్వకాలపై కనీస సమాచారం ఇవ్వట్లేదు. దీంతో జలవనరుల శాఖ అధికారుల వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. గన్నవరంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుయాయులు సాగించిన పోలవరం మట్టి దందాను ఏమీ లేదన్నట్టుగా తేల్చేస్తున్నారు. విజయవాడ రూరల్ మండలానికి చెందిన మెండెం జమలయ్య సమాచార హక్కు చట్టం ద్వారా సంధించిన ప్రశ్నలకు ఇరిగేషన్ అధికారులకు వాస్తవాలను దాచేసి అరకొర సమాచారం ఇచ్చారు.

మిగిలిన మట్టి ఏమైంది?

ఇరిగేషన్ శాఖ అధికారులు కేవలం ప్రభుత్వ శాఖల అవసరాలకు మట్టి ఇచ్చామని చెబుతున్న నేపథ్యంలో గన్నవరం, నున్న, విజయవాడ, వెలగలేరు సబ్ డివిజన్ల పరిధిలో 1.74 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి నిల్వలు ఉండాలి. ఇందులో ఎంత మట్టి ఉందో అధికారులు చెప్పట్లేదు. అదేమంటే మట్టి మీద కంప పెరిగింది, కుదరట్లేదని సమాధానం ఇస్తున్నారు.

గన్నవరంలో కరిగించేసిన మట్టి ఎంత?

గన్నవరం నియోజకవర్గ పరిధిలో పోలవరం కాల్వ గట్టును పెద్ద ఎత్తున మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అనుయాయులు మిగతా 6లో..

రైతులు ఆక్రమించుకున్న వాటికి ఫిర్యాదులు చేశారట

పోలవరం కుడి కాల్వ గట్టు వెంబడి నిల్వ ఉంచిన మట్టి నిల్వలు ఏమైపోయాయో తెలియదు కానీ, కాల్వను ఆనుకుని ఉన్న భూ యజమానులు కాల్వల వెలుపల స్పాయిల్ బ్యాంకులు ఖాళీ ఉన్నచోట్ల కొన్ని ప్రదేశాల్లో నున్న సబ్ డివిజన్ పరిధిలో గొల్లనపల్లి, ముదిరాజుపాలెం, గోపవరపుగూడెం, సూరంపల్లి, నున్న గ్రామాల పరిధిలో మామిడి మొక్కలు నాటారని వాటిని ఖాళీ చేయాల్సిందిగా నోటీసులు ఇచ్చామని చెప్పారు. విజయవాడ సబ్ డివిజన్ పరిధిలో కూడా నున్న, పాతపాడు, పీ నైనవరం, జక్కంపూడి గ్రామాల్లోని కొన్ని ప్రదేశాలలో పై విధంగానే ఆక్రమణలు జరిగాయని తెలిపారు. ఈ విషయాలు తెలిసిన అధికారులకు మిగిలిన మట్టి నిల్వలు ఏమైపోయాయో తెలియకపోవటం గమనార్హం.

ఈ ఏడాది రోహిణి లేనట్టే..!

నెలాఖరు వరకు వరుసగా వర్షాలు

మూడు రోజుల్లో ఉమ్మడి జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు

ప్రజలకు ముందస్తు ఉపశమనం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): వేసవి ఉష్ణోగ్రతల నమోదులో అందరికి ముందుగా గుర్తుకు వచ్చేది రెంటచింతల. ఆ తర్వాత టక్కున చెప్పే పేరు విజయవాడ. ఎండాకాలంలో అన్ని ప్రాంతాలు మండిపోతుంటాయి. కాకపోతే ఈ రెండు ప్రాంతాల్లో మంటలు అన్నింటి కంటే ఎక్కువగా ఉంటాయి. వేసవికాలం రోజులు అడుగు పెట్టడానికి ముందు నుంచి ఉమ్మడి జిల్లాకు సెగ తగులుతుంది. ముఖ్యంగా ఎన్టీఆర్ జిల్లా కేంద్రంగా ఉండే విజయవాడ ప్రజలను ఇది ఎక్కువగా తాకుతుంది. సాధారణ రోజుల్లోనే విజయవాడలో ఎండలు కాస్త ఎక్కువగా ఉంటాయి. అదే వేసవిలో నమోదయ్యే ఉష్ణోగ్రతలకు ప్రజలు అల్లాడిపోతుంటారు. ఇక రోహిణికార్తె ప్రారంభమైతే జనం ఇంటి నుంచి కాలు బయట పెట్టడానికి గడగడలాడిపోతుంటారు. ప్రతి ఏడాది ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజలకు ఇది తప్పని పరిస్థితి. ఈ ఏడాది మాత్రం జిల్లాకు ముందస్తు ఉపశమనం లభించింది. రోహిణి కార్తె మొదలయ్యే రోజు నుంచి అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఇప్పుడు రోహిణి వచ్చిన నాటి నుంచి జిల్లా ప్రజలను చల్లదనంతో చినుకులు పలకరించాయి. ఈ వర్షాల పరంపర జూన్ వరకు మిగతా 6లో..

గాలుల దిశ మారుతోంది

వేసవిలో ఉత్తర, పశ్చిమ దిశ నుంచి గాలులు వీస్తాయి. ఈ గాలులు రాజస్థాన్‌లోని ఎడారి ప్రాంతం నుంచి వస్తాయి. దీనివల్ల మనకు వేడి ఎక్కువగా ఉంటుంది. జూన్ నెలలో ఈ గాలుల స్థానంలో దక్షిణ, పశ్చిమ దిశ నుంచి గాలులు వీస్తాయి. వాటి వల్ల వాతావరణంలో చల్లదనం చేరుతుంది. ఈ ప్రభావంతోనే వర్షాలు కురుస్తాయి. సాధారణంగా జూన్‌లో వస్తాయని అంచనా వేసిన రుతు పవనాలు ఈసారి ముందుగానే తెలుగుగడ్డను తాకుతున్నాయి. రుతు పవనాలు వచ్చినప్పుడు ఎలాగూ వర్షాలు కురుస్తాయి. దీనికి ముందు బంగాళాఖాతం, అరేబియ సముద్ర గర్భంలో ఏర్పడిన అల్పపీడనంతో కొన్ని రోజులపాటు వరుసగా ప్రతిరోజు వర్షాలు కురుస్తాయి.

- కె.సత్యనారాయణ, వాతావరణ నిపుణుడు

టీడీపీ పండుగకు వేళాయె!

ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 20 వేల మంది పయనం

- ఒక్కో నియోజకవర్గం నుంచి 2 వేల మంది కార్యకర్తలు, 500 మంది నాయకులు
- ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రతిపాదనతో రెండు జిల్లాల అధ్యక్షులు నెట్టెం, కొనకళ్ల
- కడపలో 27 నుంచి టీడీపీ రాష్ట్ర మహానాడు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కడపలో ఈ నెల 27 నుంచి జరిగే రాష్ట్రస్థాయి టీడీపీ మహానాడుకు ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 20 వేల మంది కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లనున్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి రెండు వేల మంది కార్యకర్తలు, 500 మంది నాయకులు బయలుదేరుతున్నారు. మండల, జిల్లా నాయకత్వాలతో సహా ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల నుంచి మొత్తం 20 వేల మంది వెళ్తున్నట్టు సమాచారం. ఇప్పటికే కార్లు, బస్సులు బుక్ చేసుకున్నట్టు తెలిసింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వైసీపీకి ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా లేకుండా పార్టీ శ్రేణులు కృషి చేశాయి. అధికారంలోకి వచ్చాక జరుగుతున్న మహానాడు కావడంతో అనేక ఆశలతో వెళ్తున్నారు.

మహానాడు దృష్టికి పలు తీర్మానాలు

నియోజకవర్గాల స్థాయి, జిల్లాల స్థాయిలో నిర్వహించిన మినీ మహానాడుల్లో సైతం పలు తీర్మానాలు చేయటం జరిగింది. రెండు జిల్లాల అధ్యక్షులు నెట్టెం రఘురామ్, కొనకళ్ల నారాయణరావు సంయుక్తంగా ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలన్న ప్రతిపాదనతో మహానాడుకు వెళుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో అనేక సమస్యలను పార్టీ దృష్టికి తీసుకు రావటానికి తీర్మానాలు చేశారు. బుడమేరు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని, చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని, జీ కొండూరులో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని, వీటీపీఎస్ నుంచి విడుదలవుతున్న బూడిత కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని, ఏడు నియోజకవర్గాల్లో అహర్నిశలూ పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, తూర్పు నియోజకవర్గంలో రీటైనింగ్ వాల్ వెంబడి పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, విజయవాడ నగరంలో యూజీడీ మెరుగు పరచాలని, వత్సవాయి మండలం పోలంపల్లి మున్నేరుపై నిర్మించిన ఆనకట్ట గండ్లు పూడ్చాలని, గుణదలలో ఆగిపోయిన ఫ్లై ఓవర్‌ను పునరుద్ధరించాలని, పశ్చిమలో హజ్ హౌస్ పూర్తి చేయాలని, తిరువూరులో సురక్షిత నదీజలాల ప్రాజెక్టును పూర్తి చేయాలన్న ప్రతిపాదనలతో నేతలు మహానాడుకు తరలివెళుతున్నారు.

ఈ చేపలు తింటే అంతే!

కోళ్ల వ్యర్థాలతో చేపల పెంపకం

మైలవరం, తిరువూరు ఏరియాలో కొందరి నిర్వాకం

- నగరాలు, పట్టణాల నుంచి యథేచ్ఛగా కోళ్ల వ్యర్థాల తరలింపు
- పట్టించుకోని అధికారులు.. పొంచి ఉన్న అనారోగ్య సమస్యలు

నగరంలోని కోళ్ల వ్యర్థాలన్నీ మైలవరం, తిరువూరు నియోజకవర్గాలకు భారీగా డంప్ అవుతున్నాయి. ఇక్కడి చేపల చెరువుల యజమానుల్లో కొందరు వీటినే చేపల మేతగా వినియోగిస్తున్నారు. త్వరగా బరువు పెరగటం వల్ల ఆరు నెలలకు రావాల్సిన చేపలు మూడు నెలలకే వచ్చేస్తున్నాయి. దీంతో దిగుబడి ఏడాదిలో నాలుగుసార్లు వస్తోంది. అయితే ఈ చేపలు తింటే మాత్రం వచ్చే అనర్థాలు అన్నీ, ఇన్నీ కావు. పర్యవేక్షించాల్సిన అన్ని వ్యవస్థలు మామూళ్ల మత్తులో జోగుతున్నాయి.



విజయవాడ రూరల్ మండలంలో చేపల చెరువులో తేలియాడుతున్న కోళ్ల వ్యర్థాలు



విస్సన్నపేట చేపల చెరువు వద్ద చేపల మేతగా వేసేందుకు తెచ్చిన కుళ్లిన పశువుల కళేబరాలు

(ఆంధ్రజ్యోతి, విస్సన్నపేట/ జి.కొండూరు/ ఇబ్రహీంపట్నం/రెడ్డిగూడెం): జిల్లాలోని మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు, విజయవాడ రూరల్ మండలాల్లో, తిరువూరు నియోజకవర్గం విస్సన్నపేట మండలంలో ఉన్న చెరువుల్లో ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున చేపల సాగు చేపట్టారు. మైలవరం నియోజకవర్గంలోని భూములు పంటలకు పనికి రావడం లేదని అనధికారికంగా చేపల చెరువులు తవ్వే స్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి పెద్ద ఎత్తున చేపల సాగు చేస్తున్నారు.

మేతగా కోళ్లు, పశువుల వ్యర్థాలు

చేపల పెరుగుదలకు కోళ్లు, పశువుల వ్యర్థాలను కొందరు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. నగరంతో పాటు ఆయా పట్టణాల్లో ఉండే చికెన్, మటన్ దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరించి, వాటిని వ్యానుల్లో డ్రమ్ముల ద్వారా తీసుకొచ్చి నేరుగా చేపల చెరువుల్లో పడేస్తున్నారు. వందల సంఖ్యలో వ్యాన్లు దర్జాగా కోళ్ల వ్యర్థాలను రవాణా చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. మత్స్య, రెవెన్యూ, ఫుడ్ అండ్ సేఫ్టీ, ట్రాఫిక్ పోలీస్ అధికారులకు నెలవారి మామూళ్లు అందబట్టే వారు వీటిని అడ్డుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిషేధిత చేపల పెంపకం

నిషేధిత జాబితాలోని క్యాట్‌ఫిష్, పాంగాసియస్ వంటి చేపలను ఇక్కడ పెంచుతున్నట్టు సమాచారం. వీటిని నగరాల్లోని పెద్ద హోటల్స్ తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. చేపల చెరువులను నిరంతరం పర్యవేక్షించాల్సిన అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడంలేదని విమర్శలు ఉన్నాయి. చేపల చెరువుల్లో నీరు పచ్చగా మారిపోతున్నాయి. కోళ్ల వ్యర్థాలు వేయడం వల్ల అపరిశుభ్రంగా తయారై దోమలు, ఈగలకు ఆవాసంగా ఉంటున్నాయి.

నీటి వనరులు ఉన్నచోటే సాగు

నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలోని విస్సన్నపేట, రెడ్డిగూడెం, మైలవరం మిగతా 6లో..

విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి

50వ డివిజన్ జెండా చెట్టు సమీపంలో ఘటన



మానస్ మృతదేహం

చిట్టినగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆడుకోవడానికి బయటకు వెళ్లిన బాలుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు ప్రాంతంలోని జెండాచెట్టు సమీపంలో టి.లలిత కుటుంబంతో నివాసం ఉంటుంది. కొన్నేళ్ల క్రితం భర్త చనిపోయాడు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. చిన్నవాడైన టి.మానస్ (8) మూడవ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంటి సమీపంలో ఖాళీగా ఉన్న ప్రాంతంలో ఆడుకుంటూ ఆ పక్కనే ఉన్న బడ్డీని పట్టుకున్నాడు. బడ్డీకి విద్యుత్ సరఫరా కావడంతో పట్టుకోగానే మానస్ విద్యుత్ షాక్ తగిలి గిలగిలా కొట్టుకుంటున్నాడు. పక్కనే ఆడుకుంటున్న పిల్లలు చూసి విషయాన్ని బాబు మామయ్య చింతా రాజుకు తెలియజేశారు. వెంటనే ఆయన బాబును లాగడంతో అప్పటికే మానస్ స్పృహ కోల్పోయాడు. వెంటనే పాత ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యులు మృతి చెందినట్టు నిర్ధారించారు. బడ్డీలోని బల్బు వైరు కట్ అవ్వడం కారణంగానే విద్యుత్ సరఫరా బడ్డీకి వచ్చినట్టు స్థానికులు చెబుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం : కార్పొరేటర్ బోయి సత్యబాబు

అధికారుల నిర్లక్ష్యమే బాలుడి మృతికి కారణమని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు ఆరోపించారు. పాత ప్రభుత్వాస్పత్రిలో బాలుడు మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. డివిజన్‌లో ఇళ్లపై ఉన్న విద్యుత్ వైర్లు తొలగించాలని ఈ నెల 16న జరిగిన విద్యుత్ అదాలత్‌లో వినతిపత్రం ఇచ్చానని తెలిపారు. ఈ ప్రమాదానికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

యోగా ఔన్నత్యాన్ని చాటిచెబుదాం
» కలెక్టర్ లక్ష్మీశ
6

జెడ్పీ బదిలీల్లో నిబంధనలకు తిలోదకాలు

ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఇష్టానుసారంగా చేర్పులు, మార్పులు

కౌన్సెలింగ్ లేకుండా బదిలీలు అంటూ సంకేతాలు

ముగిసిన దరఖాస్తు స్వీకరణ గడువు

జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో, ఇన్‌చార్జి కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగులు

లభించని భరోసా.. వెంటాడుతున్న బదిలీల భయం



జెడ్పీ కార్యాలయం

ప్రభుత్వం అన్ని విభాగాల ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. విధివిధానాలను విడుదల చేసింది. అయితే ఏ శాఖలో లేని విధంగా జిల్లా పరిషత్‌లో ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఇష్టానుసారంగా చేర్పులు, మార్పులు చేసి బదిలీలు చేస్తామని ఆ శాఖ అధికారులు చెబుతుండటంతో ఆ విభాగంలోని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారంతో ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనల ప్రకారం బదిలీలు చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలసి విజ్ఞప్తి చేస్తే, ఈ విషయంపై తన వద్దకు రావద్దని, కొద్దిపాటి మార్పులతో బదిలీలు జరుగుతాయని చెప్పడంతో ఉద్యోగులు కంగుతిన్నారు. జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో, ఇన్‌చార్జి కలెక్టర్‌ను కలిసినా భరోసా లభించకపోవడంతో ఉద్యోగులను బదిలీల భయం వెంటాడుతోంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా పరిషత్ ఉద్యోగుల బదిలీలపై పంచాయతీరాజ్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ నెల 22వ తేదీన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని స్పష్టం చేశారు. రెండేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తూ రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకునే వారికి వెసులుబాటు కల్పించారు. వివిధ యూనియన్‌లలో ఆఫీస్ బేరర్లుగా పనిచేస్తున్న వారికి, ఐదు నెలల్లోపు పదవీ విరమణ చేసేవారికి, అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడేవారికి బదిలీల నుంచి వినహాయింపును ఇచ్చారు. బదిలీలను కౌన్సెలింగ్ పద్ధతిలో నిర్వహించి, ఖాళీలు ఉన్న ప్రాంతాల్లో ఉద్యోగులు తమకు ఇష్టమైన ప్రాంతాన్ని కోరుకుంటే, అక్కడకు బదిలీ అయ్యే అవకాశం కల్పించారు. దీంతో పాటు ఉద్యోగుల బదిలీల్లో ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను ఉల్లంఘిస్తే జెడ్పీ సీఈవోనే బాధ్యత వహించాల్సి ఉంటుందని కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో కీలకమైన పాయింట్‌లను తొలగించిన జిల్లాపరిషత్ అధికారులు తమ చిత్తానుసారంగా ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన మిగతా 6లో..



యూపీఎస్సీ పరీక్ష రాసేందుకు పొట్టి శ్రీరాములు కళాశాలలోకి వెళ్తున్న అభ్యర్థిని, దివ్యాంగులు


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ముగిసిన యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి) : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పేపర్-1కు 5,176 (55.1 శాతం), పేపర్-2కు 5,665 (54.6 శాతం) అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 25 పరీక్షా కేంద్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించామన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూం ద్వారా పరీక్ష నిర్వహణను పర్యవేక్షించామన్నారు. అభ్యర్థులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా పరీక్ష నిర్వహించిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.


యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, ఉద్యోగసంఘాల నాయకులు

యోగా ఓన్నత్యాన్ని చాటిచెబుదాం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

సత్యనారాయణపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : యోగా ఔన్నత్యాన్ని చాటిచెబుదాం అని ఉద్యోగసంఘాల కీలక పాత్రపోషించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. 'యోగాంధ్ర' ఉత్సవాలలో భాగంగా ఆదివారం జిల్లా ఆయుష్‌శాఖ, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చీఫ్‌టీవీ రోడ్డులో కలెక్టర్ లక్ష్మీశ, వివిధ శాఖల, ఉద్యోగులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగుల్లో పని ఒత్తిడిని జయించేందుకు యోగా ఉత్తమ మార్గం అన్నారు. ఉద్యోగసంఘాల నేతలు తమ పరిధిలోని ఉద్యోగులకు యోగా విశిష్టత గురించి వివరించి ప్రోత్సహించాలన్నారు. యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ధృఢత్వం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారిణి వి.రాణి, మెడికల్ ఆఫీసర్ వై.రాత్నప్రియదర్శిని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ల పరిశీలనలో
క్రీడా సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలి

లబ్బీపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ స్పోర్ట్స్ కోటా భర్తీలో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలనలో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) అధికారులతో పాటు క్రీడా సంఘాలను భాగస్వామ్యం చేయాలని ఏపీ ఒలింపిక్ సంఘం 10వ వార్షిక సర్వసభ్య సమావేశం తీర్మానించింది. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన ఏపీవోఏ వార్షిక సర్వసభ్య సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ, క్రీడాసంఘాల ప్రతినిధులు లేకుండా సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తే నకిలీలను గుర్తించడం కష్టతరమవుతుందని, గతంలో క్రీడాసంఘాల భాగస్వామ్యం లేకుండా స్పోర్ట్స్ కోటాలో వందలమంది నకిలీ సర్టిఫికెట్లతో నచివాలయ ఉద్యోగాలు పొందారని ఆరోపించారు. సమావేశంలో 38 క్రీడా సంఘాల రాష్ట్ర ప్రతినిధులు పాల్గొన్నారు. జూన్ 23న అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒలింపిక్ రన్‌లను నిర్వహించాలని తీర్మానించారు.

అమరావతిలో పెట్టుబడులు పెట్టండి

» ఢిల్లీ ఎన్సీఆర్‌లో సీఆర్‌డీఏ కమిషనర్ ప్రమోషన్

రామలింగేశ్వరనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతికి పెట్టుబడులు సమకూర్చుకోవటానికి సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు ఆదివారం ఢిల్లీ ఎన్సీఆర్ పరిధిలో ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఢిల్లీ, గుర్గావ్‌లో ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించారు. ఏరో సిటీ అవకాశాల గురించి చర్చించారు. ఈ రంగంలో ప్రోత్సాహకులైన వారిని పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించారు. గుర్గావ్‌లో మాదిరిగా అమరావతిలో కూడా భారీ వాణిజ్య స్థలాల రూపకల్పనకు సంబంధించి ప్రమోషన్ నిర్వహించారు. అమరావతి మాస్టర్ ప్లాన్ గురించి వివరించడంతో పాటు ఎయిర్‌పోర్టు ఇన్ఫ్రాస్ట్రక్చర్, రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, గ్రీనస్పేస్, స్పోర్ట్స్ స్టేడియాల అభివృద్ధి, ఇతర అంశాలపై చర్చించారు.


పర్వేశ్వరరావు కుటుంబసభ్యులతో సుమంత్

నగరంలో హీరో సుమంత్ సందడి..

గాంధీనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): 'అనగనగా' చిత్రం ఇటీవల ఓటీటీలో స్ట్రీమింగ్ అయి ప్రశంసలు పొందడంపై హీరో సుమంత్ హర్షం వ్యక్తం చేశారు. ప్రేక్షకులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. 'అనగనగ' చిత్రాన్ని వీక్షించేందుకు నగరానికి వచ్చిన ఆయన అనంతరం ఆలిండియా అక్కినేని నాగార్జున సేవాసమితి వ్యవస్థాపకుడు సర్వా ఎస్.సర్వేశ్వరరావు నివాసానికి చేరుకోగా కుటుంబసభ్యులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. కొద్దిసేపు వారితో ముచ్చటించి అల్పాహారం తీసుకొని తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తు లు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. నాగ పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. నాగుల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వివిధ సేవా రుసుముల ద్వారా ఒక్క రోజులోనే రూ.8,70,250 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

నైతికతకు కవులు నడుం బిగించాలి

» ఎమ్మెల్సీ గోరటి వెంకన్న


పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ గోరటి వెంకన్న తదితరులు

విజయవాడ కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నైతికతను కవులు భుజాని కెత్తుకోవాల్సిన అవసరం వుందని ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గవర్నర్‌పేట బాలోత్సవ భవన్‌లో బంగార్రాజు కంఠ రచించిన 'దుఃఖం పండుతున్న నేల' కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. సభకు ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ, సోషల్ మీడియాలో ఒక లైక్ కోసం జీవితాల్ని కోల్పోతున్న ప్రమాదకరమైన వాతావరణంలో మనం జీవిస్తున్నామన్నారు. ఇలాంటి సమయంలోనే కవులు ఉద్యమిగా గొంతెత్తాలన్నారు. కవులకు ఏ విషయాన్నయినా కవిత్వం చేసే హక్కు వుందన్నారు. కవుల్ని ఎవరూ శాసించవద్దన్నారు. సభకు అధ్యక్షత వహించిన విశ్వ కృష్ణ మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా క్రమశిక్షణ లేదన్నారు. సినీ గేయరచయిత రసరాజు మాట్లాడుతూ, కవికి సొంత డిక్షన్ కావాలన్నారు. సుప్రసిద్ధ కవయిత్రి, విమర్శకురాలు మందరపు హైమావతి మాట్లాడుతూ, శ్రీలను గౌరవించడం గొప్ప సంస్కృతి అన్నారు. సమాజంలో ప్రతిరోజ స్త్రీలపై జరుగుతున్న వివక్షాపూరిత మానసిక మారణకాండను కవులు నిరసించాలన్నారు. ప్రసిద్ధ కవి, విశ్లేషకులు కావ్య విశ్లేషణ చేస్తూ - ముక్కిని చోట్ దెబ్బతీసేస్తున్న నేటి కాలంలో కవులు మూలాల రక్షణ ఎరుకతో రాయడం మౌలిక అవసరమన్నారు. పీడితుల దుఃఖాన్ని కళాత్మకంగా చెప్పడం నేటి సాహిత్యంలో కొత్త అభివ్యక్తి అన్నారు. కవులు వస్తువుతో తపస్సు చేస్తే తప్ప కొత్త కవిత్వం రాదన్నారు. మల్లెతీగ సాహిత్యసేవా సంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ మాట్లాడుతూ, పుస్తకాలు కొనడమంటే కవులు, రచయితలను గౌరవించడమేనన్నారు. ఇంటి నిర్మాణానికి పరిమితులున్నట్టే ఆదికారులు ఆ ఇంట్లో ఒక పుస్తకాల గది వుండడం తప్పనిసరి చేయాలన్నారు. కార్యక్రమంలో బలర్ ఎస్ అధికారి, ప్రముఖ కవి జీవీ విద్యాధరరావు, పోలీసు అధికారి, కవి లోసారి సుధాకర్, పుస్తక రచయిత బంగార్రాజు కంఠ, సాహితీవేత్తలు మంతా విజయకుమార్, నరికొండ నరసింహ రాజు, వర్రసాద్, శిఖా ఆకాష్ తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాన్ని చొప్పా రాఘవేంద్రశేఖర్ పర్యవేక్షించారు.

దశాబ్దాల నాటి సొంతింటి కల..
సాకారం దిశగా!

» ఆశ, నిరాశల నడుమ జర్నలిస్టుల అలుపెరుగని పోరాటం

» ఎమ్మెల్యే యార్లగడ్డ, అధికారుల చొరవతో సొసైటీ స్థలంలో ఆక్రమణల తొలగింపు

» అధికారుల సూచన మేరకు సొసైటీ కార్యాలయం ఏర్పాటు


సొసైటీ కార్యాలయం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు

గుణదల, మే 25 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల కోసం నున్న మ్యాంగో మార్కెట్ ఎదురుగా ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 'విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట్ మ్యాచువల్లీ ఎయిడెడ్ అండ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ' నేతృత్వంలో తాత్కాలిక కార్యాలయాన్ని ఆదివారం సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చిగురుపాటి సతీష్‌బాబు, సొసైటీ సీఈవో ఎస్.వెంకట్రావులు ప్రారంభించారు. కార్యక్రమానికి సొసైటీ సభ్యులు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్, వెంకట్రావులు మాట్లాడుతూ, సుమారు పదిహేడేళ్లుగా సొంతింటి కల సాకారానికి జర్నలిస్టులు చేస్తున్న పోరాటంలో ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయన్నారు. నాడు ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడుకునేందుకు నిరంతర పోరాటం చేయాల్సి వచ్చిందని, ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సహకారం, అధికారుల చొరవతో ఎట్టకేలకు సొసైటీ స్థలంలోని ఆక్రమణలను తొలగించినట్టు చెప్పారు. ఈ క్రమంలో జర్నలిస్టులు స్థలంలో సొసైటీ తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. జర్నలిస్టులు సొసైటీగా ఏర్పడి సొంతింటి కోసం పదిహేడేళ్లకు పైగా పోరాటం చేస్తూనే ఉన్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, ఆటు అధికారులు గానీ, ఇటు పాలకులు గానీ పట్టించుకోలే. ఇంటి కల నెరవేరకుండానే సొసైటీ సభ్యుల్లో కొందరు చనిపోయారని, సొసైటీకి స్థలం మాత్రం సొంతం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి దశాబ్దాల పోరాటానికి ముగింపు పలికేలా సహకారం అందించాలని కోరుతున్నామన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సహకారం మరువలేనిదని, ఆయనకు రుణపడి ఉన్నామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఈ అంశాన్ని ప్రస్తావించి సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకురావటం జరిగిందన్నారు. ఇదే సమయంలో సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి జర్నలిస్టుల పోరాటంపై స్పందించి ఆవరణలోనైనే ప్రభుత్వమే ఇళ్ల నిర్మించి ఇచ్చే అంశాన్ని పరిశీలించి సీఎంకు వివరిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఆక్రమణల చెరలో ఉన్న స్థలాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి స్థానిక తహసీల్దార్ సుగుణకు విషయం చెప్పి ఆక్రమణలు తొలగించాలని సూచించారు.. రెండు రోజుల్లోనే మొత్తం ఆక్రమణలను తొలగించారన్నారు. దీంతో స్థలం తిరిగి ఆక్రమణలకు గురికాకుండా అధికారుల సూచన మేరకు జర్నలిస్టుల సొసైటీ పేరున బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు స్థలంలో ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నట్టు చెప్పారు.

జెడ్పీ బదిలీల్లో నిబంధనలకు తిలోదకాలు

(5వ పేజీ తరువాయి)

ఉత్తర్వులు తయారు చేసి, ఈ నిబంధనల ప్రకారం బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని జెడ్పీ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు చెప్పారు. జెడ్పీ ఉద్యోగులకు కౌన్సెలింగ్ పద్ధతిలో కాకుండా, బదిలీ కోసం దరఖాస్తు చేసే సమయంలో మూడు ప్రాంతాలను ఆప్షన్‌గా పెట్టుకోవాలని, దీని ప్రకారం కౌన్సెలింగ్ లేకుండా బదిలీలు ఉంటాయనే సంకేతాలు పంపడంతో జెడ్పీ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో, ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఉద్యోగుల వినతి

జెడ్పీ పరిధిలో వచ్చే పంచాయతీరాజ్‌లోని వివిధ విభాగాల్లో బదిలీలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో కొన్ని కీలకమైన సూచనలను జెడ్పీ అధికారులు మార్పులు చేసి, తమకు అనుకున్న విధంగా జిల్లా పరిషత్ నుంచి ప్రత్యేక ఉత్తర్వులు విడుదల చేశారు. మార్పులు చేసిన ఉత్తర్వుల ప్రకారం బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో ఉద్యోగులు ఖంగుతిన్నారు. ఈ పరిణామం అనంతరం జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనందకుమార్‌ను ఉద్యోగులు కలిశారు. ఉద్యోగుల బదిలీల్లో ప్రభుత్వ ఉత్తర్వులనే మార్చివేశారని ఆయనకు వివరించారు. దీంతో ప్రభుత్వ ఉత్తర్వులను మార్పు చేసిన ఉద్యోగులను పిలిపించి ఆయన ప్రశ్నించారు. ఉద్యోగుల బదిలీల అంశంలో జెడ్పీ ఇన్‌చార్జి సీఈవోపైనా ఒత్తిడి రావడంతో ఆయన గత రెండు, మూడు రోజులుగా మిన్నకుండిపోయారని ఉద్యోగులు అంటున్నారు. ఒత్తిడి కారణంగా తాను సెలవు పెట్టి వెళ్లిపోతానని సూచనప్రాయంగా జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో చెబుతున్నారని ఉద్యోగులు చెప్పుకోవడం గమనార్హం. దీంతో జెడ్పీ ఉద్యోగులు ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మను ఆదివారం కలిసి విషయం తెలియజేశారు. కలెక్టర్ వచ్చిన తర్వాత ఈ అంశాన్ని పరిశీలిస్తారని ఆమె చెప్పారు. దీంతో కొందరు ఉద్యోగులు ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ ఇంటికి వెళ్లి మరీ కలిసి, ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా బదిలీలు చేయాలని కోరారు. బదిలీలు జరుగుతాయని, కానీ కొద్దిపాటి మార్పులతో జరుగుతాయని ఆమె చెప్పారని జెడ్పీ ఉద్యోగులు అంటున్నారు. జెడ్పీలో ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న వారు 40 మంది, రెండేళ్లు అంతకు మించి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న వారు 300 మంది వరకు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారని సమాచారం. వీరిని ఎక్కడెక్కడకు బదిలీ చేస్తారోనే అంశంపై జెడ్పీ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. వైసీపీ పాలనలో జెడ్పీ ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి పెట్టడంతోపాటు తమకు అనుకూలంగా లేరనే కారణం చూపి వివిధ విభాగాల్లో అత్యంత కీలక విధులను నిర్వహించేవారిని గతంలో దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. మరికొందరు ఉద్యోగులను వేధింపుల తాళలేక బదిలీ చేయించుకుని ప్రాధాన్యతలేని పోస్టుల్లోకి వెళ్లారు. దీంతో జెడ్పీలో కీలక విభాగాల్లో పనులను చక్కబెట్టేవారు లేకుండా పోయారని ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం జరిగే బదిలీల్లో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయనే భయం ఉద్యోగులను వెంటాడుతోంది.

సెలవులో జెడ్పీ సీఈవో!

జెడ్పీ సీఈవో కన్నమనాయుడు కొన్నిరోజులుగా సెలవులో ఉన్నారు. వ్యక్తిగత కారణాలతో ఆయన సెలవు పెట్టారని పైకి చెబుతున్నా, తెరవెనుక అనేక అంశాలు ముడిపడి ఉన్నాయని ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. జెడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనాన్ని జెడ్పీ జనరల్ ఫండ్ నుంచి విడుదల చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్‌తోపాటు జెడ్పీటీసీ సభ్యులు ఇటీవల పట్టుబట్టారు. జెడ్పీ జనరల్ ఫండ్ నుంచి జెడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనం విడుదల చేయడం నిబంధనలకు విరుద్ధమని, ఆడిట్ అభ్యంతరాలు వస్తాయని సీఈవో ఆ ఫైలును పక్కన పెట్టేశారు. దీంతో సీఈవోపై జెడ్పీ పాలకవర్గ సభ్యులు గుర్రుగా ఉన్నారు. ఈ కారణం చూపి జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని సభ్యులు బహిష్కరించారు. ఈ నెల 26వ తేదీతో జెడ్పీ సీఈవో సెలవు ముగుస్తుంది. జెడ్పీ ఉద్యోగుల బదిలీలను కౌన్సెలింగ్ పద్ధతిలో జూన్ 1, 2 తేదీల్లో జరిపాల్సి ఉంది. సీఈవో కన్నమనాయుడు వస్తే ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఉద్యోగుల బదిలీలను చేస్తారని, అయితే ఆయనపై ఒత్తిడి తెచ్చి సెలవు పొడిగించేలా తెరవెనుక వ్యవహారం నడుస్తోందని జెడ్పీ ఉద్యోగులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. రానున్న రోజుల్లో జెడ్పీ విభాగంలో ఉద్యోగుల బదిలీల అంశం ఎన్ని మలుపులు తిరుగుతుందో వేచిచూడాలి.

పోలవరం గట్టు గుట్టు.. గప్‌చుప్!

(5వ పేజీ తరువాయి)

కలిగించారు. ఈ సబ్‌డివిజన్ పరిధిలో ఇరిగేషన్ శాఖ అధికారులు ఇచ్చిన సమాధానం మేరకు చూస్తే.. 2015 నుంచి 2019 వరకు పోలవరం కాల్వ తవ్వకాలకు సంబంధించి మొత్తంగా 58,45,266 క్యూబిక్ మీటర్ల మట్టి వచ్చింది. ఈ మట్టిని కాల్వకు రెండు వైపులా గుట్టలుగా పోశారు. ఇందులో 3,33,999 క్యూబిక్ మీటర్ల మేర ప్రభుత్వ శాఖల అవసరాల కోసం కేటాయించారు. దీని ప్రకారం చూస్తే మరో 55 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి ఉండాలి. ఎంత మట్టి ఉందో తెలియదని సమాధానం ఇచ్చారు. మిగిలిన మట్టికి సంబంధించి లెక్కలు ఎందుకు చెప్పలేకపోతున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. గన్నవరంలో కొద్దిరోజుల క్రితం దాడాపు పోలవరం మట్టి తరలింపునకు గురైంది. ఎంత మట్టి ఉందో కనీసం ఇప్పటికీ ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి లెక్కలు తీయకపోవటం గమనార్హం.

జక్కంపూడి కొండ గ్రావెల్, మట్టి ఎంతపోయిందో తెలియదు

పోలవరం కుడి కాల్వ నిర్మాణం కోసం జక్కంపూడి దగ్గర కొండను తవ్వాల్సి వచ్చింది. 2015 - 2019 వరకు రికార్డుల్లో ఉన్న సమాచారం మేరకు 28,73,922 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఇందులో 5,46,860 క్యూబిక్ మీటర్ల మేర ప్రభుత్వ అవసరాలకోసం కేటాయించారు. పోనీ అధికారుల లెక్కనేచూస్తే మరో23లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి ఏమైందో తెలియదు! క్షేత్రస్థాయిలో తట్టెడు గ్రావెల్ కూడా లేదు. ఎంత గ్రావెల్ ఉందో కూడా అధికారులు చెప్పలేదు.

మిగిలింది ఎంత?


ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల పరిధిలో పోలవరం కుడికాల్వకు సంబంధించి 2005-15, 2015-19 కాలంలో కూడా కాల్వ నిర్మాణ పనులు జరిగాయి. గన్నవరం సబ్ డివిజన్ పరిధిలో 2005 నుంచి 2014 వరకు ఎలాంటి కాల్వ తవ్వకాలు జరగలేదు. 2015 నుంచి 2019 వరకు 58,45,266 క్యూబిక్ మీటర్లు తవ్వి కాలువ ఒడ్డున నిల్వ చేశారు. ప్రభుత్వ అవసరాల కోసం 3,33,299 క్యూబిక్ మీటర్ల మట్టిని కేటాయించారు. ఇంకా 55,11,967 క్యూబిక్ మీటర్ల మేర మట్టి ఉండాలని ఎంత ఉందో లెక్క తేలియదు.

● నున్న సబ్ డివిజన్ పరిధిలో 2014 వరకు 53,67,162 క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి నిల్వ చేశారు. ఇందులో 12,71,685 క్యూబిక్ మీటర్ల మట్టిని ప్రభుత్వ శాఖలకు కేటాయించారు. పోగా 40,95,477 క్యూబిక్ మీటర్ల మట్టి ఏమైందో తెలియదు.

● విజయవాడ సబ్ డివిజన్ పరిధిలో 2014 వరకు 36,04,508 క్యూబిక్ మీటర్లు, 2019 నాటికి మరో 28,73,922 క్యూబిక్ మీటర్లు తవ్వి నిల్వ చేశారు. మొత్తంగా 64,78,430 క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వగా, 10,58,114 క్యూబిక్ మీటర్ల మట్టిని ప్రభుత్వ శాఖలకు కేటాయించారు. పోగా 54,20,316 క్యూబిక్ మీటర్లకు లెక్క లేదు.

● వెంగలరెడ్డి సబ్‌డివిజన్ పరిధిలోని ఏతి సెక్షన్ 1,2,3 పరిధిలో 25,84,821 క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి నిల్వచేయగా, అందులో 2,25,197 క్యూబిక్ మీటర్ల మట్టిని ప్రభుత్వ అవసరాలకు కేటాయించారు. మిగిలిన 23,59,624 క్యూబిక్ మీటర్ల మట్టికి లెక్కలేదు.

క్షీర విప్లవ పితామహుడి సతీమణి అస్తమయం


స్వర్ణకుమారి

రామలింగేశ్వరనగర్ : క్షీర విప్లవ పితామహుడు, విజయా డెయిరీ వ్యవస్థాపకుడు, ఆంధ్రా కురియన్‌గా పేరొందిన ఏ.జన్నస్వరావుకు సతీవియోగం కలిగింది. జన్నంతరావు సతీమణి స్వర్ణకుమారి (85) కిన్నెరనగర్ సికింద్రాబాద్‌లోని వారి నివాసంలో ఉన్న స్వగృహంలో కన్ను మూశారు. జన్నంతరావు, స్వర్ణకుమారి దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. స్వర్ణకుమారి భౌతికంగా శ్రీమన్నారాయణ రామానుజ జియర్ స్వామి శిష్యురాలిగా ఉన్నారు. ఆధ్యాత్మిక తేజోమణిగా పేరొందారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు, వెంకటేశ్వరరావు (ఫైల్)

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

» ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు

నందిగామ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని అనాసాగరం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఐదుగురికి గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు.. కృష్ణాజిల్లా పెదపారుపూడి మండలం వెంట్రప్రగడకు చెందిన చింతాని వెంకటేశ్వరరావు (66) భార్య నాగమణి, కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి తెలంగాణలోని నరసాపల్లి ఇందిరమ్మ పుష్కరాలకు కాళేశ్వరం వెళ్లి తిరిగి వస్తుండగా అనాసాగరం వద్ద హైవేపై కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన వెంకటేశ్వరరావు, నాగమణి, పెద్ద కుమార్తె శ్యామల, బంధువులు రవి, భార్య లక్ష్మితో పాటు విజయవాడకు చెందిన కారు డ్రైవర్ కొమరంపల్లి కార్తికేయను హుటాహుటిన నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో వెంకటేశ్వరరావు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నాయుడు తెలిపారు.

వారు రోహింగ్యాలే..

» బైండోవర్, హైదరాబాద్ తరలింపు

పెనమలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గం తాడిగడపలో గురువారం అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్న యువకులను రోహింగ్యాలుగా గుర్తించారు. ఈ సందర్భంగా వారి వివరాలను పోలీసులు ఆదివారం తెలిపారు. వారు హైదరాబాద్ శరణార్థి శిబిరం నుంచి తప్పించుకుని వచ్చి వివిధ ప్రాంతాల్లో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. పలు ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న 15 మందిపై బైండోవర్ కేసు నమోదు చేశామని, వీరిలో ముగ్గురు హైదరాబాద్‌కు శరణార్థి శిబిరానికి చెందినవారుగా, మిగిలిన 12 మంది మయన్మార్ నుంచి అక్రమంగా మనదేశంలోకి ప్రవేశించిన వారుగా గుర్తించామన్నారు. రోహింగ్యాలు హైదరాబాద్ బాలానగర్‌లోని శరణార్థి శిబిరం నుంచి తప్పించుకుని వచ్చి తాడిగడప, వందరుగుల రోడ్డు, గంగూరు ప్రాంతాల్లో భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నట్టు గుర్తించామని, వీరి నుంచి తెలంగాణ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఒక కారు, 16 సెల్‌ఫోన్లు, బంగారం, కొంత నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. వారిని పెనమలూరు తహసీల్దార్ గోపాలకృష్ణ బైండోవర్ చేసి హైదరాబాద్‌లోని శరణార్థి శిబిరానికి తరలించామన్నారు.

ఈ ఏడాది రోహిణి లేనట్టే..!

(5వ పేజీ తరువాయి)

కొనసాగుతుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

చాన్నాళ్ల తర్వాత

వేసవి కాలంలో ప్రతి ఏడాది మే నెలలో రోహిణి కార్తె ప్రారంభమవుతుంది. ఇది 15 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ 15 రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాల్పులు విపరీతంగా వీస్తాయి. రాత్రి పదకొండు గంటల వరకు వేడి గాలులు వీస్తాయి. ఈ రోహిణి కార్తె ఆదివారం నుంచి ప్రారంభమైంది. ఇది జూన్ ఎనిమిదో తేదీ వరకు ఉంటుంది. రోహిణి రోజుల్లో జిల్లా మొత్తం నిప్పుల కొలిమిలా మారుతుంది. ఉదయం ఉదయం నుంచి ఎండ తీవ్రత కనిపించింది. ఈ పరిస్థితి మధ్యాహ్నం రెండు, మూడు గంటల వరకు మాత్రమే ఉంది. ఆ తర్వాత నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఆకాశం మేఘావృతమై చల్లగాలులు వీచాయి. ఒక్కసారిగా వర్షం కురవడం మొదలైంది. సాధారణంగా ప్రతి ఏడాది రోహిణి కార్తె ప్రారంభం నుంచి ఉష్ణోగ్రతలు 42 నుంచి 46 డిగ్రీల వరకు నమోదవుతాయి. వాతావరణ శాఖ రికార్డులు ఇదే విషయాన్ని తెలియజేస్తున్నాయి. ఈ ఏడాది మాత్రం రోహిణి ప్రభావం ఉమ్మడి కృష్ణా జిల్లాపై పడలేదు. రోహిణి అడుగుపెట్టిన తర్వాత వరుణుడు ఆ వేడిని చల్లార్చడంతో ప్రజలు ఒక్కసారిగా ఉపశమనం అనుభవించినట్టయింది. ఇలాంటి పరిస్థితి ఇంతకుముందు చాన్నాళ్ల క్రితం చూశామని ప్రజలు చెబుతున్నారు. బంగాళాఖాతం, అరేబియన్ సముద్ర గర్భంలో అల్పపీడనం ఏర్పడడంతో వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ వర్షాలు నెలాఖరు వరకు నిరంతరం కురుస్తాయని అంచనా వేశారు. దీనితోపు మరో మూడు రోజుల్లో రుతుపవనాలు రాష్ట్రంలోకి అడుగుపెట్టే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, రుతుపవనాల రాకతో ఉమ్మడి కృష్ణా జిల్లాకు రోహిణి సెగ తప్పినట్టవుతుంది.

ఈ చేపలు తింటే అంతే!

(5వ పేజీ తరువాయి)

పరిసరాల్లో చేపల చెరువులు పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. నాగార్జున సాగర్ కాలువకు పడమర వేపున సాగు చేస్తున్న ఈ చేపల చెరువులకు మల్లికంటి డ్రైన్ ఉపయోగించుకుంటున్నారు. జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల్లో తారకరామా ఎత్తిపోతల పథకం నీరు, వీటీపీఎస్ నీటిని లేకుండా ద్వారా వచ్చే నీటిని వాడుకుంటున్నారు.

పక్క పొలాలకు చేటు

చేపల చెరువుల వల్ల పక్క పొలాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలు పండించే అవకాశం లేకుండా పోతుందని వాపోతున్నారు. ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోళ్ల వ్యర్థాలు తిని పెరిగిన చేపలు తినే వారికి అనేక ఆనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కోళ్లకు ఎక్కువగా యాంటిబయాటిక్ హార్మోన్లు, భారీ లోహాలు (లెడ్, ఆర్సెనిక్) వంటివి చేపల ద్వారా మనుషుల శరీరంలోకి చేరి అనేక వ్యాధులకు కారణమవుతాయని పేర్కొంటున్నారు.

శభాష్ ఆటోడ్రైవర్

» తన వివరాలు తెలిసేలా ఖాకీ చొక్కాకు బ్యాడ్జీ

» మెచ్చుకున్న ట్రాఫిక్ పోలీసులు, సత్కారం

విజయవాడ/సత్యనారాయణపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : 'కృష్ణమనోహర్ ఐపీఎస్. బ్యాచ్ నెంబరు 57. బ్యాడ్జి నెంబరు 32567.' ఓ చిత్రంలో హీరో గురించి ఆయన డైలాగ్. ప్రజానాయకుడికి గొప్పగా చెప్పే సందర్భంలోని డైలాగ్ ఇది. ఇప్పుడు ఇదే విజయవాడలో ఓ ఆటోడ్రైవర్‌కు సూట్ అవుతుంది. ఆ ఆటోడ్రైవర్ పేరు రవీంద్రనాథ. డ్రైవింగ్ లైసెన్స్ నెంబరు 96/2058. బ్యాడ్జి నెంబరు 80899.. కానీ అందరి ఆటోడ్రైవర్ల మాదిరిగా ఆయన ఆ వివరాలను దాచుకోలేదు. చొక్కాజేబుకు తగిలించుకునే ఓ బ్యాడ్జి మీదుగా ఆ వివరాలను తయారు చేసుకున్నాడు. తన వివరాలు అందరికీ తెలిసేలా ఖాకీచొక్కాపై తగిలించుకున్నాడు. నగరంలో నిత్యం వేలాది ఆటోలు తిరుగుతున్నా డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం లేదు. ఖాకీ చొక్కా ధరించాలన్న కనీస నిబంధన కూడా మరిచిపోతున్నారు. ఈ నేపథ్యంలో రవీంద్రనాథ తన వివరాలను అందరికీ తెలిసేలా ధరించడాన్ని పోలీసులు మెచ్చుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు మెచ్చుకున్నారు. ట్రాఫిక్-3 ఇన్‌స్పెక్టర్ కిశోర్, ఎస్ఐలు తమ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఆయన్ను సత్కరించారు.


ఆటోడ్రైవర్‌ను అభినందిస్తున్న పోలీసులు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కలెక్టరేట్, మే 25(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో ప్రజల నుంచి అధికారులు అర్జీలు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.


కనకదుర్గానగర్ కాలనీ అంతర్గత రోడ్డులో..


కరెన్సీనగర్ కాలనీ మురుగుకాలువ సమీపంలో..


గణేష్‌నగర్ కాలనీ అంతర్గత రోడ్డులో..


గణేష్‌నగర్‌కాలనీ 8వ రోడ్డులో వర్షపు నీటిలో పడుకున్న గేదెలు


నాగార్జునగర్ కాలనీ ఆరో రోడ్డులో..

దోమలకు ఆవాసాలుగా ఖాళీ స్థలాలు

యజమానులు పట్టించుకోకపోవడంతో దట్టంగా పెరిగిన చెట్లు, పిచ్చిమొక్కలు

- పల్లంగా ఉండడంతో రోజుల తరబడి బయటకు వెళ్లని వర్షపునీరు
- ఇబ్బంది పడుతున్న మూడో డివిజన్ పరిధిలోని కాలనీల ప్రజలు

(ఆంధ్రజ్యోతి-భారతీనగర్)

మూడో డివిజన్ పరిధిలోని కాలనీల్లో నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు దోమలకు ఆవాసంగా మారాయి. చాలా ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. నాగార్జునగర్ కాలనీ, కరెన్సీనగర్ కాలనీ, శ్రీ రామచంద్రనగర్ కాలనీ, గణేష్‌నగర్, కనకదుర్గానగర్ కాలనీల్లోని ప్రధాన, అంతర్గత రోడ్లలో నివాసాల మధ్య అక్కడక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయి. కొంతకాలంగా స్థల యజమానులు పట్టించుకోకపోవడంతో చెట్లు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. కాలనీల్లోని రోడ్ల కంటే స్థలాలు తక్కువ ఎత్తులో ఉండడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు, మురుగు చేరి, స్థలాలు చెరువుల్లా కనిపిస్తున్నాయి. పచ్చగడ్డి, పిచ్చిమొక్కలు, చెత్త, వ్యర్థాల కారణంగా దోమలు విజృంభిస్తున్నాయని, అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానిక పెద్దలు కోరుతున్నారు.


కరెన్సీనగర్ కాలనీ కృష్ణ ఎన్‌క్లేవ్ సమీపంలోని ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు


పగుళ్లిచ్చిన, సైడ్లకు పెచ్చులు ఊడిన యనమలకుదురు చిన్న వంతెన

శిథిలావస్థలో చిన్న వంతెన

- మరమ్మతులు చేయించాలని కోరుతున్న స్థానికులు

(ఆంధ్రజ్యోతి-పటమట): ఎన్టీఆర్ సర్కిల్, పటమట ప్రాంత ప్రజలు యనమలకుదురు వెళ్లేందుకు ఉపయోగపడుతున్న చిన్నవంతెన శిథిలావస్థకు చేరింది. 14వ డివిజన్ నుంచి యనమలకుదురు ఊళ్లోకి ఉండే ఈ వంతెనను చాన్నాళ్ల క్రితం నిర్మించారు. వంతెన కింద సిమెంట్ పెచ్చులూడిపోయింది. మహాశివరాత్రి, మాస శివరాత్రి, పౌర్ణమి రోజుల్లో శివాలయానికి వేలాది మంది భక్తులు ఈ వంతెన మీదుగానే వెళతుంటారు. వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, భక్తులు భయపడుతున్నారు. వంతెన వద్ద ఘాట్ కూడా అపరిశుభ్రంగా ఉందని అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.


వైసీపీ పెనమలూరు నియోజకవర్గ నాయకులకు జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ

వైసీపీ నుంచి జనసేనలోకి..

భారతీనగర్, మే 25(ఆంధ్రజ్యోతి): పెనమలూరు నియోజకవర్గం కంకిపాడుకు చెందిన వైసీపీ నాయకులు 150 మంది ఆదివారం కరెన్సీనగర్ కాలనీలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ సమక్షంలో పార్టీలో చేరారు. బండ్రెడ్డి రామకృష్ణ పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందేలా చూడాలని వారికి ఆయన సూచించారు. పార్టీలో చేరిన వారిలో చింతకింద సాయి సునీల్, కోటేలు వెకటేశ్వరరావు, తంబాబత్తుల చిన కనకయ్య, గుడివాడ హరికృష్ణ, అంబుల రాంబాబు, కూనపరెడ్డి రామకృష్ణ స్నేహితులు, కంకిపాడు ఆటో యూనియన్ అధ్యక్షుడు కోల గోపి, పలువురు ఆటో యూనియన్ నాయకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు పులి కామేశ్వరావు, బూరగడ్డ శ్రీకాంత్, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దక్షిణ భారతదేశంపై కేంద్రం నిర్లక్ష్యం

- దేశ రెండో రాజధాని, సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి
- జస్టిస్ ఫర్ సౌత్ ఇండియా మూమెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కరణం రాజేష్‌కుమార్ డిమాండ్

గాంధీనగర్, మే 25(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని జస్టిస్ ఫర్ సౌత్ ఇండియా మూమెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కరణం రాజేష్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణ భారతదేశంలో దేశ రెండో రాజధాని, సుప్రీం కోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. దక్షిణ భారత జనాభా గణనీయంగా తగ్గిపోయిందని దేశ జనాభాలో 17 శాతంగా ఉందని ఆయన తెలిపారు. దక్షిణ భారతానికి 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. 1970లో డాక్టర్ కేఎల్ రావు ప్రతిపాదించిన నదుల అనుసంధాన ప్రాజెక్టుల్లో ఇప్పటి వరకు ఎటువంటి ప్రగతి లేదన్నారు. గంగా, యమునా నదుల మిగులు జలాలను దక్షిణ భారత దేశంలోని నదులకు అనుసంధానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి దక్షిణ భారత ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. జీఎస్ ఫణిరాజ్‌ను ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్యక్షుడిగా నియమించారు. అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య, జైహింద్ పార్టీ అధ్యక్షుడు దశరథరామిరెడ్డి, నవతరం పార్టీ అధ్యక్షుడు కనకం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కస్తూర్బా' ఉపాధ్యాయుల
శిక్షణ వాయిదా వేయాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్

బెంజిసర్కిల్, మే 25(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు ఈనెల 26నుంచి 30వ తేదీ వరకు మారీస్ స్టెల్లా కళాశాలలో నిర్వహించే శిక్షణ తరగతులను వాయిదా వేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యే వారిలో ఎక్కువ మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ఉన్నారని, వీరు డీఎస్సీ పరీక్షకు ప్రిపేర్ అవుతున్నారని, దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టిసారించాలని కోరారు. లేనిపక్షంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల పక్షాన నిలిచి సోమవారం నుంచి జరిగే శిక్షణ తరగతులను అడ్డుకుంటామని సాయికుమార్ పేర్కొన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

సత్యనారాయణపురం, మే 25(ఆంధ్రజ్యోతి): చెడు వ్యాసనాలకు బానిసలుగా మారి బైక్‌లు చోరీ చేస్తున్న ఇద్దరిని సత్యనారాయణపురం పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన వాహనాలను అమ్మడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు ఆదివారం పెజ్జోనిపేటకు చెందిన సయ్యద్ సాజిద్, అదే ప్రాంతానికి చెందిన ఖాన్ చంద్‌ను అదుపులోకి తీసుకుని, బైక్‌లు స్వాధీనం చేసుకున్నారని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.


అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



అమ్మవారికి కళార్చన చేస్తున్న నృత్యకారిణులు

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వసతులపై ఈవో శీనానాయక్ ఆరా ● అమ్మవారికి విశేష పూజలు

ఇంద్రకీలాద్రి, మే 25 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యమిచ్చేలా ఈవో శీనానాయక్ అధికారులకు పలు సూచనలు చేశారు. రూ.500, రూ.300 టికెట్ల క్యూలైన్‌లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఆలయంలోకి వెళ్లే ప్రతి ఒక్కరి వద్ద టికెట్టు ఉండేలా చూడాలని, లేని పక్షంలో అక్కడ విధుల్లో ఉండేవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏఈవో చంద్రశేఖర్‌ను ఆదేశించారు.

అధిక రుసుం వసూలుపై ఫిర్యాదులు..

ఆలయప్రాంగణంలో తనిఖీలు నిర్వహించిన ఈవోకు పలువురు భక్తులు దుకాణాలు కౌంటర్ల వద్ద అధిక రుసుం వసూలు చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. పార్కింగ్ ప్రదేశాల్లో, పూజాసామగ్రి దుకాణాలవద్ద, క్లోక్‌రూమ్‌లో సిబ్బంది నిర్ణయించిన రుసుం కంటే అధికంగా వసూలు చేస్తున్నారని భక్తులు వివరించారు. సంబంధిత విభాగాల అధికారులను పరిశీలించాలని ఈవో ఆదేశించారు.

విశేష పూజలు

దుర్గామల్లేశ్వరులకు విశేషపూజలు జరిగాయి. లక్ష కుంకుమార్చన, చండీయాగం, శ్రీచక్ర నవావరణార్చన, శాంతి కల్యాణాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు, వేదపండితులు సూర్యోపాసనసేవ నిర్వహించారు. సూర్యనారాయణమూర్తికి షోడశోపచార పూజలు నిర్వహించారు.

భక్తుల అభిప్రాయాల సేకరణ

ఇంద్రకీలాద్రిపై భక్తులకు కల్పించే వసతులు, అందించే సేవల్లో మెరుగైన విధానాన్ని తేవడానికి ప్రభుత్వం, దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టారు. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్(ఐవీఆర్ఎస్) ద్వారా భక్తుల మనోభీష్టాలను, ఆలయ అభివృద్ధికి సూచనలు, సలహాలను సేకరించేందుకు కొండపైన శారీస్ కౌంటర్ పక్కన ప్రత్యేకంగా ఫీడ్ బ్యాక్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. భక్తులను వివరాలు అడిగి వారి ఫోన్ నెంబర్లను సేకరిస్తున్నారు. అభిప్రాయాలను తెలుసుకుని వాటిని నమోదు చేస్తున్నారు. రోజుకు 500 మంది భక్తుల నుంచి ఫోన్ నెంబర్లు, వారి పేర్లు, అభిప్రాయాలను ఫీడ్ బ్యాక్ కౌంటర్ ద్వారా సేకరిస్తున్నారు.


భక్తులతో మాట్లాడుతున్న దుర్గగుడి ఈవో శీనానాయక్

అలరించిన కూచిపూడి నృత్యం...

మహామండపం ప్రాంగణంలోని కళావేదికపై యనమలకుదురుకు చెందిన శ్రీహనుమాన్ నృత్య కళానిలయం విద్యార్థులు నృత్య కళార్చన నిర్వహించారు. నృత్యాచార్య కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను వారికి అధికారులు అందజేశారు.

అన్నవితరణకు రూ.2 లక్షల విరాళం

కేదారేశ్వరపేటకు చెందిన వి.వెంకట అప్పారావు, కుటుంబ సభ్యులతో ఆదివారం దుర్గగుడిలో అన్నవితరణ నిమిత్తం రూ.2,00,003 ఈవో శీనానాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి సారూ!

ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్న అంబేడ్కర్‌నగర్ కాలవగట్టు ప్రాంతవాసులు

(ఆంధ్రజ్యోతి-రామలింగేశ్వరనగర్): పటమట అంబేడ్కర్ నగర్ కాలనీ కాలవగట్టు ప్రాంతంలో నివాసం ఉంటున్న పేద, బలహీన వర్గాల వారు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నారు. ఇరుకు ఇళ్లు, దుస్తులు ఉతుక్కోవడానికి కనీసం స్థలం లేకపోవడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారంతా దుస్తులు ఉతుక్కోవడానికి కాలువను ఆనుకుని ఉన్న రేవే ఆధారం. ప్రస్తుతం కాలువలో నీరు లేక, కొన్నేళ్లుగా మెట్లు, రేవు బల్ల పగిలిపోయాయి. దీంతో స్థానికులు అక్కడ దుస్తులు ఉతకడం లేదు. రేవు అస్తవ్యస్తంగా ఉండి నిరుపయోగంగా ఉంటోంది. దానికి మరమ్మతులు చేయించి రేవును వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. కాలనీ రోడ్లపైనే వర్షపు నీరు నిల్వ ఉంటోందని, రానున్నది వర్షాకాలం కావడంతో దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు. ఈ సమస్యలను డివిజన్ ప్రజా ప్రతినిధికి పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.


రోడ్డుపై నిలిచిన వర్షపునీరు, దుస్తులు ఉతుక్కునే చోట పగిలిన మెట్లు, రేవు బల్ల

SCHOLARSHIP ALERT

Satya Scholarship Program

Description: The Nehru Sidhant Kender Trust invites applications from Class 12 graduates who have scored at least 60% and are pursuing undergraduate (UG) or integrated master's programs at selected colleges/universities (Institutes) located in Ludhiana district. With full tuition coverage, this scholarship is dedicated to empowering bright, deserving students from diverse socio-economic backgrounds, helping them turn aspirations into achievements and build a future without financial barriers.

Eligibility: Open to students pursuing 3-5 year UG/integrated master's courses in eligible courses of Commerce (BBA, BCom), Engineering (BTech, B.E., B.Sc. (Engineering), BCA, B.Arch.), and Medical (MBBS, BDS, BPT, B.Sc. (Nursing), B.Sc. (Paramedics)) from select colleges/universities (Institutes) located in Ludhiana district.

- Must have passed Class 12 board exams from Ludhiana district with a minimum of 60% marks.
- Annual parents' income must not exceed INR 5 Lakh from all sources. In case of orphan students, the guardian's income should be less than INR 5 Lakh.
- Preference given to girls, athletes (state/national/international level), persons with disabilities, orphans, and children of single parents.
- Should not be a recipient of any other educational scholarship.

Prizes & Rewards: 100% tuition fee coverage for the entire course duration.

- Hostel and mess charges may be considered on a case-by-case basis if campus residence is mandatory.
- Reimbursement of partial or full tuition fees paid in the first year, transferred directly to the student's or parent's account.

Last Date to Apply: 31-07-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SAT1

Mirae Asset Foundation Scholarship Program

Description: Mirae Asset Foundation invites applications from students who are currently pursuing undergraduate or postgraduate courses across India.

Eligibility: Open to students who are currently pursuing undergraduate or postgraduate courses across India. Applicants must have scored at least 60% in the previous academic year. The annual family income of the applicants must not exceed INR 8,00,000.

Prizes & Rewards: Scholarships up to INR 50,000
Last Date to Apply: 20-06-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/MAFS3

దిక్సూచి
DIKSUCHI



ఐఐటీ మినహా మిగిలిన ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. ఐఐటీ, ఎన్ఐటీ లేదంటే రాష్ట్ర స్థాయి సెట్‌లో సాధించిన ర్యాంకుతో కోరుకున్న కాలేజీలో సీటు వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదు. మంచి ర్యాంకు పొందిన వారికి పేరున్న సంస్థలోనే సీటు వస్తుంది. మధ్యస్థంగా ర్యాంకు వచ్చిన విద్యార్థులకే అసలైన కష్టం. కాలేజీ ఎంపికలో వారంతా చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. అలాగే ఒకసారి చేరిన తరవాత నాలుగేళ్లు చదవాలి. ఆపై సమున్నత కెరీర్ నిర్మించుకోవాలి. భావి జీవితం బాగా ఉండాలంటే, ముందస్తు కసరత్తు చాలా అవసరం. అసలు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏది మంచిదన్న ప్రశ్నతో ఈ ప్రక్రియ మొదలవుతుంది.

ఇంజనీరింగ్ కాలేజీ ఎంపికలో ఏవి కీలకం?

సాధారణంగా చాలా మంది విద్యార్థులు ఎంపిక విషయానికి వచ్చే సరికి ఓ పది ఇంజనీరింగ్ కాలేజీలను ఉజ్జాయింపుగా ఎంచుకొంటారు. ఆ క్రమంలోనే అక్కడి క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు జరిగిన తీరుతెన్నులు, వార్షిక ప్యాకేజీ వివరాలు తెలుసుకుంటారు. వాటికితోడు మరో రెండు అంశాలనూ పరిశీలించాలి. పేరున్న కాలేజీల్లో నాణ్యమైన విద్య లభిస్తుంది. ఏ కాలేజీలో ఎలాంటి విద్యను అందిస్తున్నారో, వాటి ప్రమాణాలు ఏమిటో క్యాంపస్ ప్లేస్‌మెంట్ కోసం వచ్చే సంస్థలకు స్పష్టమైన అవగాహన ఉంటుంది. అసలు అలాంటి కాలేజీలకే వారు వెళ్తారు.

బ్రాండ్ ఇమేజ్

సాధారణంగా పేరున్న కాలేజీలు(బ్రాండ్ ఇమేజ్) అనగానే ఐఐటీ లాంటివి గుర్తుకు వస్తాయి. అక్కడ నాణ్యమైన విద్య లభిస్తుంది. పూర్వ విద్యార్థుల ప్రతిభ, అక్కడి ప్రొఫెసర్లు - విద్యార్థుల పరిశోధనలు ప్రామాణికంగా ఉంటాయి. మరికొన్ని కాలేజీలకూ బాగానే పేరుంటుంది. అవి ప్రామాణికాంశాలతో కాకుండా తమ ప్రచారంతో సంపాదించినవి. చిన్న కాలేజీలు, కొత్తగా ఏర్పాటైనవి ఆ స్థాయిలో ప్రచారానికి వ్యయం చేయలేవు. అందుకే కొన్ని చిన్న కాలేజీలు నాణ్యమైన విద్యను అందించినా ఆ స్థాయి ప్రచారాన్ని అందుకోలేక 'వెనుకబాట' పడతాయి. అందువల్లే కొత్త, చిన్న కాలేజీలు రిక్రూటర్లను పెద్దగా ఆకర్షించలేవు.

ఫ్యాకల్టీ

ఒక కాలేజీలోని ఫ్యాకల్టీ విద్యార్హతలు ఏమిటన్నది తప్పక పరిశీలించాలి. మొత్తం అధ్యాపకుల్లో పిహెచ్‌డి ఎంత మందికి ఉందన్నది తెలుసుకోవాలి. ఆ డిగ్రీ లేనప్పటికీ కొందరు మంచి అధ్యాపకులు ఉంటారు. అయితే, వారి సంఖ్య స్వల్పం. ఎం.టెక్ పూర్తి చేసిన వారు ఎందరున్నారన్నదీ పరిశీలించాలి. ఎందుకంటే, ఇటీవల చాలా కాలేజీల్లో బీ.టెక్ లేదంటే ఎమ్మెస్సీ పూర్తి చేసిన వారిని అధ్యాపకులుగా నియమిస్తున్నారు. అలాంటి కాలేజీల్లో నాణ్యమైన విద్యను ఆశించలేం. అధ్యాపకులు వారి ఉన్నత విద్యను ఎక్కడ పూర్తి చేశారన్నదీ చూడాలి. ప్రముఖ సంస్థల్లో విద్యాభ్యాసం చేసిన వారి నుంచి నాణ్యమైన విద్య తప్పకుండా లభిస్తుంది. అలాగే ఆ కాలేజీలో బీటెక్ వరకు చదివి, తదనంతరం ఉన్నత విద్యను ప్రతిష్ఠాత్మక సంస్థల్లో పూర్తి చేసుకొని ఉంటే ఆలోచించాల్సిన అవసరం లేదు.

అధ్యాపకుల సంఖ్య

నాణ్యమైన విద్యను పొందేందుకు అధ్యాపక- విద్యార్థి నిష్పత్తి అతి ముఖ్యమైంది. విద్యార్థుల సగటు సంఖ్య తక్కువగా ఉండే తరగతి గదుల్లో నాణ్యమైన విద్య లభిస్తుంది. అంటే సరిపడా అధ్యాపకులున్న కాలేజీల్లో మాత్రమే తరగతి గదిలో విద్యార్థుల సగటు సంఖ్య తక్కువగా ఉంటుంది. అలా కాకుండా విద్యార్థుల సంఖ్యతో పొంతన లేకుండా అధ్యాపకులు తగ్గిన పక్షంలో అది వారి పని భారాన్ని పెంచుతుంది. దాంతో వారు స్వీయ పరిశోధనకు సమయం కేటాయించుకోలేరు. సరైన రీతిలో అసైన్‌మెంట్లను, ప్రాజెక్టు వర్క్‌ను విద్యార్థులకు ఇవ్వలేరు. అలాగే వాటికి గ్రేడింగ్ ఇవ్వడమనేది వారికి అత్యంత భారంగా మారుతుంది.

పరిశోధనల తీరుతెన్నులు..

కాలేజీ అధ్యాపకులు ఎవరైనా పరిశోధన చేస్తుంటే వారికి సదరు రంగాల్లో వస్తున్న మార్పులపై సరైన అవగాహన ఉంటుంది. వారు మంచి బోధనను అందిస్తారు. గొప్పగొప్ప సంస్థల్లో పరిశోధన కొనసాగిస్తున్న వారే కానవసరం లేదు. పరిశోధన రంగంలో ఉంటే బాగా బోధిస్తారని అంచనా వేయవచ్చు. పరిశోధనకు పూర్తిగా దూరంగా ఉండే వారి నుంచి మాత్రం ఉత్తమ బోధనను ఆశించడం కష్టమే. వీలైతే మొత్తం కాలేజీ కార్యక్రమాలను లేదా కనీసం తాము ఎంచుకోవాలని భావించే శాఖ పనితీరును చూడాలి. సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారా అవి విషయాన్నీ చూడాలి.

వసతులు

ఇది మరో ముఖ్యమైన అంశం. చేరాలనుకునే విభాగంలో ల్యాబ్‌ల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలి. ఆధునిక పరికరాలు ఉన్నాయా? ఉంటే విద్యార్థులంతా ఒకేసారి ప్రయోగాలు చేసేందుకు సరిపడా ఉన్నాయా? లేకుంటే ఏదో మొక్కుబడిగా డిమాన్‌స్ట్రేటర్ చేసి చూపిస్తారా అన్నవి తెలుసుకోవాలి. మొత్తంగా కాలేజీలో వసతులు ఎలా ఉన్నాయో పరిశీలించాలి. విద్యార్థుల సంఖ్యతో పోల్చినప్పుడు సగటున ఎన్ని పుస్తకాలు లైబ్రరీలో ఉన్నాయో కనుక్కోవాలి. లైబ్రరీకి 'ఈ-జర్నల్స్' ఎన్ని అందుబాటులో ఉన్నాయి? ఎంత తలసరి బ్యాండ్ విడ్త్ ఉంది? తరగతి గదిలో కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, స్క్రీన్‌లు, ఆడియో సౌకర్యం ఉందా? క్రీడల నిర్వహణ ఎలా ఉంది లాంటి అంశాలను కేవలం ఆ కాలేజీల వెబ్‌సైట్ల నుంచి మాత్రమే పొందలేం. అందు కోసం ప్రస్తుత లేదా తెలిసిన నమ్మకమైన పూర్వ విద్యార్థులతోనైనా సంభాషించడం ఉత్తమం. వీలైతే వాటి పరిశీలనకు ఆ కాలేజీని సందర్శించడం మరో మార్గం.

సంస్థ స్థితి: ఆ సంస్థకు యూనివర్సిటీ స్థాయి ఉండే పక్షంలో అక్కడ కొత్త ఆలోచనలకు, అకడమిక్ స్వేచ్ఛకు ఎక్కువ అవకాశం ఉంటుంది. ఎంతకాలంగా మనుగడలో ఉందన్నదీ ముఖ్యమే.
క్యాంపస్: పూర్తి రెసిడెన్షియల్ క్యాంపస్ అయితే నేర్చుకొనే వాతావరణం అధికంగా ఉంటుంది.
కరికులమ్: సిలబస్‌ను తరచుగా మారుస్తున్నారా? అక్కడ ఎన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయి? వంటివీ తెలుసుకోవాలి. కొన్ని సంస్థల్లో అనేక కోర్సులుంటాయి. అయితే బోధన బాగా ఉండకపోవచ్చు.
పాఠ్య ప్రణాళిక ఎంపిక: అక్కడ ఎన్ని ఎలక్టివ్స్ అందుబాటులో ఉన్నాయి? అవి ఉద్యోగాలకు పనికి వచ్చేవా లేక ఉన్నత విద్యాభ్యాసానికి ఉపకరించేవా? ఆ సంస్థలోని విద్యార్థులు ఎక్కువగా ఉన్నత విద్యకు వెళ్తున్నారంటే - అక్కడ మంచి అభ్యసన వాతావరణం ఉన్నట్లే!
పోటీ పరీక్షలు: అక్కడి విద్యార్థులు గేట్/క్యాట్ లాంటి పరీక్షల్లో చూపిన ప్రతిభనూ గమనించాలి.

ఇవీ ముఖ్యమే

మనుగడ: ఆ కాలేజీ పది పదిహేనేళ్లుగా మనుగడలో ఉంటే, దాని పూర్వ విద్యార్థుల సంఘం ఉందా? ఉంటే మంచిది. లేదంటే.. ఆ కాలేజీని వారే పట్టించుకోనప్పుడు మనం ఎంచుకోవాల్సిన అవసరం ఉందా? అనేది నిర్ణయించుకోవాలి.
క్యాంపస్ ప్లేస్‌మెంట్: దీనిని పరిగణించాల్సిందే. కానీ ఈ ఒక్కదాన్నే పరిగణనలోకి తీసుకోవడం మాత్రం సరికాదు.
విద్యార్థుల కార్యక్రమాలు: నాలుగేళ్లు కేవలం తరగతి గది, ల్యాబ్‌లకే అంకితం కాలేము. కాబట్టి ఆ కాలేజీలో ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ ఎలా నిర్వహిస్తున్నారో తెలుసుకోవాలి.
విద్యార్థి భాగస్వామ్యం: కళాశాల నిర్వహణలో విద్యార్థులకు భాగస్వామ్యం కల్పిస్తే - అది వారిలోని నాయకత్వ లక్షణాలను వెలికితీస్తుంది. కాబట్టి దానినీ పరిశీలించాలి.

- ఇంత సమాచారం కనుగొనడం చాలా కష్టమని మీరు భావించవచ్చు. అయితే అన్ని కాలేజీల సమాచారం సేకరించాల్సిన అవసరం లేదు. కేవలం మీరు ఎంచుకోవాలని భావించే కాలేజీల గురించి సేకరిస్తే చాలు. అప్పుడు అదంత కష్టం కాబోదు. కాలేజీ వెబ్‌సైట్ కూడా ఈ విషయంలో తోడ్పడుతుంది. అందులో సమాచారం మరీ తక్కువగా ఉంటే ఆలోచించాలి. ప్రతి ఒక్కరిలో సహజ మేధస్సు అంతర్లీనంగా ఉంటుంది. అది వికసించేందుకు భౌతిక వాతావరణం తోడవ్వాలి. కుటుంబ నేపథ్యం, ఉత్తమ సహచర్యం, లక్ష్యం, ఆ దిశలో పయనం లాంటివి వికాసానికి తోడ్పడుతాయి తప్ప ఏదో ఒక కాలేజీలో విద్యాభ్యాసం చేయడం మూలంగానే అన్నీ సాధ్యం కావు. అలా అని కాలేజీ ప్రాధాన్యం తగ్గించలేం. మంచి కాలేజీలోనే విద్యార్థి ప్రతిభ వికసిస్తుందన్నది నిగ్గుతేలిన నిజం. విద్యార్థి దశలోనే అవగాహన, విశ్లేషణ, అన్వయం అనేవి అలవడతాయి.

చిత్రజ్యోతి
SINCE 1965

పదవుల కోసం రాజకీయాల్లోకి రాలేదు

-కమల్ హాసన్



పదవుల కోసమో, ముఖ్యమంత్రిని అవ్వాలనే కోరికతోనో రాజకీయాల్లోకి రాలేదని సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షుడు కమల్ హాసన్ స్పష్టంచేశారు. మణిరత్నం దర్శకత్వంలో ఆయన హీరోగా నటించిన 'థగ్‌లైఫ్' చిత్రం ఆడియో రిలీజ్ కార్యక్రమంలో మాట్లాడుతూ, 'సీఎం కావాలన్న ఉద్దేశంతో రాజకీయాల్లోకి రాలేదు. రాష్ట్ర ప్రజలకు, నా అభిమానులకు సేవ చేయాలన్న ఉద్దేశంతో వచ్చాను. అనుకున్న లక్ష్యాన్ని నిదానంగా సాధిస్తాం. ఈ ప్రయాణంలో నాతో భాగమైన వారికి ధన్యవాదాలు. 'థగ్‌లైఫ్'ను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారన్న నమ్మకం ఉంది. మేము ఒక మంచి చిత్రాన్ని నిర్మించాం. అందుకే శాటిలైట్, ఓటీటీ హక్కులు మాత్రమే విక్రయించాం. సినిమాపై ఉన్న నమ్మకంతో మేమే డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నాం. ఇలాంటి మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తే, మా బేనరులో ఎన్నో గొప్ప చిత్రాలను రూపొందిస్తాం' అని పేర్కొన్నారు. -చెన్నై, ఆంధ్రజ్యోతి

ఆ నలుగురిలో నేను లేను

- అల్లు అరవింద్



"రెండు రోజుల నుంచి మీడియాలో 'ఆ నలుగురు... ఆ నలుగురు' అంటూ కొంచెం నెగిటివ్ టచ్ ఇచ్చి పదే పదే చెబుతున్నారు. 'కబంద హస్తాలతో థియేటర్లను గుప్పిట పట్టారని అంటున్నారు. ఆ నలుగురిలో నేను లేను. ఆ నలుగురితో నాకు సంబంధం లేదు" అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. పర్సంటేజీ విధానం అమలు చేయకుంటే జూన్ 1 నుంచి థియేటర్ల మూసివేస్తాం అంటూ ఎగ్జిబిటర్లు కొన్ని రోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విడుదలను అడ్డుకోవడానికి తెరవెనుక కొందరు సినీ పెద్దలు ప్రయత్నిస్తున్నారనీ, ఈ నిర్ణయం వెనుక ఉన్న ఆ నలుగురిలో అల్లు అరవింద్ హస్తం ఉందంటూ మీడియాలో ఉధృతంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తనపై వస్తున్న ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు అల్లు అరవింద్ ఆదివారం మీడియా ముందుకొచ్చారు.

"ఆ నలుగురు' అని అనడం 15 ఏళ్ల క్రితం మొదలుపెట్టారు. కొవిడ్ సమయంలోనే ఆ నలుగురి వ్యాపారంలోంచి నేను బయటకు వచ్చాను. తెలంగాణలో నాకు ఉన్న ఏకైక థియేటర్ 'ఏఏఏ'. అది తప్ప నాకు మరో థియేటర్ లేదు. అలాగే ఒక్క థియేటర్ కూడా తెలంగాణలో నాకింద లీజులో లేదు. ఆంధ్రాలో 15 థియేటర్లు లీజులో నడుపుతున్నాం. గడువు తీరాక వాటిని కూడా వదులుకోవాలనుకుంటున్నాం. పాత అలవాటు ప్రకారం అందరూ నన్ను కూడా ఆ నలుగురిలో కలుపుతున్నారు. ఇకపై దయచేసి ఆ నలుగురి గురించి చెప్పేటప్పుడు అందులో నన్ను కలపొద్దు' అని అల్లు అరవింద్ కోరారు.

ఆ సమావేశాల్లో నేను పాల్గొనలేదు

'థియేటర్ల మూసివేతపై నిర్వహించిన సమావేశాల్లో నేను పాల్గొనలేదు. 'మేం థియేటర్లు మూసేస్తున్నాం, మీరు చర్చలకు రండి' అని అనడం నాకు నచ్చలేదు. అది ఏకపక్ష నిర్ణయం. మా వాళ్లకు కూడా వెళ్లొద్దు అని చెప్పాను. ఏదైనా సమస్య ఉంటే ముందు ఛాంబర్‌లో, గిల్డ్‌లో చర్చించి పరిష్కరించుకోవాలి. కుదరకపోతే ప్రభుత్వాన్ని కూడా కలవాలి. అన్నీ దారులు మూసుకుపోతే అప్పుడు థియేటర్ల బంద్ నిర్ణయం తీసుకొని ఉండాల్సింది. అలాగే క్యూబ్‌లో నేను, యూఎఫ్‌ఓలో సురేశ్‌బాబు భాగస్వాములం కాదు' అని అల్లు అరవింద్ వివరణ ఇచ్చారు.

పవన్‌కల్యాణ్ ఆవేదనలో అర్థం ఉంది

"పవన్‌కల్యాణ్ ఆవేదనలో అర్థం ఉంది. ఆయన సినిమా వస్తుంటే మేం థియేటర్లు మూసేస్తున్నాం అనడం పవన్ కల్యాణ్‌ను బెదిరించడమే. ఆయన సినిమా విడుదలవుతున్న సమయంలో థియేటర్లను మూసేస్తాం అనే దుస్సాహసం చేయకూడదు. థియేటర్ల మూసివేతపై ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ స్పందన సమంజసమే. పవన్ కల్యాణ్ మన ఇండస్ట్రీ నుంచి వెళ్లారు. ఎవరికి ఏ సహాయం కావాలన్నా చేస్తున్నారు. అశ్వనీదత్ గారి సినిమా విడుదలైన సమయంలో టికెట్ ధరలను పెంచమని అడగడానికి మేం వెళ్లాం. 'ఛాంబర్ తరపున వచ్చి సీఎం చంద్రబాబునాయుడు గారిని ఒకసారి కలవండి' అని ఆ సమయంలో పవన్ కల్యాణ్ చెప్పారు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ఎవరూ ఆ విషయాన్ని పట్టించుకోలేదు. వెళ్లి కలసి ఉంటే బావుండేది" అని హితవు పలికారు.


> మాది ప్రైవేట్ వ్యాపారం. ప్రభుత్వంతో మాకు సంబంధం లేదని కొందరు అంటున్నారు. అలాంటప్పుడు మనలో పెద్దపెద్దవాళ్లందరూ గత ప్రభుత్వంలో సీఎంను మాత్రం ఎందుకు కలవాల్సి వచ్చింది?

ఓజీ విడుదల తేదీ వచ్చేసింది



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓజీ'. డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. ప్రియాంక మోహన్ కథానాయిక. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడు. ఇందులో ఓజాస్ గంభీరా అనే శక్తిమంతమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు పవన్. రాజకీయాల్లో బిజీగా ఉన్న ఆయన ఇటీవలె ఈ సినిమా షూట్‌లోకి అడుగుపెట్టారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేశారు మేకర్స్. దసరా సందర్భంగా సెప్టెంబర్ 25న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు.

ట్రాన్స్ ఆఫ్ కుబేర



నాగార్జున, ధనుశ్, రష్మిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ చిత్ర టీజర్‌ను 'ట్రాన్స్ ఆఫ్ కుబేర' అనే పేరుతో విడుదల చేశారు మేకర్స్. ప్రధాన పాత్రధారుల శక్తిమంతమైన లుక్స్, విజువల్స్, సంగీతం ఆకట్టుకున్నాయి. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా రేంజ్‌లో జూన్ 20న విడుదలవుతోంది.

ముగిసిన కేన్స్ వేడుక.. విజేతగా ఇరానియన్ చిత్రం



ఈ నెల 13న అట్టహాసంగా ప్రారంభమైన 78వ కేన్స్ చిత్రోత్సవం శనివారం ముగిసింది. కేన్స్‌లో అత్యుత్తమ సినీ పురస్కారమైన 'గోల్డెన్ పామ్'ని అందుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా పలు సినిమాలు పోటీపడగా... ఈ ఏడాది ఆ ఘనతను ఇరానియన్ దర్శకుడు జాఫర్ పనాహీ తెరకెక్కించిన 'ఇట్ వజ్ జస్ట్ యాన్ ఆక్సిడెంట్' చిత్రం అందుకుంది. ఈ చిత్రంలో వహీద్ మొబస్సెరీ, మరియమ్ అఫ్షారీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఓ రోడ్ ట్రిప్ నేపథ్యంలో పలు మలుపులతో ఆసక్తికరంగా సాగే చిత్రమిది. 'అన్ సర్టైన్ రిగార్డ్' విభాగంలో 'మిస్టీరియస్ గేజ్ ఆఫ్ ది ఫ్లెమింగో' చిత్రం అవార్డు దక్కించుకుంది. 1980ల కాలంలో ఎయిడ్స్ వ్యాధిపై సమాజంలో ఉన్న మూఢనమ్మకాలపై పోరాడే 12 ఏళ్ల బాలిక కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా వీక్షకులను కదిలించింది. ఫ్రాన్స్ దర్శకుడు డియెగో సస్పెడెస్ తెరకెక్కించారు. అలాగే, మన దేశం నుంచి 'హోమ్ బౌండ్' అనే చిత్రం అన్‌సర్టైన్ రిగార్డ్‌లో ప్రదర్శితమైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది భారత్ నుంచి ప్రదర్శనకు ఎంపికైన ఏకైక సినిమా ఇదే కావడం విశేషం. అయితే ఈ చిత్రానికి పురస్కారం దక్కలేదు. ఫ్రెంచ్ నటి జూలియట్ బినోచే.. భారతీయ దర్శకురాలు, 'ఆల్ వియ్ ఇమాజిన్ ఆజ్ లైట్' ఫేమ్ పాయల్ కపాడియా తదితరులు ఈ ఏడాది జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు.

ఈ వేడుకల ప్రారంభోత్సవంలో అలియా భట్ పాల్గొనాల్సి ఉండగా, భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆగిపోయారు. చివరి రోజు గూచి బ్రాండ్ చీరలో మెరిసి ప్రత్యేకాకర్షణగా నిలిచారు.



విజేతలు వీరే:

గోల్డెన్ పామ్: ఇట్ వజ్ జస్ట్ యాన్ ఆక్సిడెంట్ (జాఫర్ పనాహీ)
గ్రాండ్ ప్రిక్స్: ద సెంటిమెంటల్ వాల్యూ (జోవాచిమ్ ట్రైయర్)
ఉత్తమ దర్శకుడు: క్లెబర్ మెన్‌డోన్సా ఫిల్హో (ద సీక్రెట్ ఏజెంట్)
ఉత్తమ నటుడు: వాఘ్నర్ మౌరా (ది సీక్రెట్ ఏజెంట్)
ఉత్తమ నటి: నదియా మెలిటీ (ది లిటిల్ సిస్టర్)
అన్‌సర్టైన్ రిగార్డ్: మిస్టీరియస్ గేజ్ ఆఫ్ ది ఫ్లెమింగో (డియెగో సస్పెడెస్)

కొత్తగా..

ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది



నూతన నటీనటులతో దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'యుఫోరియా'. భూమికా చావ్లా, సారా అర్జున్, రోహిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో 'యుఫోరియా' నుంచి హై హై అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యానికి కాలభైరవ స్వరాలు సమకూర్చడంతో పాటు పృథ్వీ చంద్ర, గాయత్రీ నటరాజన్‌తో కలసి ఆలపించారు. ఈ సందర్భంగా గుణశేఖర్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు చూపించే ఎనర్జీయే 'యుఫోరియా'. ఇదే ఎనర్జీ సినిమాలోనూ ఉంటుంది. యూత్‌ఫుల్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తీస్తున్నాను. తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అన్నారు. నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ 'హై హై పాట అందరికీ నచ్చుతుంది. ఇదొక విభిన్న చిత్రం' అన్నారు.

థియేటర్లలో చూడాల్సిన చిత్రం



అందమైన ప్రేమకథకు మిస్టరీ ఎలిమెంట్స్ జోడించి తీసిన చిత్రం 'ఘటికాచలం'. నిఖిల్ దేవాదుల హీరోగా అమర్ కామెపల్లి దర్శకత్వం వహించారు. ఒయాసిస్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై ఎంసీ రాజు నిర్మిస్తున్నారు. దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ విడుదల చేస్తున్నారు. ఈ నెల 31న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. శుక్రవారం ఎస్‌కేఎన్ చేతుల మీదుగా యూనిట్ ట్రైలర్‌ను ఆవిష్కరించింది. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రం ఇది, థియేటర్లలోనే చూడండి అని ఎస్‌కేఎన్ కోరారు.

మ్యూజికల్ లవ్ డ్రామా



సౌమిత్‌రావు, శ్రేయాసి సేన్ జంటగా నటించిన 'నిలవే' చిత్రం పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు ఈ సందర్భంగా సౌమిత్ రావు మాట్లాడుతూ 'ఇది ఓ మంచి మ్యూజికల్ డ్రామా. కొత్తవాళ్లు కూడా మంచి చిత్రాలు తీస్తారు అని నిరూపించాలని మా ప్రయత్నం' అన్నారు. 'ఓ వ్యక్తి జీవితంలో జరిగే ప్రయాణమే 'నిలవే'. సంగీతాన్ని ప్రేమతో చూపించాలని అనుకున్నాం. మా సినిమాను సపోర్ట్ చేయండి అని దర్శకుడు సాయి వెన్నం కోరారు.

'బలగం' అంజన్న కన్నుమూత



బలగం సినిమాలోని అంజన్న పాత్రతో ప్రజల మనసులు గెలుచుకున్న నటుడు గుడిబోయిన బాబు అనారోగ్యంతో వరంగల్‌లోని సంరక్ష ఆస్పత్రిలో శనివారం రాత్రి ఒంటి గంటకు తుదిశ్వాస విడిచారు. రామన్నపేటలోని ఆయన నివాసంలో పలువురు నాటక, సినిమా, సాంస్కృతిక కళాకారులు, నాయకులు, స్థానికులు ఆదివారం నివాళులర్పించారు. కమెడియన్ యెల్దండి వేణు దర్శకుడిగా, దిల్ రాజు నిర్మించిన బలగం సినిమాలో హీరో ప్రియదర్శి తాతగా బాబు నటించి ఆకట్టుకున్నారు. కొంత కాలంగా కిడ్నీ సంబంధింత వ్యాధితో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు ఆయన 20కు పైగా సినిమాల్లో నటించారు.

-వరంగల్, (ఆంధ్రజ్యోతి)

నిల్వ పచ్చళ్లు తాజాగా

మనం మామిడి, ఉసిరి, నిమ్మ, పండు మిరప కాయలతో సహా ఎన్నో రకాల నిల్వ పచ్చళ్లు పెడుతూ ఉంటాం. ఒక్కోసారి అవి బూజు పడుతూ తినడానికి వీలులేకుండా పాడవుతూ ఉంటాయి. అలా కాకుండా మనం పెట్టిన పచ్చళ్లు చాలా రోజులపాటు నిల్వ ఉండాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

- పచ్చళ్లు పెట్టడానికి తాజాగా ఉన్న కాయలను ఎంచుకోవాలి. మెత్తగా ఉన్నవాటిని, నల్లని మచ్చలతో పాడవడానికి ప్రారంభదశలో ఉన్నవాటిని తీసి పక్కన పెట్టాలి. నాణ్యమైన కాయలను ఎంపిక చేసుకుంటేనే పచ్చళ్లు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.
- నిల్వ పచ్చళ్ల కోసం తెచ్చిన కాయలను మంచి నీటితో శుభ్రంగా కడగాలి. పరిశుభ్రమైన పలుచని బట్టతో వాటిని తుడిచి నీడలో బాగా ఆరనివ్వాలి. ఏ మాత్రం తేమ లేకుండా చూసుకోవాలి.
- కాయలను ముక్కలుగా తరగడానికి ఉపయోగించే కత్తిపీట, చాకు లాంటి వాటిని; పచ్చడి కలిపే గిన్నెలు, గరిటెలను శుభ్రం చేసి తడి లేకుండా ఆరబెట్టాలి.
- పచ్చళ్లను తయారు చేయడానికి నాణ్యమైన దినుసులనే ఉపయోగించాలి. పచ్చళ్ల కోసం ప్రత్యేకించిన ఉప్పును మాత్రమే వాడాలి. ఇందులో అయోడిన్ లాంటి మూలకాలు ఉండవు. ఇది పచ్చళ్లను చాలాకాలంపాటు తాజాగా ఉంచుతుంది.



- పచ్చళ్లలో కలపడానికి నువ్వుల నూనె లేదా వేరుశనగ నూనెను మాత్రమే ఉపయోగించాలి. మిగిలిన నూనెలు పనికిరావు. పచ్చడి మునిగేవరకూ నూనె పోయాలి. దీనివల్ల పచ్చడి ఎండిపోకుండా రంగు మారకుండా ఉంటుంది.
- సాధారణంగా పచ్చళ్లు పెట్టిన మూడు రోజులకు మరల వాటిని కలిపి ఉప్పు, నూనె తదితరాలను సరిచూస్తారు. అప్పుడు కూడా తడి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పచ్చళ్లను జాడీల్లో లేదంటే గాజు సీసాల్లో మాత్రమే నిల్వ చేయాలి. ఇవి పొడిగా శుభ్రంగా ఉండాలి. పచ్చడిని నింపిన తరవాత జాడీ లేదా సీసా మీద రెండు వరుసల పలుచని బట్టని వేసి తాడుతో గట్టిగా బిగించాలి. దీని మీద మూత పెట్టాలి. గాలి చొరబడకుండా ఇలా జాగ్రత్తగా నిల్వ చేస్తే పచ్చళ్లు చాలాకాలం నిల్వ ఉంటాయి.
- నిల్వ పచ్చళ్లను తేమ, ఎండ తగలకుండా చీకటిగా ఉండే పొడి ప్రదేశంలో ఉంచాలి. వీలైతే వీటిని ఫ్రిజ్‌లో కూడా పెట్టవచ్చు.
- పచ్చడిని జాడీ లేదా సీసా నుంచి తీసేటప్పుడు పొడిగా ఉండే గరిటెను మాత్రమే ఉపయోగించాలి. గరిటెను ఒకసారి వేడిచేసి చల్లార్చి వాడితే మంచిది.
- తరచుగా జాడీ లేదా సీసా మూతను తెరకూడదు. కనీసం రెండు నెలలకు అవసరమైన పచ్చడిని మరో చిన్న జాడీ లేదా సీసాలోకి తీసుకుని వాడుకోవాలి.



ఒకప్పుడు బ్యాంకింగ్ రంగంలో సేవలు. ఇప్పుడు కేక్‌ల తయారీలో సిద్ధహస్తురాలు. పిల్ల తల్లి... కళాకారిణి అయిన సఫ్రినా లతీఫ్... 37 ఏళ్ల వయసులో ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించారు. మంచు తుపానులు... ప్రతికూల వాతావరణ పరిస్థితులు... అడుగడుగునా సవాళ్లు. అన్నిటినీ దాటుకొని... సగర్వంగా జాతీయ జెండా ఎగురవేశారు. ఈ ఘనత సాధించిన తొలి కేరళ మహిళగా చరిత్ర సృష్టించారు. సంకల్పానికి పట్టుదల తోడైతే ఎంతటి శిఖరమైనా అందుకోవచ్చనే జీవిత సత్యాన్ని ఈ విజయం నేర్పిందంటున్న సఫ్రినా జర్నీ ఇది.

సంకల్ప శిఖరం

"ఉద్వేగం, ఆనందం, ఆశ్చర్యం... ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించిన ఆ క్షణం నా మదిలో ఎన్నో భావనలు. అంతెత్తున నిలుచున్నప్పుడు ప్రపంచాన్నే జయించిన అనుభూతి. దాన్ని వర్ణించడానికి ఇప్పటికీ మాటలు సరిపోవడంలేదు. కేరళలోని కన్నూర్ జిల్లా వెంగాడ్ మాది. పెళ్లి తరువాత నా నివాసం కతార్‌లోని దోహాకు మారింది. మావారు డాక్టర్ షమీల్ ముస్తఫా దోహా 'హమద్ మెడికల్ కార్పొరేషన్'లో సర్జన్. నేను 'ఇఫ్రిన్ బెస్పోక్ సుగర్‌టేల్స్' బ్రాండ్‌తో కేక్‌లు తయారు చేస్తాను. పలు అవార్డులు కూడా అందుకున్నాను. కొవిడ్ సమయంలో అందరూ ఇళ్లకే పరిమితమైతే... నేను, మావారు ఫిట్‌నెస్ కోసం జిమ్‌లో చేరాం. అప్పుడు అర్థమైంది... పని ఒత్తిడి పేరుతో మమ్మల్ని మేము ఎంత అశ్రద్ధ చేశామనేది. ఆరంభంలో ట్రెడ్‌మిల్ లాంటి సాధారణ వ్యాయామాలు చేయడానికి కూడా శక్తి సరిపోయేది కాదు. నేనైతే జిమ్‌లో అరగంట సెషన్ కూడా పూర్తికాకుండానే అలసిపోయేదాన్ని. క్రమంగా ఆహారపు అలవాట్లు కూడా మార్చాను. వర్కవుట్స్‌తో శరీరం కాస్త స్వాధీనంలోకి వచ్చాక నాపై నాకు నమ్మకం పెరిగింది. అప్పుడే పర్వతాలు ఎక్కాలనే చిన్ననాటి కోరిక నా మదిలో మెదిలింది. మావారికి చెబితే, ఆయన కూడా ఆసక్తి చూపారు.

అలా మొదలైంది...

ఇద్దరం మౌంటెనీరింగ్ శిక్షణలో చేరాం. ఒక్కో లక్ష్యం నిర్దేశించుకొంటూ ముందుకు సాగాను. తొలి ప్రయత్నంగా టాంజానియాలోని కిలిమంజారో ఎక్కాను. ఆ ఉత్సాహంతో అర్జెంటీనాలోని అకోన్‌కాగువా, తరువాత రష్యాలోని ఎల్‌బ్రస్ పర్వతాలను విజయవంతంగా అధిరోహించాను. వీటిల్లో అకోన్‌కాగువా ఎత్తయిన (6,961 మీటర్లు) పర్వతం. ఈ పర్వతారోహణ నాలో ఎనలేని ఆత్మవిశ్వాసం నింపింది. ఎవరెస్టు శిఖరాన్ని ముద్దాడాలన్న బలమైన ఆకాంక్ష రగిల్చింది. దాంతో కజకిస్తాన్ వెళ్లి మంచు పర్వతాల అధిరోహణలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నా.

ఫిట్‌నెస్ ఉంటేనే సరిపోదు...

ఎవరెస్టు అధిరోహణ అంటే కేవలం ఫిట్‌నెస్, శిక్షణ మాత్రమే సరిపోవు. పట్టుదల, అంకితభావంతో ఉండాలి. భావోద్వేగాలపై నియంత్రణ సాధించాలి. అన్నిటికీ మించి ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలి. ఈ సాహస యాత్రకు దాదాపు డెబ్బై లక్షలు ఖర్చు అవుతుంది. దీని కోసం బెంగళూరులో ఉన్న మా ఇంటిని అమ్మేశాం. కష్టపడి కొనుక్కున్న ఇల్లు. ఎంతో బాధ కలిగింది. యాత్ర కోసం మొదటి దఫా సొమ్ము చెల్లించినప్పుడు అనుకున్నా... 'ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయకూడదు' అని. ఈ ఏడాది జనవరిలో దృఢ సంకల్పంతో కఠోర సాధన మొదలుపెట్టాను. ముందుగా అనుకున్నది నేను, మావారు కలిసి వెళ్లాలని. కానీ ఆఖరి నిమిషంలో ఆయన గాయంతో తప్పుకున్నారు. తరువాత దోహాలోనే పర్వతారోహణలో నైపుణ్యంగల ట్రైనర్ వద్ద శిక్షణ తీసుకున్నా.

అడుగడుగునా సవాళ్లే...

ఏప్రిల్ మాసం... 12వ తేదీ... గడ్డ కట్టే చలి. ఈదురు గాలులు. ఎవరెస్టు బేస్ క్యాంప్ వైపు నడక మొదలైంది. అంటే నా సాహస యాత్రలో తొలి అడుగు. దట్టంగా మంచు కప్పిన పర్వతంపై... సన్నని దారిలో పదహారు గంటలపాటు సాగింది ప్రయాణం. ఒక క్యాంపు నుంచి మరో క్యాంపునకు. మధ్యలో చిన్నపాటి విరామం. శరీరం ఆ భయంకర వాతావరణానికి కాస్త అలవాటు పడింది. కానీ అసలైన పరీక్ష రెండు రోజుల తరువాత ఎదురైంది. క్యాంపు 2 నుంచి మరింత కఠినంగా ఉంటుంది. అది చూసి మావారికి ఫోన్ చేశాను... 'నేను వెనక్కి వచ్చేస్తా' అని. ఆయన ఒప్పుకోలేదు. 'ఇది మనిద్దరి కల. నువ్వు నెరవేర్చాలి' అని ధైర్యం చెప్పారు. మనసులో వేరే ఆలోచనలు లేకుండా ముందుకు సాగాను. క్యాంపు 3, అంటే 7,100 మీటర్ల ఎత్తుకు వెళ్లాక ఆక్సిజన్ అత్యవసరమైంది. నిదానంగా క్యాంపు 4 వైపు ప్రయాణం మొదలైంది. దాన్ని 'డెత్ జోన్' అని కూడా అంటారు. కొంత దూరం వెళ్లాక ఫిలిప్పీన్ దేశానికి చెందిన పర్వతారోహకుడి శవం కనిపించింది. రెండు రోజుల కిందటే మరణించాడని తెలిసింది. ముందుకు వెళితే మరికొన్ని శవాలు. నా గుండె కొట్టుకొనే వేగం అమాంతం పెరిగింది. చాలా భయం వేసింది. అయితే మా గైడ్ ఇచ్చిన ధైర్యంతో అంతిమ ఘట్టానికి చేరువ అయ్యాం. కానీ వాతావరణం భయంకరంగా ఉంది. మంచు తుపానులు, చల్లని గాలులు, అత్యంత కఠినమైన మార్గం... అన్నిటినీ దాటుకొని మే 18న ఎవరెస్టు అంచుకు చేరాం.

నన్ను నేను నమ్మలేని క్షణం...

ఎవరెస్టు పర్వతం ఎత్తు 8,848 మీటర్లు. అంత ఎత్తుకు వెళ్లి నిలుచున్నప్పుడు నన్ను నేను నమ్మలేకపోయాను. ప్రపంచంలోకెల్లా ఎత్తయిన పర్వతం అధిరోహించానన్న వాస్తవం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎంతో భావోద్వేగానికి లోనయ్యాను. కన్నీళ్లు ఆగలేదు. అక్కడ భారత్, కతార్ పతాకాలు ఎగురవేశాను. అయితే పైకి వెళ్లగానే గాగుల్స్ లేకుండా ఎవరెస్టును చూడాలనుకున్నాను. కళ్లద్దాలు తీయగానే మంచు తుపాను తాకిడికి ఉన్నట్టుండి నా చూపు మందగించింది. ఏదీ స్పష్టంగా కనిపించలేదు. ఒళ్లంతా నొప్పులు. చేతులు వాచిపోయాయి. కళ్లు మండుతున్నాయి. కిందకి దిగడం ఒక పీడకలలా మిగిలిపోయింది. దారిలో నాకు నేను చెప్పుకున్నాను... 'ఎలాగైనా సరే శవంగా కాకుండా బతికి ఇంటికి వెళ్లాలి' అని. మా గైడ్ సాయంతో పది గంటలు ఆలస్యంగా క్యాంపు 4కు చేరుకున్నాను. తరువాత హెలికాప్టర్‌లో కఠ్మండూ ఆసుపత్రికి తీసువెళ్లి చికిత్స అందించారు. అప్పుడు మరో జన్మ ఎత్తిన అనుభూతి కలిగింది."

మా అమ్మాయికి స్ఫూర్తినవ్వాలి...

నిజానికి ఇంటి నుంచి వెళ్లేముందే నా భర్తకు, కూతురుకు ఇక సెలవని చెప్పాను. ఎందుకంటే నాకు తెలుసు... ఎవరెస్టు పర్వతారోహణ ఎంత ప్రమాదకరమో. అయితే ఆత్మవిశ్వాసంతో అన్నిటినీ జయించాను. తిరిగి ఇంటికి రాగలిగాను. అది కూడా సజీవంగా. ఇప్పుడు నా కూతురుకు చెప్పడానికి నా దగ్గర ఎన్నో కథలు ఉన్నాయి. అవి విని తను ప్రేరణ పొందాలి. తనకు నేను అతిపెద్ద స్ఫూర్తిమంత్రం అవ్వాలి. ఎందుకంటే నేను ఒక తల్లిని. కేక్ ఆర్టిస్ట్‌ని. ఒకప్పటి బ్యాంకర్‌ని. ఇప్పుడు పర్వతారోహకురాలిని. ఒక సాధారణ వ్యక్తిని ఎన్నో సాధించాను. నాలాంటి మహిళలకు చెప్పేది ఒక్కటే... మీరు ఎక్కే పర్వతం ఎవరెస్టు కాకపోవచ్చు... కానీ సాధించాలనే తపన, పట్టుదల, బలమైన సంకల్పం ఉంటే జీవితంలో ఎంతటి ఎత్తయిన శిఖరాన్నయినా అధిరోహించవచ్చు.



క్విజ్ క్వీన్

శరణ్య జయకుమార్... కాటన్ చీరలో, పూర్తిగా తెల్లబడిపోయిన జుట్టుతో ఎంతో నిరాడంబరంగా... పక్కింటి బామ్మలా కనిపిస్తారు.కానీ క్విజ్ పోటీకి దిగితే యువతను మించిన ఉత్సాహం ఆమెలో కనిపిస్తుంది. '85 ఏళ్ల వయసులోనూ ఇంకా నేర్చుకుంటున్నా'నంటున్న ఈ శరణ్య చెబుతున్న సంగతులివి.



"క్విజ్‌లకే నా జీవితం అంకితం చేశానని అందరూ అనుకుంటారు. కానీ నాకు అంతకన్నా ఇష్టమైన అభిరుచి ఉంది... పుస్తకాలు చదవడం. నిజానికి కాలేజీ రోజుల వరకూ క్విజ్ అనే పదం కూడా నాకు పెద్దగా పరిచయం లేదు. ఇది 1950ల్లో మాట. అప్పట్లో మాకు ఎక్కువ మాధ్యమాలు అందుబాటులో లేవు. కాబట్టి పుస్తకాలే లోకంగా ఉండేది. ఎప్పుడు ఖాళీ దొరికినా లైబ్రరీలోనే ఉండేదాన్ని. నా ఆసక్తిని మా ఇంగ్లీష్ ప్రొఫెసర్ గమనించారు. "నగరంలో క్విజ్ పోటీలు జరుగుతున్నాయి. పేరు ఇవ్వొచ్చు కదా?" అన్నారు. అదేంటో తెలుసుకోవాలనే ఆసక్తి కలిగింది. పోటీలో పాల్గొన్నాను. అది నన్ను ఒక వ్యసనంలా అంటుకుంది. ఎనభై అయిదేళ్ల వయసులో కూడా నేను చురుగ్గా, ఉత్సాహంగా ఉండేలా చేస్తోంది.

గెలుపు మీదే దృష్టి

చెన్నై నగరం నా స్వస్థలం. అక్కడి క్వీన్ మేరీ కాలేజీ, ప్రెసిడెన్సీ కాలేజీల్లో చదివాను. ఆంగ్ల సాహిత్యంలో మాస్టర్స్ చేశాను. మరోవైపు క్విజ్ పోటీల్లో పాల్గొనడం కొనసాగించాను. ఆ రోజుల్లో చెన్నైలో రెండు ప్రధాన పోటీలు మాత్రమే జరిగేవి. వాటిలో ఒకటి మద్రాస్ స్టూడెంట్స్ యూనియన్ క్విజ్. మరొకటి బాగా పేరున్న 'జాన్సన్ కప్'. అయితే పాల్గొనేవారు మరీ ఎక్కువగా ఉండేవారు కాదు. మహిళల సంఖ్యయితే బాగా తక్కువ. కానీ దాన్ని ఆడ, మగ మధ్య పోటీగా భావించేవాళ్ళం కాదు. మా పరిజ్ఞానాన్ని ప్రదర్శించి గెలవడం మీదే దృష్టి ఉండేది. జాన్సన్ కప్‌ను చాలాసార్లు గెలిచాను. చదువు పూర్తయ్యాక... జయకుమార్‌తో వివాహం జరిగింది. కోల్‌కతాకు మారాల్సి వచ్చింది. కుటుంబ బాధ్యతలు, నలుగురు పిల్లల సంరక్షణలో నిమగ్నమైపోయాను. క్విజ్‌ల మీద నాకున్న ఆసక్తిని పక్కన పెట్టేశాను. అలా పదహారేళ్ళు గడిచాయి.. అప్పుడే ఊహించని విధంగా నా రీఎంట్రీ జరిగింది.

ఆ సంఘటన కళ్లు తెరిపించింది...

ఒక రోజు మా ఆడపడుచు కొడుకు పేపర్‌లో ఒక ప్రకటన చూపించాడు. అప్పట్లో దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఓపెన్ క్విజ్... 'నార్త్ స్టార్ క్విజ్' పోటీ ప్రకటన అది. పూర్వం క్విజ్‌లలో పాల్గొన్న అనుభవం నాకుంది కాబట్టి పాల్గొంటే బాగుంటుందన్నాడు. నేనూ సరేనన్నాను. కానీ దానికోసం ఏదీ చదవకుండానే పోటీకి వెళ్లాను. బెల్జియం జాతీయ గీతం ఏమిటనే ప్రశ్న ఎదురైంది. దానికి పద్నాలుగేళ్ళ కుర్రాడు జవాబిచ్చాడు. ఆ సంఘటన నా కళ్లు తెరిపించింది. అలాంటి పోటీలో పాల్గొనాలంటే ఇంకా ఎంతో తెలుసుకోవాలని అర్థమైంది. అక్కడ నాకు కొందరు ఔత్సాహికులు పరిచయం అయ్యారు. మేము 'మోటెలీ క్రూ' అనే కొత్త టీమ్ ఏర్పాటు చేశాం. కొద్దికాలంలోనే మా టీమ్ కోల్‌కతాలో జరిగిన పలు క్విజ్ పోటీల్లో తన ఉనికిని బలంగా చాటుకుంది. నీల్ ఓబ్రెయిన్ లాంటి దిగ్గజాలతో కూడా మా జట్టు పోటీ పడింది. ఆ తరువాత ఆయన మార్గదర్శకత్వంలో మేము మరింత పదును తేలాం. ఎన్నో విజయాలు సాధించాం. అవన్నీ మరపురాని రోజులు. అలా దాదాపు ఏడేళ్ళు గడిచాక.. కోల్‌కతా అధ్యాయాన్ని ముగించాల్సి వచ్చింది.

క్విజ్జింగ్ ఫ్యామిలీ...

మా కుటుంబం 1986లో చెన్నైకి తిరిగి వచ్చింది. అప్పటికి నా పిల్లలు పెద్దవారయ్యారు. మా పెద్దబ్బాయి నవీన్, అతని మెడికల్ కాలేజీ మిత్రులతో 'మెమెరీ బ్యాంక్' అనే టీమ్ ఏర్పాటు చేశాను. అలాగే 1987లో చెన్నైలో 'క్విజ్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' స్థాపనకు దోహదం చేశాను. 1990ల ప్రారంభంలో మా టీమ్ 'ఆల్ ఇండియా నార్త్ స్టార్ ట్రోఫీ'ని గెలిచింది. ఆ ప్రతిష్ఠాత్మకమైన టైటిల్ కోల్‌కతాను దాటి వెళ్లడం అదే మొదటిసారి. అలాగే 'ఆలిండియా రౌండ్ టేబుల్ క్విజ్'లోనూ టైటిల్ సాధించాం. ఈ విజయాలు ఎన్నో ఏళ్ళు కొనసాగాయి. ఆ తరువాత క్విజ్ మాస్టర్‌గా కూడా వ్యవహరించాను. భారత దేశంలో మొదటి మహిళా క్విజ్ మాస్టర్ కూడా బహుశా నేనే కావచ్చు. అంతేకాదు, మా పెద్దబ్బాయి డాక్టర్ నవీన్ కూడా సుప్రసిద్ధ క్విజ్ మాస్టర్, చాలా ప్రజాదరణ పొందిన 'ల్యాండ్‌మార్క్ క్విజ్'కు హోస్ట్ కూడా. అలాగే మరో ఇద్దరు అబ్బాయిలు నిరంజన్, శ్రీకాంత్, నవీన్ కొడుకు ఈశ్వర్ కూడా ఈ అంశంలో నిష్ణాతులే. ఇది అరుదైన విషయం అందుకే 'భారతదేశంలో తొలి క్విజ్జింగ్ ఫ్యామిలీ'గా మాకు గుర్తింపు లభించింది. అంతేకాదు, క్విజ్‌లలో పాల్గొంటున్న వయోధికురాలైన మహిళను కూడా నేనే.

వయసుతో నిమిత్తం లేదు...



ఇప్పటికీ ఇందులో కొనసాగడానికి కారణం నాకు దీనిపై ఉన్న ఆసక్తితో పాటు నిరంతరం ఏదో తెలుసుకోవాలనే తపన. కొత్త పుస్తకాలను నిరంతరం చదువుతూ ఉంటాను. క్విజ్‌లపై కొన్ని పుస్తకాలు కూడా రాశాను. వాటిలో మతానికి సంబంధించిన వెయ్యి ప్రశ్నలతో రూపొందించిన 'థౌజండ్ రెలిజియస్ క్వశ్చన్స్'కు మంచి పేరు వచ్చింది. ఎంతోకాలంగా ఈ రంగంలో కొనసాగుతూ, దీని అభివృద్ధి కోసం నేను చేసిన కృషికి గుర్తింపుగా ఈ ఏడాది మార్చిలో జీవితకాల సాఫల్య పురస్కారాన్ని 'క్విజ్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' అందజేసింది. ఈ తరం వాళ్ళు నన్ను ఎన్నో ప్రశ్నలు వేస్తూ ఉంటారు. మేము అప్పట్లో అన్నీ గుర్తు పెట్టుకోవాల్సి వచ్చేది. ఏది ఎక్కడుందో వెతుక్కోవాల్సి వచ్చేది. ఇది ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్ల యుగం. కాబట్టి సమాచారం దొరకడం సులువయింది. కానీ క్విజ్‌లో భౌగోళిక శాస్త్రం, సంప్రదాయ సాహిత్యం, చరిత్ర లాంటి అంశాలు మాత్రం ఎప్పటికీ మారవు. క్విజ్‌లో పాల్గొనేవారికి కుతూహలం ముఖ్యం. దానికి వయసుతో నిమిత్తం లేదు. నేర్చుకోవడం ఆపకూడదు. నేను ఇప్పటికీ చేస్తున్నది అదే."

వంటగది సింక్‌లో నీళ్లు పోవడం లేదా...?



మనం సాధారణంగా వంటగది సింక్‌లో వంట పాత్రలు, భోజనం చేసిన పళ్లాలు కడుగుతూ ఉంటాం. దీంతో ఒక్కోసారి సింక్‌లో దాని కింద ఉన్న పైప్‌లో వ్యర్థ పదార్థాలు పేరుకుని నీళ్లు పోకుండా అడ్డుపడుతుంటాయి. క్రమంగా సింక్ మురికి నీళ్లతో నిండి దుర్వాసన వస్తూ ఉంటుంది. ఇలా కాకుండా సింక్‌ను, దాని పైప్‌నూ ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం....

- సింక్ పూర్తిగా మురికి నీళ్లతో నిండిపోతే వెంటనే ప్లంజర్‌ను రంధ్రాలపై ఉంచి గట్టిగా నొక్కి తీయాలి. చిన్నపాటి అడ్డంకులు ఉంటే అవి తొలగి నీళ్లు వేగంగా మోరీలోకి పోతాయి. తరవాత వేడినీళ్లతో సింక్‌ను శుభ్రం చేసుకోవాలి.
- సింక్‌లో అర కప్పు బేకింగ్ సోడా చల్లాలి. దాని మీద అరకప్పు వెనిగర్‌ను స్ప్రే చేయాలి. ఈ మిశ్రమం మెల్లగా సింక్ పైప్‌లోకి జారి అక్కడి వ్యర్థాలను కరగిస్తుంది. పావు గంట తరవాత ఒక గ్లాసు వేడి నీళ్లను సింక్‌లో పోస్తే వ్యర్థాలన్నీ తొలగి సింక్ శుభ్రపడుతుంది. ఇలా నెలకి ఒకసారి చేస్తూ ఉంటే సింక్‌లో సమస్యలు రావు.
- ఒక్కోసారి సింక్ పైప్‌లో, అలాగే మోరీలో నూనెలు ఇతర వ్యర్థాలు గడ్డలా పేరుకోవడంతో సింక్‌లో నీళ్లు నిలిచిపోతుంటాయి. ఇలాంటప్పుడు మూడు గ్లాసుల వేడివేడి నీళ్లలో కొద్దిగా సర్ఫ్ లేదా షాంపూ వేసి బాగా కలిపి సింక్‌లో పోయాలి. ఇలా పది నిమిషాల వ్యవధితో రెండు సార్లు చేస్తే వ్యర్థాలన్నీ కరగిపోతాయి. సింక్ పైప్, మోరీ శుభ్రమవుతాయి.
- ఒక గిన్నెలో అర కప్పు ఉప్పు వేసి అందులో నాలుగు చెంచాల నిమ్మరసం కలపాలి. రాత్రి పడుకునే ముందు ఈ మిశ్రమాన్ని సింక్ లోపల పరచాలి. ఉదయం లేవగానే సింక్‌లో వేడి నీళ్లు చల్లాలి. అయిదు నిమిషాల్లో సింక్ పూర్తిగా శుభ్రమవుతుంది. దుర్వాసన కూడా పోతుంది. వారానికి రెండు సార్లు ఇలా చేస్తూ ఉంటే సింక్‌లో నీళ్లు నిలవవు.
- గిన్నెలు, పళ్లాలు కడిగిన వెంటనే సింక్‌లో మిగిలిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి. బ్రష్‌తో సింక్‌ను రుద్ది నీళ్లు పోస్తూ శుభ్రం చేయాలి.
- సింక్ కింద ఉన్న మోరీలో తరచూ ఒక బకెట్ వేడి నీళ్లు పోస్తూ ఉంటే సమస్యలు రావు.

మామిడి తొక్క మంచిదేనా?



మామిడి పళ్లను ఇష్టపడని వారు ఉండరు. కానీ చాలామంది మామిడి తొక్కను తినకుండా పడేస్తారు. అయితే ఆ తొక్కలో కూడా పోషకాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం..

- మామిడి తొక్కలో ఫైబర్, విటమిన్ సి, ఇ, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఫైబర్ జీర్ణ సమస్యలను తగ్గించడంతో పాటు ఆకలిని నియంత్రిస్తుంది. తొక్కలోని కెరోటినాయిడ్‌లు చర్మాన్ని ఆరోగ్యవంతంగా ఉంచడంలో సహాయపడతాయి. మామిడి తొక్కలోని పాలిఫెనాయిల్స్ కెరోటినాయడ్స్ వలన గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. మామిడి తొక్క మధుమేహాన్ని నియంత్రించడంలోనూ సహాయపడుతుందని కొన్ని పరిశోధనల్లో తేలింది.
- **పురుగుమందుల అవశేషాలు:** మామిడి తొక్కలో ఎన్నో పోషకాలు ఉన్నప్పటికీ దానిని తినడం వలన కొన్ని సమస్యలు వచ్చే అవకాశాలున్నాయి. మామిడి తొక్కలోని ఉరుషియోల్ వలన కొందరికి చర్మంపై దద్దుర్లు, దురద వంటి సమస్యలు తలెత్తే ప్రమాదముంది. మామిడి తోటల్లో వాడే క్రిమి సంహారక మందుల అవశేషాలు మామిడి తొక్కపై ఉంటాయి. వాటి వలన అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది.
- **సేంద్రీయ పళ్లు మేలు:** ఎలాంటి పురుగు మందులు వాడకుండా పెంచే సేంద్రీయ(ఆర్గానిక్) పళ్లు తినడం మంచిది. అవి దొరకని పక్షంలో పళ్లను బాగా శుభ్రం చేసుకొని తినాలి.
- **ఇలా శుభ్రం చేద్దాం :** నీళ్లలో ఉప్పు, పసుపు కలిపి పావు గంటసేపు పళ్లను అందులో నానబెట్టాలి. ఆ తరువాత తీసి బాగా రుద్దుతూ కడగాలి. ఇలా చేయడం వలన పళ్ల మీద ఉన్న పురుగు మందుల అవశేషాలు తొలగిపోతాయి.
- నీళ్లతో వెనిగర్ లేదా బేకింగ్ సోడా వేసి ఓ ఇరవై నిమిషాల పాటు మామిడి పళ్లను వాటిలో నానబెట్టాలి. తరువాత మంచినీటితో శుభ్రంగా కడగాలి.

ఆఖరాటలో అదరగొట్టినా

అట్టడుగునే..

గుజరాత్‌పై చెన్నై భారీ గెలుపు



బ్రేవిస్ (23 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సులతో 57)

అహ్మదాబాద్: ఐపీఎల్‌ను చెన్నై సూపర్ కింగ్స్ విజయంతో ముగించింది. ఆదివారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో 83 పరుగులతో టేబుల్ టాపర్ గుజరాత్ టైటాన్స్ చిత్తు చేసింది. అన్ని లీగ్ మ్యాచ్‌లను పూర్తి చేసిన ఐదుసార్లు చాంపియన్ చెన్నై కేవలం 8 పాయింట్లతో పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. కాగా ఈ సీజన్‌లో నాకౌట్‌కు చేరడంలో విఫలమైన జట్టు ప్లే ఆఫ్స్‌కు చేరిన టీమ్‌ను ఓడించడం వరుసగా ఇది నాలుగోసారి.

ఇక-డెవాల్డ్ బ్రేవిస్ (23 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 57) మెరుపులకు కాన్వే (35 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 52), ఆయుష్ మాత్రే (17 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 34), ఉర్విల్ పటేల్ (19 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 37) ధనాధన్ బ్యాటింగ్ తోడవడంతో తొలుత చెన్నై 20 ఓవర్లలో 230/5 స్కోరు చేసింది. ఈ ఐపీఎల్‌లో చెన్నైకిదే అత్యధిక స్కోరు. భారీ ఛేదనలో గుజరాత్ 18.3 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌటైంది. సాయి సుదర్శన్ (41), అర్షద్ ఖాన్ (20) మాత్రమే ఓ మోస్తరుగా ఆడారు. అన్షుల్ కాంబోజ్ (3/13), స్పిన్నర్ నూర్ అహ్మద్ (3/21) చెరో 3 వికెట్లు పడగొట్టారు. బ్రేవిస్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

పవర్ ప్లేలోనే తేలిపోయింది: ఫామ్‌లో ఉన్న కెప్టెన్ గిల్ (13), బట్లర్ (5), హార్డ్ హిట్టర్ రూథర్‌ఫోర్డ్ (0) విఫలమవడంతో పవర్ ప్లేలో 35/3తో గుజరాత్ ఓటమి అంచున నిలిచింది. సుదర్శన్, షారుఖ్ (19) నాలుగో వికెట్‌కు 55 రన్స్ జోడించినా.. వారిద్దరినీ జడేజా 4 బంతుల తేడాతో పెవిలియన్ చేర్చడంతో గుజరాత్ కోలుకోలేకపోయింది.

బ్యాటర్లు 'సూపర్': ఆఖరి మ్యాచ్‌లో చెన్నై బ్యాటర్లు ప్రత్యర్థి బౌలర్లను ఆడేసుకున్నారు. బ్రేవిస్, ఆయుష్ మాత్రే, ఉర్విల్ పటేల్ మెరుపు ఇన్నింగ్స్‌తో అలరించారు. మాత్రే, కాన్వే జోరుకు 3.4 ఓవర్లలోనే 44 పరుగులు చేసిన చెన్నైతిరుగులేని స్థితికి చేరింది. అర్షద్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో మాత్రే 2, 6, 6, 6, 4, 4తో 28 పరుగులు కొల్లగొట్టాడు. ఇదే ఓవర్లో మాత్రే నిష్క్రమించినా..కాన్వే, ఉర్విల్ ఏమాత్రం తగ్గకుండా రెండో వికెట్‌కు 63 పరుగులు జోడించారు. 10వ ఓవర్లో రషీద్ ఖాన్ బౌలింగ్‌లో ఉర్విల్ కొట్టిన సిక్సర్ మ్యాచ్‌కే హైలైట్. ఆ వెంటనే ఉర్విల్ అవుటైనా కాన్వే ఎదురు దాడి కొనసాగించి హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కాన్వేను రషీద్ బౌల్డ్ చేయగా అనంతరం గుజరాత్ బౌలర్లకు చుక్కలు చూపిన బ్రేవిస్ ఐదో వికెట్‌కు జడేజా (21)తో కలిసి 39 బంతుల్లోనే 74 పరుగులు జత చేశాడు. ఈ క్రమంలో బ్రేవిస్ 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు.

నేటి మ్యాచ్
పంజాబ్ x ముంబై
వేదిక: జైపూర్
రా.7.30 నుంచి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	14	9	5	0	18	0.254
పంజాబ్	13	8	4	1	17	0.327
బెంగళూరు	13	8	4	1	17	0.255
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	14	7	6	1	15	0.011
హైదరాబాద్	14	6	7	1	13	-0.241
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	14	5	7	2	12	-0.305
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	14	4	10	0	8	-0.647

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

చెన్నై: ఆయుష్ మాత్రే (సి) సిరాజ్ (బి) ప్రసిద్ధ్ 34, కాన్వే (బి) రషీద్ 52, ఉర్విల్ పటేల్ (సి) గిల్ (బి) సాయికిషోర్ 37, శివమ్ దూబే (సి) కొట్జీ (బి) షారుఖ్ 17, బ్రేవిస్ (సి) బట్లర్ (బి) ప్రసిద్ధ్ 57, జడేజా (నాటౌట్) 21, ఎక్స్‌ట్రాలు : 12 ; మొత్తం 20 ఓవర్లలో 230/5 ; వికెట్ల పతనం : 1-44, 2-107, 3-144, 4-156, 5-230 ; బౌలింగ్: సిరాజ్ 4-0-47-0, అర్షద్ ఖాన్ 2-0-42-0, ప్రసిద్ధ్ 4-0-22-2, కొట్జీ 3-0-34-0, సాయి కిషోర్ 2-0-23-1, రషీద్ ఖాన్ 4-0-42-1, షారుఖ్ ఖాన్ 1-0-13-1

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) శివమ్ దూబే (బి) జడేజా 41, గిల్ (సి) ఉర్విల్ (బి) అన్షుల్ కాంబోజ్ 13, బట్లర్ (సి) అన్షుల్ (బి) ఖలీల్ 5, రూథర్‌ఫోర్డ్ (సి) మాత్రే (బి) అన్షుల్ 0, షారుఖ్ ఖాన్ (సి) పథిరన (బి) జడేజా 19, తెవాటియా (సి) శివమ్ దూబే (బి) నూర్ అహ్మద్ 14, రషీద్ (సి) ఉర్విల్ (బి) నూర్ అహ్మద్ 12, కొట్జీ (బి) పథిరన 5, అర్షద్ ఖాన్ (బి) నూర్ అహ్మద్ 20, సాయి కిషోర్ (సి) ధోనీ (బి) అన్షుల్ 3, సిరాజ్ (నాటౌట్) 3, ఎక్స్‌ట్రాలు : 12 ; మొత్తం 18.3 ఓవర్లలో 147 ఆలౌట్ ; వికెట్ల పతనం : 1-24, 2-29, 3-30, 4-85, 5-86, 6-105, 7-110, 8-126, 9-142 ; బౌలింగ్: జడేజా 3-0-17-2, ఖలీల్ అహ్మద్ 3-0-17-1, అన్షుల్ కాంబోజ్ 2.3-0-13-3, శివమ్ దూబే 2-0-33-0, నూర్ అహ్మద్ 4-0-21-3, పథిరన 3-0-29-1, దీపక్ హుడా 1-0-15-0.

విజయంతో.. వీడ్కోలు

- చివరి పోరులో సన్‌రైజర్స్ విజృంభణ
- క్లాసెన్, హెడ్ సుడిగాలి ఇన్నింగ్స్
- 110 పరుగులతో కోల్‌కతా చిత్తు



క్లాసెన్ (39 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సులతో 105 నాటౌట్)

లీగ్‌లో అత్యధిక స్కోర్లు..
- 287/3 సన్‌రైజర్స్ (2024)
- 286/6 సన్‌రైజర్స్ (2025)
- 278/3 సన్‌రైజర్స్ (2025)
- 277/3 సన్‌రైజర్స్ (2024)

న్యూఢిల్లీ: క్లాసెన్ (39 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్స్‌లతో 105 నాటౌట్) విధ్వంసక శతకంతో.. ఐపీఎల్ చరిత్రలో మూడో అత్యధిక స్కోరు నమోదు చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఈ సీజన్‌ను ఘన విజయంతో ముగించింది. ఆదివారం జరిగిన తమ ఆఖరి, నామమాత్రపు మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 110 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంప్ కోల్‌కతా నైట్ రైడర్స్‌ను చిత్తు చేసింది. తొలుత సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 278/3 స్కోరు చేసింది. ట్రావిస్ హెడ్ (40 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 76) దూకుడైన హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. నరైన్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో కోల్‌కతా 18.4 ఓవర్లలో 168 పరుగులకే ఆలౌటైంది. మనీష్ పాండే (37), హర్షిత్ రాణా (34), నరైన్ (31) మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. ఉనాద్కట్, మలింగ, హర్ష్ దూబే తలో మూడు వికెట్లు పడగొట్టారు. క్లాసెన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

బాదుడే.. బాదుడు..: ఆరంభంలో హెడ్.. ఆ తర్వాత క్లాసెన్ ఊచకోతతో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న సన్‌రైజర్స్ కొండంత స్కోరు చేసింది. ఓపెనర్ అభిషేక్ (32)తో కలసి తొలి వికెట్‌కు 92 పరుగులు జోడించిన హెడ్.. క్లాసెన్‌తో కలసి రెండో వికెట్‌కు 83 పరుగుల భాగస్వామ్యంతో భారీ స్కోరుకు బాటలు వేశాడు. ఆ తర్వాత క్లాసెన్, ఇషాన్ కిషన్ (29) మూడో వికెట్‌కు 36 బంతుల్లో 83 పరుగులు జతచేర్చి ఫినిషింగ్ టచ్ ఇచ్చారు. పవర్‌ప్లేలో హెడ్ శివాలెత్తడంతో స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఆరు ఓవర్లకు సన్‌రైజర్స్ 79/0తో నిలిచింది. అయితే, ఏడో ఓవర్‌లో నరైన్ బౌలింగ్‌లో అభిషేక్ అవుటయ్యాడు. హెడ్‌కు తోడు క్లాసెన్ కూడా ఆకాశమే హద్దుగా చెలరేగడంతో 8వ ఓవర్‌లోనే జట్టు స్కోరు సెంచరీ దాటింది. దూకుడుగా ఆడుతున్న హెడ్‌ను నరైన్ అవుట్ చేసినా.. జోరు తగ్గని క్లాసెన్ 15వ ఓవర్‌లో రెండు సిక్స్‌లతో స్కోరును 200 దాటించాడు. డెత్ ఓవర్లలో క్లాసెన్, ఇషాన్ కోల్‌కతా బౌలర్లకు చుక్కలు కనిపించాయి. అయితే కిషన్‌ను అరోరా అవుట్ చేశాడు. సెంచరీ పూర్తి చేసుకొన్న క్లాసెన్ బౌండ్రీతో టీమ్ స్కోరును 280 మార్క్‌కు చేరువ చేశాడు. 37 బంతుల్లో సెంచరీ పూర్తిచేసిన క్లాసెన్.. 2010 సీజన్‌లో ఇన్నే బంతుల్లో శతకబాదిన యూసుఫ్ పఠాన్ రికార్డును సమం చేశాడు. ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ క్రిస్ గేల్ (30) పేరిట ఉంది.

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: అభిషేక్ (సి) రింకూ (బి) నరైన్ 32, హెడ్ (సి) రస్సెల్ (బి) నరైన్ 76, క్లాసెన్ (నాటౌట్) 105, ఇషాన్ (సి) నోకియా (బి) అరోరా 29, అనికేత్ (నాటౌట్) 12, ఎక్స్‌ట్రాలు: 24; మొత్తం: 20 ఓవర్లలో 278/3; వికెట్ల పతనం: 1-92, 2-175, 3-258; బౌలింగ్: వైభవ్ 4-0-39-1, నోకియా 4-0-60-0, హర్షిత్ 3-0-40-0, నరైన్ 4-0-42-2, వరుణ్ 3-0-54-0, రస్సెల్ 2-0-34-0.

కోల్‌కతా: డికాక్ (సి) మనోహర్ (బి) మలింగ 9, నరైన్ (బి) ఉనాద్కట్ 31, రహానె (సి) అభిషేక్ (బి) ఉనాద్కట్ 15, రఘువంశి (సి) నితీశ్ (బి) మలింగ 14, రింకూ (సి) నితీశ్ (బి) హర్ష్ దూబే 9, రస్సెల్ (ఎల్బీ) హర్ష్ దూబే 0, మనీష్ పాండే (సి) మనోహర్ (బి) ఉనాద్కట్ 37, రమణ్‌దీప్ (బి) హర్ష్ దూబే 13, హర్షిత్ రాణా (సి అండ్ బి) మలింగ 34, వైభవ్ అరోరా (రనౌట్) 0, నోకియా (నాటౌట్) 0, ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 18.4 ఓవర్లలో 168 ఆలౌట్; వికెట్ల పతనం: 1-37, 2-55, 3-61, 4-70, 5-70, 6-95, 7-110, 8-162, 9-162, 10-168; బౌలింగ్: కమిన్స్ 2-0-25-0, ఉనాద్కట్ 4-0-24-3, హర్షల్ 2-0-21-0, మలింగ 3.4-0-31-3, హర్ష్ దూబే 4-0-34-3, నితీశ్ 1-0-6-0, అభిషేక్ శర్మ 2-0-25-0.

రన్నరప్.. శ్రీకాంత్

మలేసియా మాస్టర్స్ ఫైనల్లో ఓటమి



కౌలాలంపూర్: ఆరేళ్ల తర్వాత తొలిసారి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్‌లో ఫైనల్ చేరిన భారత వెటరన్ షట్లర్ కిడాంబి శ్రీకాం త్.. టైటిల్ ఫైట్‌లో తడబడ్డాడు. మలేసియా మాస్టర్స్ సూపర్-500 టోర్నీలో శ్రీకాంత్ రన్నరప్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో శ్రీకాంత్ 11-21, 9-21తో వరల్డ్ నెం:4 లి షి ఫెంగ్ (చైనా) చేతిలో చిత్తయ్యాడు.

నార్వే చెస్ నేటి నుంచే

న్యూఢిల్లీ: చదరంగ క్రీడలో ప్రతిష్ఠాత్మకమైన నార్వే చెస్ టోర్నమెంట్ సోమవారం మొదలవనుంది. పురుషులు, మహిళల విభాగాల నుంచి ఆరుగురు అత్యుత్తమ క్రీడాకారుల మధ్య ఈ టోర్నీ జరగనుంది. భారత్ తరఫున పురుషుల కేటగిరిలో ప్రపంచ చాంపియన్ గుకేష్‌తో పాటు అర్జున్.. మహిళల్లో హంపి, వైశాలి తలపడుతున్నారు.

'ఫ్రెంచ్‌మ్యాన్'లా ఆదరించారు

సన్మాన వేడుకలో నడాల్ భావోద్వేగం





పారిస్: దాదాపు రెండు దశాబ్దాల పాటు అద్భుతమైన ఆటతో అభిమానులను ఉర్రూతలూగించి, గతేడాదే టెన్నిస్‌కు వీడ్కోలు పలికిన రఫెల్ నడాల్‌కు తనకు అచ్చొచ్చిన ఎర్రమట్టిలో ఘన సన్మానం జరిగింది. మరెవరికీ సాధ్యంకాని రీతిలో, ఏకంగా 14 సార్లు ఫ్రెంచ్ ఓపెన్ కిరీటాన్ని అందుకున్న ఈ మట్టి వీరుడికి రోలాండ్‌గారోస్ నిర్వాహకులు అద్భుతరీతిలో సత్కరించారు. ఫ్రెంచ్ ఓపెన్ తొలిరోజు పోటీల సందర్భంగా ఆదివారం 'రఫా..రఫా' అంటూ ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య నడాల్ మెయిన్ కోర్టులోకి అడుగుపెట్టాడు. అనంతరం తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్న రఫా..'అందరికీ నమస్కారాలు. 20 ఏళ్లపాటు ఈ కోర్టులో ఆడిన నాకు ఇప్పుడు ఎక్కడి నుంచి మొదలుపెట్టాలో కూడా తెలియడం లేదు. నిస్సందేహంగా ఈ వేదిక నాకెంతో ప్రత్యేకమైనది. థాంక్యూ ఫ్రాన్స్.. థాంక్యూ పారిస్.. నేనెన్నడూ ఊహించలేని మరపురాని క్షణాలు, మధురమైన అనుభూతులు ఇక్కడ నాకు పంచారు. మీ ఫ్రెంచ్‌మ్యాన్‌లా నన్ను ఆదరించారు' అని అన్నాడు. అనంతరం తన సమకాలీనులైన ఫెడరర్, జొకోవిచ్, ముర్రేలతో కలిసి నడాల్ ఫొటోలకు పోజిచ్చాడు. కార్యక్రమంలో నడాల్ తల్లిదండ్రులు, భార్య, రెండేళ్ల కుమారుడు హాజరయ్యారు.

సబలెంక శుభారంభం

ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలి రోజు స్టార్ ప్లేయర్లు శుభారంభం చేశారు. మహిళల టాప్‌సీడ్ సబలెంక, 8వ సీడ్ కిన్వెన్ జెంగ్, 11వ సీడ్ డయానా ష్నిదెర్, 13వ సీడ్ స్విటోలినా రెండోరౌండ్‌లో ప్రవేశించారు. క్లే కోర్టులో తొలి గ్రాండ్‌స్లామ్ కోసం ఎదురుచూస్తున్న సబలెంక 6-1, 6-0తో రఖిమోవాను చిత్తుచేసింది. చైనా స్టార్ కిన్వెన్ 6-4, 6-3తో పావ్ల్యుచెన్‌కోవాపై, ష్నిదెర్ 7-6 (3), 6-2తో సొబొలెవాపై, స్విటోలినా 6-1, 6-1తో సోమ్మెజ్‌పై నెగ్గారు. క్విటోవా 6-3, 0-6, 4-6తో గోల్‌బిచ్ చేతిలో పోరాడి ఓడింది.

బిజినెస్

25400 పైన బుల్లిష్

(మే 26-30 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అనలిస్ట్ కార్నర్

గత వారం నిఫ్టీ: 24853 (-167)

నిఫ్టీ గత వారం 24450-25009 పాయింట్ల మధ్యన కదలాడి 167 పాయింట్ల నష్టంతో 24853 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24737, 24828, 24647, 23279 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేక్అవుట్ స్థాయి: 25250 బ్రేక్‌డౌన్ స్థాయి: 24550
నిరోధ స్థాయిలు: 25050, 25150, 25250 (24950 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24650, 24550, 24450 (24750 దిగువన బేరిష్)

సైబర్ కేటుగాళ్లపై ఉమ్మడి యుద్ధం

టెల్కోలకు ఎయిర్‌టెల్ ప్రతిపాదన



న్యూఢిల్లీ: సైబర్ నేరాల కట్టడికి టెలికం కంపెనీలు ముందుకొస్తున్నాయి. తమ నెట్‌వర్క్‌ల ద్వారా జరిగే సైబర్ నేరాలు, మోసాలు, కుంభకోణాలను కట్టడి చేసేందుకు రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియాతో కలిసి పని చేసేందుకు ఎయిర్‌టెల్ సంసిద్ధత వ్యక్తం చేసింది. దీనికి సంబంధించి ఈ రెండు కంపెనీలకు ఒక ప్రతిపాదన చేసినట్టు టెలికం శాఖ (డాట్), ట్రాయ్‌కు తెలిపింది. సైబర్ కేటుగాళ్ల చేతుల్లో మోసపోతున్న వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇందుకోసం అందరం కలిసి పని చేద్దామని రెండు కంపెనీలకు విడి విడిగా లేఖలు రాసింది. గత ఏడాది తొలి తొమ్మిది నెలల్లోనే సైబర్ కేటుగాళ్లు వివిధ రకాల మోసాలతో అమాయక వినియోగదారుల నుంచి రూ.11,000 కోట్లకుపైగా కొల్లగొట్టడంతో దేశవ్యాప్తంగా పోలీసుల వద్ద 17 లక్షలకుపైగా కేసులు నమోదైన విషయాన్ని ఎయిర్‌టెల్ ఆ లేఖలో గుర్తు చేసింది.

తెలివి మీరిన మోసగాళ్లు

డిజిటల్ పేమెంట్స్ పెరిగిపోవడంతో సైబర్ నేరగాళ్లు మరింతగా రెచ్చిపోతున్నారు. టెక్నాలజీ కూడా ఇందుకు కలిసి వస్తోంది. టెలికం ఖాతాదారుల ఇమెయిల్స్, మొబైల్ నంబర్లు సేకరించి ఫిషింగ్, స్పామ్‌ల ద్వారా వారి బ్యాంకు ఖాతాలు కొల్లగొడుతున్నారు. ఇంకొందరు నకిలీ లోన్ ఆఫర్లు, మోసపూరిత పేమెంట్స్ పేరుతో టోపీ పెడుతున్నారు. కృత్రిమ మేధ (ఏఐ) కూడా వీరికి తోడవడంతో అచ్చం ఖాతాదారుల వాయిస్‌ను అనుకరిస్తూ బంధుమిత్రులతో మాట్లాడుతూ అందినకాడికి దోచుకుంటున్నారు. దీంతో ఎయిర్‌టెల్ ఇటీవల తన ఫ్రాడ్ డిటెక్షన్ సొల్యూషన్స్‌ను పటిష్ఠం చేసింది. ఓటీటీ యాప్స్, వాట్సప్, టెలిగ్రాం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి ప్లాట్‌ఫామ్స్ ద్వారా వచ్చే అనేక నకిలీ వెబ్‌సైట్లను బ్లాక్ చేసింది. అయితే సైబర్ నేరగాళ్ల రోజు రోజుకీ అధునాతన టెక్నాలజీతో రెచ్చిపోతున్నందున టెల్కోలన్నీ కలిసికట్టుగా వారి ఆటకట్టించడం మేలని ఎయిర్‌టెల్ తన లేఖలో పేర్కొంది.

ఈ వారం నాలుగు ఐపీఓలు

రూ.6,600 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఐపీఓ మార్కెట్ మళ్లీ పుంజుకుంటోంది. ఈ వారం రూ.6,600 కోట్లు సమీకరించేందుకు నాలుగు కంపెనీలు ఐపీఓలు జారీ చేస్తున్నాయి. ఇందులో లీలా ప్యాలెస్ హోటల్స్, ఏజిస్ ఒపాక్ టెర్మినల్స్, ప్రోస్టార్ ఇన్ఫోసిస్టమ్స్, స్కోడా ట్యూబ్స్ ఉన్నాయి. ఇవిగాక గత వారం ఐపీఓలు జారీ చేసిన బొరానా వీవ్స్, బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ కంపెనీల షేర్లు ఈ నెల 28, 29 తేదీల్లో లిస్టు కాబోతున్నాయి. మొత్తంమీద గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఐపీఓ మార్కెట్ జోరు తగ్గిందనే చెప్పాలి.

డాక్టర్ రెడ్డీస్‌కు ఎఫ్‌డీఏ అభ్యంతర పత్రం

న్యూఢిల్లీ: డాక్టర్ రెడ్డీస్ తెలంగాణ ప్లాంట్‌పై అమెరికన్ ఎఫ్‌డీఏ ఫారం 483 జారీ చేసింది. మిర్యాలగుడాలో ఉన్న ఈ ఏపీఐ ప్లాంట్‌ను ఎఫ్‌డీఏ బృందం గత సోమవారం నుంచి శనివారం వరకు తనిఖీ చేసి కొన్ని ఉల్లంఘనలను గుర్తించింది. వారు గుర్తించిన లోపాలను నిర్దిష్ట గడువులోగా సరిదిద్దుతామని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

ఎన్ఎస్‌డీఎల్ లాభం రూ.83 కోట్లు

న్యూఢిల్లీ: త్వరలో పబ్లిక్ ఇష్యూకి రానున్న నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) ఈ ఏడాది మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికానికి రూ.83.3 కోట్ల కన్సాలిడేటెడ్ నికరలాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదు చేసిన రూ.79.5 కోట్లతో పోలిస్తే ఇది 4.77 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం 9.94 శాతం పెరిగి రూ.394 కోట్లకు చేరింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	119
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	100
కర్నూలు	120	నెల్లూరు	105
విశాఖపట్నం	116	అనంతపురం	105
గోదావరి	119		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	510
వరంగల్	507	గోదావరి	495
చిత్తూరు	603	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ.	72

జీతం తక్కువైనా నో ఫికర్

- దీర్ఘకాలిక ప్రయోజనాలుంటే ఓకే
- ఉద్యోగుల మనోగతం

ముంబై: వేతనం కాస్తంత తక్కువైనా సరే..దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించినట్టయితే మాకు ఓకే అంటున్నారు ఇప్పుడు ఉద్యోగులు. ఒక పక్క జీవన ప్రమాణ ఒత్తిడులు నానాటికీ పెరిగిపోతుంటే మరో పక్క ఉద్యోగులపై కంపెనీల అంచనాలు కూడా పెరిగిపోయిన నేపథ్యంలో వారి ప్రాధాన్యతల్లో మార్పు వచ్చినట్టు ఒక సర్వేలో తేలింది. హెచ్ఆర్ సర్వీసులందించే జీనియస్ కన్సల్టెంట్స్ నిర్వహించిన సర్వేలో 74 శాతం మంది ఇదే అభిప్రాయం ప్రకటించారు. ఆరోగ్యబీమా, రిటైర్మెంట్ ప్లానింగ్, పిల్లల విద్యకు మద్దతు వంటి దీర్ఘకాలిక ప్రయోజనాలున్నట్టయితే వేతనం కాస్తంత తక్కువైనా తమకు సమ్మతమేనని వారు తెల్చి చెప్పారు. 1139 మంది ఉద్యోగులను సర్వేలో భాగంగా ప్రశ్నించారు. వారిలో కేవలం 32 శాతం మంది తమకు అందిస్తున్న ప్రయోజనాలు తమ సంక్షేమానికి మద్దతు ఇచ్చేవిగా ఉన్నాయని చెప్పగా 61 శాతం మంది ఆ ప్రయోజనాలు చాలవన్న అభిప్రాయం ప్రకటించారు. అయితే 54 శాతం మంది తమ కంపెనీ ఉద్యోగుల మానసిక, ఆర్థిక స్వస్థతకు ప్రాధాన్యం ఇవ్వడంలేదన్నారు. పని తీరు ఆధారిత బోనస్‌లు, ప్రోత్సాహకాలు తమ ఆర్థిక ఒత్తిడులు తగ్గేందుకు దోహదపడతాయని 73 శాతం మంది అంగీకరించారు.

అపోలో మైక్రో సిస్టమ్స్ రికార్డు లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో మైక్రోసిస్టమ్స్ కంపెనీ 2025 ఆర్థిక సంవత్సరంలో రికార్డు ఆదాయం, లాభాలు ప్రకటించింది. ముందు ఏడాదితో పోల్చితే ఆదాయం 51 శాతం పెరిగి రూ.372 కోట్ల నుంచి రూ.562 కోట్లకు చేరింది. నికరలాభం అయితే 81 శాతం వృద్ధితో రూ.56 కోట్లుగా నమోదయింది. మార్చి 31వ తేదీతో ముగిసిన నాలుగో త్రైమాసికంలో రూ.162.50 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.13.96 కోట్ల నికరలాభం ఆర్జించింది. 2025 ఆర్థిక సంవత్సరం తమ కంపెనీ చరిత్రలో ప్రత్యేకమైనదని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బద్దం కరుణాకర్ రెడ్డి అన్నారు. ప్రధానంగా ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్ కొనుగోలు ఒక కీలక మైలురాయి అని చెప్పారు. ఇది తమను రక్షణ రంగానికి చెందిన సమీకృత టయర్-1 ఓఈఎంగా మార్చుతుందన్నారు. రాబోయే రెండేళ్ల కాలంలో తాము ఆదాయంలో 45-50 శాతం సంచిత వార్షిక వృద్ధిని (సీఏజీఆర్) ఆశిస్తున్నామని చెప్పారు.

ఆచితూచి వ్యవహరించడమే మేలు

ఈ వారం సైతం దేశీయ స్టాక్‌మార్కెట్‌లో ఆటుపోట్లు తప్పేలా లేవు. సూచీల గమనానికి అంతర్జాతీయ సంకేతాలే కీలకం కానున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మళ్లీ సుంకాల హెచ్చరికలకు దిగడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మదుపరులు ఆచితూచి వ్యవహరించడమే మంచిది. గత వారం రియల్టీ, పీఎస్‌యూ, డిఫెన్స్, బ్యాంకింగ్ షేర్లు బాగా రాణించాయి. ఎఫ్ఎంసీజీ, ఆటో, టూరిజం, ఐటీ, చమురు కంపెనీల షేర్లు మాత్రం నిరాశపరిచాయి. దీంతో గత వారం నిఫ్టీ సగం నష్టాలను మాత్రమే పూడ్చుకుంది.

స్టాక్ రికమండేషన్లు

యాక్సిస్ బ్యాంక్: గత మూడు నెలల్లో యాక్సిస్ బ్యాంక్ షేర్లు 18 శాతం మేర పెరిగాయి. ప్రస్తుతం కన్సాలిడేషన్ దశలో ఉన్నాయి. ఆటుపోట్లు కూడా క్రమంగా తగ్గి, ప్రైస్ యాక్షన్, మూమెంటం పుంజుకుంది. గత వారం రూ.1,210 వద్ద ముగిసిన ఈ షేరు 21 రోజుల ఈఎంఏ వద్ద మద్దతు తీసుకుంది. రూ.1,260/1,320 టార్గెట్ ధరతో ఈ కౌంటర్లో రూ.1,200 స్థాయిలో పొజిషన్లు తీసుకోవచ్చు.

స్టాప్‌లాస్: రూ.1,175

ఎస్‌బీఐ లైఫ్: ప్రస్తుతం ఈ కౌంటర్ చాలా బలంగా కనిపిస్తోంది. షార్ట్, మీడియం, లాంగ్ టర్మ్ మూమెంటం బాగుంది. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా రాణిస్తోంది. గత వారం 2.2 శాతం లాభంతో రూ.1,798 వద్ద ముగిసింది. రూ.1,885 టార్గెట్‌తో రూ.1,780-1,790 మధ్య మదుపరులు ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు.

స్టాప్‌లాస్: రూ..1,760

సీడీఎస్ఎల్: గత వారం సీడీఎస్ఎల్ షేర్లు రూ.1,462 వద్ద ముగిశాయి. గత ఏడాది డిసెంబరు నుంచి దిద్దుబాటులో ఉన్న ఈ షేర్లు ప్రస్తుతం కన్సాలిడేషన్ చివరి దశకు చేరుకున్నాయి. గత ఐదు సెషన్స్‌లో ప్రైస్ యాక్షన్ టైట్‌గా సాగింది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ బాగున్నాయి. రూ.1,520/1,580 టార్గెట్‌తో మదుపరులు రూ.1,450 స్థాయిలో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు.

స్టాప్‌లాస్ : రూ.1,425ను

హెచ్‌సీఎల్ టెక్: జనవరి నుంచి దిద్దుబాటులో ఉన్న ఈ కంపెనీ షేర్లు ప్రస్తుతం కీలక స్థాయికి చేరాయి. 20, 50 రోజుల ఈఎంఏ వద్ద మద్దతు తీసుకుని అక్కడే చలిస్తున్నాయి. మూమెంటం సైతం బాగుంది. గత వారం రూ.1,648 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.1,690/1,729 టార్గెట్‌తో రూ.1,640 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు.

స్టాప్‌లాస్ : రూ.1,610

కోల్ ఇండియా: గత ఏడాదిగా పతనమవుతున్న ఈ కంపెనీ షేర్లు ఈ ఏడాది జనవరి నుంచి అక్యుములేషన్ దశకు చేరుకున్నాయి. గత వారం రూ.401 వద్ద ముగిశాయి. ప్రస్తుతం 20, 50 రోజుల ఈఎంఏ పై స్థాయిలో ట్రేడవుతున్నాయి. మూమెంటం కూడా బాగుంది. రూ.440/470 టార్గెట్‌తో మదుపరులు రూ.380/390 మధ్య ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు.

స్టాప్‌లాస్ : రూ.360



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

25,000 పైన నిలకడ తప్పనిసరి

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం తీవ్ర ఊగిసలాటల మధ్యన ట్రేడయి 24,850 వద్ద ముగిసింది. గత కొద్ది వారాలుగా 25,000 స్థాయిలో సైడ్‌వేస్, ఆటుపోట్ల ధోరణిలో ట్రేడవుతోంది. గత రెండు వారాలుగా 25,000 స్థాయిలో ఎన్నో రియాక్షన్లు సాధిస్తున్నప్పటికీ దిగువ స్థాయిల్లో పునరుజ్జీవం కూడా సాధిస్తోంది. ఇది పాజిటివ్ ట్రెండ్ సంకేతం. ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉంది. ఈ వారంలో మార్కెట్ అప్రమత్తంగా ప్రారంభమై కీలక మానసిక అవధి 25,000 స్థాయిలో పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: గత వారం మార్కెట్లో కదలికలు పరిమిత పరిధిలోనే ఉన్నాయి. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ మరింతగా కొనసాగించాలంటే ఈ వారంలో 25,000 కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఆ పైన మరో నిరోధం 25,250.

బేరిష్ స్థాయిలు: బలహీనతకు లోనైనా మైనర్ మద్దతు స్థాయి 24,700 వద్ద నిలదొక్కుకుని తీరాలి. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 24,500. గత వారం ఇక్కడే మద్దతు తీసుకున్నందువల్ల ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశించే ముప్పు ఏర్పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత ఐదు వారాలుగా కీలక స్థాయి 55,000 వద్ద సైడ్‌వేస్ ధోరణి ప్రదర్శించింది. అయితే గత వారం కేవలం 45 పాయింట్ల లాభంతో 55,400 వద్ద ముగిసింది. తదుపరి నిరోధం 55,700. ప్రధాన నిరోధం 56,100 (ఆల్‌టైమ్ గరిష్ఠం). ఆ పైన మాత్రమే మరింత అప్‌ట్రెండ్ ఉంటుంది. ప్రస్తుత మద్దతు స్థాయి 55,000 వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది.

పాటర్న్: గత రెండు వారాల్లో 25,000 స్థాయిలో డబుల్ టాప్ పాటర్న్ ఏర్పడడం సానుకూల సంకేతం. గత వారంలో మార్కెట్ 25 డీఎంఏ కన్నా పైన నిలదొక్కుకుంది. ప్రస్తుతం 25,000 స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు. అలాగే ఈ వారంలో స్వల్పకాలిక రివర్సల్‌కు కూడా ఆస్కారం ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24940, 25000
మద్దతు	24770, 24700

అందాల బొమ్మలు.. కన్నీటి చెమ్మలు!





(మొదటిపేజీ తరువాయి)

బాలికల పట్ల జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పనిచేస్తోంది. తెలిసీ తెలియని వయసులోనే లైంగిక వేధింపులు ఎదుర్కొంది ఓ బాలిక. కాస్త వయసు వచ్చేసరికి తమ దేశంలో ఇలాంటివి సర్వసాధారణంగా జరుగుతున్నాయనే విషయం ఆమెను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఇలాంటి వాటిని రూపుమాపాలనే లక్ష్యంతో ఒక సంస్థను ప్రారంభించి ప్రజలను చైతన్యం చేస్తోంది. పైన చెప్పిన అతివలు ఎవరో సామాన్య మహిళలు కాదు.. మిస్ వరల్డ్ కిరీటం కోసం పోటీ పడుతున్న సుందరీమణులు. ప్రస్తుతం అందాల పోటీల్లో మెరుస్తున్న అనేక మంది జీవితంలో ఈ స్థాయికి రావడానికి ఎన్నో కష్టాలు, వేధింపులను ఎదుర్కొన్నారు. అలాంటి కొంత మంది అతివలు తమ ఆవేదనాభరిత గాథలను విశ్వవేదికపై వినిపించారు.

రేపటిని మార్చగలం..

నిన్నటిని మార్చలేం. కానీ, ప్రయత్నిస్తే రేపటిని మార్చగలం. ఆ ప్రయత్నమే నేను చేస్తున్నాను. మాది సోమాలియా. కూడు, గూడు కోసం మా అమ్మానాన్నలు, నేను ఒంటెపై తిరుగుతూనే ఉండేవాళ్లం. మా దురదృష్టం, మేం ఎక్కడ ఉన్నా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించేవారు. అలా తిరుగుతూ చివరకు బ్రిటన్ వెళ్లి స్థిరపడ్డాం. అయినా, సోమాలియా అమ్మాయిగా ఆ దేశంలో బాలికల దుస్థితిని మార్చడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను. సోమాలియాతో పాటు ఆఫ్రికా, మధ్య ప్రాశ్చ దేశాల్లో ఫిమేల్ జెనిటల్ మ్యుటిలేషన్(ఎఫ్‌జీఎం)(ఆడవాళ్లకు సున్తీలాంటిది) ఓ దురాచారంగా కొనసాగుతోంది. సోమాలియాలో 98% మంది మహిళలకు ఇది జరిగింది. మిగిలిన వారికి ఎందుకు కాలేదంటే, వారింకా ఆ వయసుకు రాలేదంతే. ఆ బాధితుల్లో నేనూ ఒకరిని. చాలా మందికి ఈ ఎఫ్‌జీఎం అంటే ఏమిటో తెలియదు. అలాంటి వారికోసమే నా అనుభవం చెప్పాలనుకుంటున్నాను. అప్పుడు నాకు ఏడేళ్ల వయసు. నేను ఆరు బయట ఆడుకుంటుండగా ఓ గదిలోకి తీసుకువెళ్లి బట్టలన్నీ విప్పేశారు. అక్కడ ముగ్గురు ఆడవాళ్లు నా కోసమే బ్లేడ్లు, కత్తెరలతో వేచి చూస్తున్నారు. వారేమీ డాక్టర్లు కాదు. వైద్య పరంగా శిక్షణ కూడా తీసుకోలేదు. వారు నా జననేంద్రియంపై చర్మాన్ని పూర్తిగా తొలగించారు. లోపలి చర్మం కూడా కొంత తీసేశారు. అరుస్తూనే ఉన్నాను. పట్టించుకునే వారే లేరు. పైగా నోర్మూసుకో.. అయిపోయింది.. ధైర్యంగా ఉండు.. ఇది జరుగుతున్నందుకు గర్వపడు.. ఇది మన సంప్రదాయం.. అంటూ చెప్పారు. కోత పూర్తయిన తర్వాత మందపాటి దారంతో కుట్టేశారు. కేవలం, మూత్రం, రక్తం పోవడానికి ఓ సన్నటి ద్వారం మాత్రమే ఉంచారు. నన్ను ఓ చీకటి గదిలో కాళ్లు చేతులు కట్టేసి వదిలేశారు. ఏడుస్తూనే ఉన్నాను. నేను బతికిబయటపడ్డానంటే అది నా అదృష్టం. ఎందుకంటే, ఈ ప్రక్రియ తర్వాత చాలా మంది బాలికలు చనిపోతారు కూడా. మా అమ్మ, బామ్మ అందరూ ఈ ఎఫ్‌జీఎం చేయించుకున్న వారే. ఆడవారికి ఈ బాధలు తప్పవనే వారు చెప్పేది. ఇది సంప్రదాయం, పాటించాలనే చెబుతుంటారు. అదెలా..? మూఢాచారాలు ఇంకెంత కాలం. అందుకే నేను పోరాటాన్ని ప్రారంభించాను. పర్యవసానాలు ఎలా ఉంటాయో తెలుసు. అయినా ఫౌండేషన్‌ను ప్రారంభించాను. చిన్నారుల శరీరం, ఆత్మను దెబ్బతీసేలా సంప్రదాయాలు ఉండకూడదు. మహిళలకూ హక్కులుంటాయని, వారి శరీరంపై వారికి నియంత్రణ ఉండాలనే 'ఫిమేల్ ఇనీషియేటివ్ ఫౌండేషన్' ప్రారంభించాను. నేను పడిన బాధలు మరే బాలికా పడకూడదనే పోరాటం సాగిస్తున్నాను.

\- మిస్‌వరల్డ్ సోమాలియా, జైనాబ్ జామా

ఆదివాసీ ఆత్మ గౌరవ ప్రతీక..

నేను కెనడాలోని మారుమూల ప్రాంతంలో ఆదివాసీ తెగలో పుట్టాను. జనాభా మహా అయితే 600 ఉంటుంది. కెనడాలో మా తెగ అమ్మాయిలు, మహిళలు ఎదుర్కొనే కష్టాలు వర్ణనాతీతం. నేను దాదాపు 12సార్లు హత్య చేయబడి ఉండాలి. ఇప్పటికీ మా జాతి ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరీ ముఖ్యంగా రెసిడెన్షియల్ స్కూల్ వ్యవస్థ కారణంగా. మా ఇళ్ల నుంచి బలవంతంగా పిల్లలను తీసుకువెళ్లి ఈ స్కూల్స్‌లో చేర్పిస్తారు. మా భాష, సంస్కృతి అన్నింటినీ నాశనం చేస్తున్నారు. దాదాపు పదివేలకు పైగా మా జాతి ప్రజల సమాధులు ఈ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉండి ఉంటాయి. మా అంటీ, అంకుల్ సమాధులు కూడా దానిలో భాగం. ఇవన్నీ చూస్తూ పెరిగిన నాకు అమ్మే స్ఫూర్తి. మిస్ వరల్డ్ పోటీలకు రావడానికి కారణం కూడా ఓ మహోన్నత లక్ష్యం కోసమే. మా జాతి సాధికారతకు కృషి చేయడానికి ఇక్కడి వరకూ వచ్చా. 'రీ కనెక్టింగ్ విత్ రిబ్బన్స్' అంటూ ఓ ప్రాజెక్టును ప్రారంభించాను. ఒకవేళ మిస్ వరల్డ్ కిరీటం గెలిస్తే, అది ఓ చరిత్ర కావొచ్చు కానీ, ఇతరులు ఆ బాటలో నడిచేలా నేను మార్గం వేయలేకపోతే అది నిష్ఫలమేగా.

\- ఎమ్మా మారిసన్, మిస్ వరల్డ్ కెనడా

పదహారేళ్లప్పుడు రేప్‌కు గురయ్యాను..

నేను పుట్టి పెరిగిందంతా జాంబియాలోనే. యుక్తవయసుకు వచ్చాకే ఈ ప్రపంచం ఎలా ఉంటుందో తెలిసింది. నాకు 16 ఏళ్లు వచ్చేసరికి నాలోని స్వేచ్ఛను లాగేసుకున్నారు. పదహారేళ్లకే పెళ్లి చేశారు. పదహారేళ్లకే మానభంగానికీ గురయ్యాను. ఇన్నేళ్లుగా ఆ క్షోభను భరిస్తూనే గడిపేశాను. ఎందుకంటే, నాకు జరిగిన అన్యాయం గురించి మాట్లాడే శక్తి నాకు లేదు. ఈ రోజు ఆ శక్తిని పొందగలిగాను. అందుకే ఎనిమిదేళ్ల తర్వాత ఈ సంఘటన గురించి చెబుతున్నాను. ఎందుకంటే, నేను జాంబియాలో అభాగ్యుల ప్రతిబింబంగా భావిస్తున్నాను. వారి కలలు కూడా ఛిద్రమయ్యాయి. మన నుంచి ఏదైనా తీసుకోగలరమో కానీ, విద్య, నైపుణ్యాలను మాత్రం తీసుకువెళ్లలేరు. విద్యతోనే జ్ఞానం వస్తుంది. ఆ జ్ఞానం మనకు శక్తినిస్తుంది. ఆ శక్తే మనం కోరుకున్న సమాజానికి నాంది పలుకుతుంది. దానికోసమే నా తపనంతా.

\- మిస్ వరల్డ్ జాంబియా, ఫెయిత్ బ్వాల్యా

లైంగిక వేధింపులపై పోరాడుతున్నా..

మా దేశంలో పిల్లలపై లైంగిక వేధింపులు చాలా ఎక్కువగా జరుగుతున్నాయి. ఒక్క పనామాలో మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఈ ఘటనలు పెరుగుతున్నాయి. ఈ తరహా వేధింపులు నేనూ ఎదుర్కొన్నాను. వీటి పట్ల అవగాహన కల్పిస్తే ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చు. అందుకే ఫన్‌డియాంగ్ యునిడోస్ (యునైటెడ్ ఫర్ చిల్డ్రన్) ఫౌండేషన్ అధికార ప్రతినిధిగా ఈ అంశాల పట్ల అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నాను. నాకు తెలిసి మనలో చాలామంది ఏదో ఒక వయసులో లైంగిక వేధింపుల బారిన పడిన వారే. అది మనకు ఊహ తెలిసినప్పుడు కావచ్చు లేదంటే అంతకంటే ముందు కావచ్చు. అది ఎందుకు తెలియదంటే, నిశ్శబ్దం. దీని గురించి చర్చించడానికి ఎవరూ ఇష్టపడకపోవడం. ఆ నిశ్శబ్దాన్ని ఛేదించాల్సిన అవశ్యకత ఉంది. ఎందుకంటే, మన సమాజంలో అతిపెద్ద సమస్య ఈ లైంగిక వేధింపులు. ఈ తరహా వేధింపుల గురించి మాట్లాడటం కష్టమే, కానీ, ఎక్కడో ఓ చోట ముగింపు పలకాలంటే, మాట్లాడాల్సిందే.

\- మిస్‌వరల్డ్ పనామా, కరోల్ రోడ్రిగ్జ్

వివక్ష, వేధింపులపై పోరాడుతున్నా

సంగీతం మొదలు స్కేటింగ్, మోడలింగ్, మిలటరీ, టీచర్.. ఇప్పుడు మిస్ వరల్డ్ స్వీడన్.. ఎన్నో రంగాల్లో ప్రతిభ చాటాను. కానీ, ఓ అమ్మాయిగా నా జీవితం ఏమైనా మారిందా..? లేనే లేదు. అదే వివక్ష, వేధింపులు. 14 ఏళ్లప్పుడే నా కెరీర్ ప్రారంభమైంది. స్వీడిష్ ఫెడరేషన్ ఆఫ్ వాలెంటరీ డిఫెన్స్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్‌లో కెరీర్ ప్రారంభమైంది. మగవారితో పోలిస్తే 10 రెట్లు ఎక్కువగా నేను కష్టపడాలని వెంటనే అర్థమైంది. ఎందుకంటే అమ్మాయిని. అయితే అదంతా కూడా స్వీడిష్ నేవీతో కలిసి యూరప్ అంతటా తిరిగినంత వరకే. అప్పుడే పురుషాధిక్య సమాజంలో ఓ మహిళకు ఏం కావాలో అర్థమైంది. ఆ నౌకలో 36 మంది సిబ్బంది ఉంటే ముగ్గురమే మహిళలం. ఓ రోజు మా కమాండింగ్ ఆఫీసర్ నన్ను పక్కకు లాక్కెళ్లి బలవంతం చేయబోయాడు. అప్పుడు నా వయసు 17 ఏళ్లు. అప్పుడే అనుకున్నాను నేను కాకపోతే ఇంకెవరు మార్పు తీసుకువస్తారని. అప్పుడే స్వీడిష్ సాయుధ దళాలలో అధికారాన్ని ఎంతగా దుర్వినియోగం చేస్తున్నారో ఓ పరిశోధనా వ్యాసం రాశాను. అలాగే 'బూట్స్ టు హీల్స్' అంటూ నా కథనే ఓ పుస్తకంగానూ రాయబోతున్నాను. నా లాంటి అమ్మాయిల రక్షణ కోసమే స్వీయ రక్షణ తరగతులను ప్రారంభించాను. పురుషాధిక్య సమాజంలో మహిళలు తమను తాము రక్షించుకోవాలంటే, లింగ సమానత్వం కావాలంటే ఇది తప్పనిసరి.

\- మిస్ వరల్డ్ స్వీడన్, ఇసాబెల్ ఆస్

మిల్లా మాగీ ఆరోపణలు అబద్ధం: జయేష్ రంజన్

మిస్ వరల్డ్ పోటీలపై మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణల్లో ఒక్క శాతం కూడా నిజం లేదని తెలంగాణ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ స్పష్టం చేశారు. మిల్లా మాగీ పాల్గొన్న ప్రతి కార్యక్రమం వీడియోను తాను ప్రత్యక్షంగా వీక్షించానని, ఆమెతో ఎవరూ అసభ్యంగా ప్రవర్తించలేదని తెలిపారు. ఆదివారం ఆయన ప్రపంచ సుందరి పోటీదారులను కలసి మాట్లాడారు. చౌమహల్లా ప్యాలెస్‌లో జరిగిన డిన్నర్‌లో మిల్లా మాగీతో కలిసి టేబుల్ వద్ద కూర్చున్న మిస్ వేల్స్ మిల్లీ మే ఆడమ్స్‌తో రంజన్ మాట్లాడారు. హైదరాబాద్‌కు వచ్చిన తొలిరోజు నుంచి ప్రతీ క్షణాన్ని ఆస్వాదిస్తున్నానని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందీ అనిపించలేదని వేల్స్ చెప్పినట్టు తెలిసింది. ఆమె ఇంటర్వ్యూ ఇచ్చిన బ్రిటన్ పత్రికకు.. సంచలనం కోసం డబ్బులిచ్చి తప్పుడు ప్రకటనలు చేయించే చరిత్ర ఉందని ఆరోపించారు. ఈ విషయంలోనూ అదే జరిగి ఉండవచ్చన్నారు.



లలిత అలియాస్ సంగీత (ఫైల్), ములుగుందంలోని మావోయిస్టు లలిత అలియాస్ సంగీత ఇల్లు

అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో కర్నూలు మహిళ మృతి

- నర్సు ఉద్యోగం కోసం హైదరాబాద్‌కు..
- కేఎన్‌పీఎస్‌లో పనిచేస్తూ మావోయిస్టు ఉద్యమంలోకి

కర్నూలు/ఆస్పరి, మే 25(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్‌లో ఈనెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల్లో కర్నూలు జిల్లాకు చెందిన గోనెగండ్ల లలిత (45) అలియాస్ సంగీత కూడా ఉన్నారు. ఆమె మృతిపై సమాచారం రావడంతో కుటుంబసభ్యులు మృతదేహం కోసం ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లినట్లు తెలిసింది. ఆస్పరి మండలం ములుగుందం గ్రామానికి చెందిన గోనెగండ్ల దుబ్బన్న, ఎస్తేరమ్మ దంపతులకు కుమార్తె లలిత. స్వగ్రామంలోనే ఐదో తరగతి వరకు చదువుకున్న ఆమె.. నంద్యాల జిల్లా కోవెలకుంట్లలోని ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ పాఠశాలలో సీటు సాధించింది. అక్కడ 10వ తరగతి వరకు చదువుకొని, ఆ తర్వాత నంద్యాలలో నర్సింగ్ కోర్సు పూర్తిచేసింది. తర్వాత హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా ఉద్యోగంలో చేరినట్లు సమాచారం. ఉద్యోగం చేస్తూనే కేఎన్‌పీఎస్ చేపట్టే ఉద్యమాలు, ఆందోళనల్లో చురుగ్గా పాల్గొనేది. మావోయిస్టు పార్టీ పిలుపుతో దండకారణ్యంలో ఆదివాసీలకు నర్సుగా సేవలందించేందుకు అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు సమాచారం. 20 ఏళ్లకు పైగా మావోయిస్టు పార్టీలో పనిచేసి, నంబాల కేశవరావు బృందంలో ఉంటూ.. తాజాగా ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగింది. ఇదే ఎన్‌కౌంటర్‌లో కర్నూలు జిల్లాకు చెందిన 8 మంది చనిపోయారని సమాచారం.

కేశవరావు మృతదేహాన్ని తీసుకురానివ్వకుండా శ్రీకాకుళం ఎస్పీ అడ్డంకులు!

- సీఎం, హోంమంత్రికి పౌరహక్కుల సంఘం లేఖ

విజయవాడ, మే 25(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో గత వారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురానివ్వకుండా శ్రీకాకుళం జిల్లా ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి అడ్డుపడుతున్నారని పౌరహక్కుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.చిట్టిబాబు, చిలుకా చంద్రశేఖర్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనితకు లేఖ రాశారు.

'కగార్' ఆపి.. మావోయిస్టులతో చర్చించాలి

- సీపీఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానాలు

విజయవాడ (గాంధీనగర్), మే 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తక్షణమే 'ఆపరేషన్ కగార్‌ను నిలుపుదల చేసి, మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరపాలని ఆదివారం విజయవాడలో సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. మావోయిస్టు నేత కేశవరావుతో పాటు ఇతర మృతుల భౌతికకాయాలను వారి బంధువులకు అప్పగించాలని, బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని కూడా తీర్మానించారు. విజయవాడలో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్రం ఈ దమనకాండను ఆపాలని డిమాండ్ చేశారు.

పీఎస్ఆర్ పిలిస్తే వచ్చా!



(మొదటి పేజీ తరువాయి)

మధుసూదన్ కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పగా, పీఎస్ఆర్ మాత్రం అడిగిన ప్రశ్నలకు డొంక తిరుగుడు జవాబులు చెప్పారని తెలిసింది. పరీక్షా పత్రాల మూల్యాంకనం శాస్త్రీయ పద్ధతిలో చేయకుండా డిజిటల్‌గా ఎందుకు చేశారని పీఎస్ఆర్‌ను ప్రశ్నించారు. అప్పుడున్న పరిస్థితులను బట్టి ఆ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. డిజిటల్‌గా మూల్యాంకనం చేయాలనుకున్నప్పుడు టెండర్ ప్రక్రియను ఎందుకు పాటించలేదని ప్రశ్నించగా ఆయన మౌనం వహించారు. డిజిటల్ మూల్యాంకనానికి అనుభవం లేని కామ్‌సైన్ సంస్థను ఎంపిక చేయడంపై ప్రశ్నించగా, ఆ సంస్థకు అర్హతలు ఉన్నాయని పీఎస్ఆర్ చెప్పినట్టు సమాచారం. కామ్‌సైన్ సంస్థకు రూ.1.14 కోట్లు చెల్లించేలా చెక్కులపై సంతకాలు చేశారా అని అడిగితే ఆ విషయం గుర్తులేదని జవాబు ఇచ్చారు. ఏపీపీఎస్సీలో కాకుండా హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం ఎందుకు చేశారని ప్రశ్నిస్తే ఏపీపీఎస్సీ తీసుకున్న నిర్ణయాలను అమలు చేశానని వాదించినట్టు సమాచారం. పీఎస్ఆర్‌కు 25 ప్రశ్నలు, మధుసూదన్‌కు మరో 25 ప్రశ్నలు వేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. పీఎస్ఆర్‌ను గంటపాటు విచారించిన తర్వాత మధుసూదన్‌ను విచారించారు. పీఎస్ఆర్‌తో పరిచయం ఎలా ఏర్పడిందని మధుసూదన్‌ను ప్రశ్నించగా, ఆయనతో తనకు ఎలాంటి పరిచయం లేదని, పీఎస్ఆర్ పేషీ నుంచి ఫోన్‌కాల్ వచ్చిన తర్వాతే తాను హైదరాబాద్ నుంచి వచ్చి ఆయనను కలిసినట్టు చెప్పారు. సోమవారం వారిని మరికొన్ని ప్రశ్నలు అడగడానికి అధికారులు సిద్ధమయ్యారు. కాగా, డీజీ స్థాయి అధికారి అయిన పీఎస్ఆర్ ఆంజనేయులు ఇప్పటి వరకు పోలీసుస్టేషన్‌లో నిద్రపోయిన దాఖలాలు లేవు. ఒకవేళ ఏదైనా స్టేషన్‌లో తెల్లవార్లూ ఉన్నా అది విధి నిర్వహణలో భాగంగానే ఉన్నారు. ఇప్పుడు తొలిసారిగా ఒక నిందితుడిగా పోలీస్‌స్టేషన్‌లో గడిపారు. గ్రూపు-1 కేసులో ఆయనతో పాటు మధుసూదన్‌ను కస్టడీకి ఇస్తూ రెండోరోజు విచారణ పూర్తయిన తర్వాత వైద్య పరీక్షలు చేయించి హాజరుపరచాలని కోర్టు స్పష్టం చేసింది. కస్టడీ పూర్తయ్యే వరకు వారిని పోలీసుల వద్దే ఉంచుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో పీఎస్ఆర్ రోజంతా స్టేషన్‌లోనే ఉన్నారు.

ఏ రాష్ట్రాల్లో పేలుళ్లకు కుట్ర చేశారు?

- సిరాజ్, సమీర్‌లపై కొనసాగిన విచారణ

విజయనగరం, మే 25(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద సానుభూతిపరులు సిరాజ్ ఉర్ రెహ్మాన్, సయ్యద్ సమీర్‌లపై మూడో రోజు ఆదివారం విచారణ కొనసాగింది. ఎన్ఐఏ, యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్), స్థానిక పోలీసులు వారిని ప్రశ్నించారు. ఉగ్రవాద విదేశీ లింకులు, ఏయే రాష్ట్రాల్లో పేలుళ్లకు కుట్ర చేశారు? ఆర్థిక లావాదేవీలు, సహకారం అందించిన వారి వివరాల గురించి ప్రశ్నించినట్లు తెలిసింది. సోషల్ మీడియా ఖాతాలు, కాల్‌డేటా, ఇంటర్నెట్ కాల్స్‌పై ఆరా తీశారు. సౌదీ అరేబియా నుంచి వచ్చిన నిధులు ఏయే బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లాయనే విషయాలపై బ్యాంకు అధికారులతో కూడా చర్చించినట్లు తెలిసింది. అయితే విచారణలో సిరాజ్, సమీర్‌లు చాలా వరకు నోరు మెదపడం లేదని తెలుస్తోంది. అనేక ప్రశ్నలకు 'మాకు సంబంధం లేదు' అనే సమాధానమే చెబుతున్నట్లు తెలిసింది. ఆదివారం 10 గంటల పాటు ఇద్దరిని విచారించారు.

గ్రీస్‌లో ఐటీ ఉద్యోగావకాశాలు: నైపుణ్యాభివృద్ధి సంస్థ

అమరావతి, మే 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యువతకు ఇతర దేశాల్లో ఉద్యోగాలు కల్పించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈడీ మనోహర్ తెలిపారు. ఇందులో భాగంగా అనుభవం ఉన్న డాట్ నెట్, ఎంఎస్ ఎస్‌క్యూఎల్ డెవలపర్లను గ్రీస్‌లో ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నామన్నారు. ఎంపికైన వారికి రూ.25.2 లక్షల వార్షిక వేతనం లభిస్తుందన్నారు. అలాగే ఉచిత నివాసం, పబ్లిక్ ఇన్సూరెన్స్, సామాజిక భద్రత, కాంట్రాక్టు రెన్యువల్ ప్రయోజనాలు ఉంటాయన్నారు. డాట్ నెట్, ఎంఎస్ ఎస్‌క్యూఎల్‌లో కనీసం ఐదేళ్ల అనుభవం, మెరుగైన ఇంగ్లిష్ కమ్యూనికేషన్ నైపుణ్యం కలిగిన పురుషులు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు http://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 9988853335ను సంప్రదించాలన్నారు.

క్వార్ట్జ్ కేసులో కాకాణి అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

క్వార్ట్జ్ ఖనిజాన్ని ఆ పార్టీ నాయకులు విచ్చలవిడిగా కొల్లగొట్టారు. ఆ క్రమంలో మంత్రి హోదాలో కాకాణి కూడా తన నియోజకవర్గం పరిధిలోని పొదలకూరులో మైన్‌ను అక్రమించుకుని రూ.వందల కోట్ల ఖనిజాన్ని అక్రమంగా తరలించారని టీడీపీ నేతలు ఫిర్యాదులు చేశారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఉండడంతో పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సోమిరెడ్డి, టీడీపీ నాయకులు అప్పట్లో చేసిన ఫిర్యాదుల్లో కదలిక వచ్చింది. ఈ దోపిడీపై విచారణ జరిపిన అధికారులు సుమారు రూ.250 కోట్ల విలువైన క్వార్ట్జ్‌ను అక్రమంగా తరలించినట్లు గుర్తించారు. 10 మందిపై మార్చి 24న కేసు నమోదు చేశారు. కాకాణిని ఏ-4గా చేర్చారు.

విచారణకు డుమ్మా..

ఈ కేసులో విచారణకు హాజరు కావాలని మార్చి 25న నెల్లూరు పోలీసులు కాకాణికి నోటీసులు ఇచ్చారు. అయితే అప్పటికే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. నెల్లూరు నివాసంలో ఎవరూ లేకపోవడంతో పోలీసులు ఇంటి గోడకు నోటీసులు అంటించి వచ్చారు. అనంతరం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి కూడా వెళ్లారు. అక్కడ కూడా ఎవరూ లేకపోవడంతో రెండో నోటీసును కూడా గేటుకు అంటించి వెనుతిరిగారు. ఇదే సమయంలో ఆయన కోసం పోలీసులు ఆయన బంధువుల ఇళ్లవద్దకు వెళ్లారు. ఎక్కడా కనిపించకపోవడంతో మూడో నోటీసును మళ్లీ ఆయన ఇంటి గోడకు అతికించి వచ్చారు. కాకాణి పరారీలో ఉన్నారని నిర్ధారణకు వచ్చిన తర్వాత ఎయిర్‌పోర్టులకు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. కాకాణిని పట్టుకోవడం కోసం నాలుగు ప్రత్యేక బృందాలను నియమించారు.

బెయిల్ కోసం శత విధాలా ప్రయత్నం

ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం కాకాణి శత విధాలా ప్రయత్నించారు. హైకోర్టు బెయిల్ పిటిషన్ తిరస్కరించడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే తనపై ఉన్న కేసులను ఆయన దాచిపెట్టడంపై సర్వోన్నత న్యాయస్థానం మండిపడింది. ఈ నెల 16న బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేయడంతో పాటు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీంతో న్యాయపరంగా కాకాణికి ఉన్న అన్నిదారులు మూసుకుపోయాయి. పోలీసులు గాలింపు చర్యలను మరింత ఉధృతం చేశారు. 2 నెలల పాటు కాకాణి ఎక్కడెక్కడో తిరుగుతున్నా పోలీసులు గుర్తించలేని విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకున్నట్లు సమాచారం. ఫోన్‌లో మాట్లాడినా ఎక్కడ నుంచి మాట్లాడుతున్నాడో లొకేషన్ తెలియకుండా విపిన్ యాప్, కంప్యూటర్‌లో డ్యాంగిల్‌ను కాకాణి ఉపయోగించడంతో ఆయన లొకేషన్ గుర్తించడం కష్టతరమైందని పోలీసు వర్గాల తెలిపాయి. ఎట్టకేలకు ఆదివారం సాయంత్రం కాకాణిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆదివారం రాత్రి నుంచే నగరంలోని ఆయన నివాసం, వైసీపీ జిల్లా, నగర కార్యాలయాల వద్ద పటిష్ఠ నిఘా ఉంచారు. సోమవారం ఆయన్ను జిల్లాకు తీసుకొస్తారన్న సమాచారం రావడంతో నగరంలోని ప్రధాన కూడళ్లతో పాటు కోర్టు ప్రాంగణాన్ని పోలీసులు తమ అదుపులోకి తీసుకోనున్నట్లు సమాచారం.

కాకాణికి కష్టకాలమే..

కాకాణి మెడకు ఉచ్చు బిగుసుకున్నట్లు తెలుస్తోంది. క్వార్ట్జ్ తవ్వకాలు జరిపే క్రమంలో క్వారీ కింద కాపురం ఉంటున్న పల్లెలను ఖాళీ చేయించడం, ఆ సందర్భంగా ఎస్టీలను భయభ్రాంతులకు గురిచేశారన్న అభియోగాలతో ఆయనపై అట్రాసిటీ కేసు నమోదైంది. సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి రూ.కోట్ల విలువైన గ్రావెల్ కొల్లగొట్టే క్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేసి పర్మిట్లు పొందారు. ఈ కేసులో కూడా కాకాణి నిందితుడిగా ఉన్నారు. ప్రస్తుతం ఈ కేసును సిట్ దర్యాప్తు చేస్తోంది. ఇది కూడా ఆయన మెడకు గుదిబండగా మారుతుందేమోనని వైసీపీ వర్గాలు అంటున్నాయి.

టీచర్ల బదిలీల్లో ఎడిట్ ఆప్షన్

అమరావతి, మే 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో సవరణలకు ఆన్‌లైన్‌లో ఎడిట్ అవకాశం కల్పించారు. సాంకేతిక సమస్యలను అధిగమించేందుకు ఎంఈవోల లాగిన్‌లో మార్పులకు అవకాశం ఇచ్చారు. మార్పుల అనంతరం ఎంఈవో లాగిన్‌లో ఆమోదం తెలిపితే దరఖాస్తులు డీఈవో లాగిన్‌కు వెళ్తాయి. ఆ తర్వాత తాత్కాలిక సీనియారిటీ జాబితా విడుదల చేస్తారు. అలాగే ప్రస్తుత స్టేషన్‌లో ఎంతకాలం పనిచేసినా గరిష్ఠంగా ఎనిమిదేళ్లకు మాత్రమే బదిలీ పాయింట్లు ఇస్తారు. ఉమ్మడి జిల్లాల ప్రామాణికంగానే ఉపాధ్యాయ సంఘాల నాయకులకు ప్రత్యేక పాయింట్లు ఇస్తారు.

ఒక వజ్రం.. 30 లక్షలు

మద్దికెర/తుగ్గలి, మే 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని పలు గ్రామాల్లో ఖాళీ భూముల్లో వజ్రాల వేట జోరుగా సాగుతోంది. ఈ వేటలో మూడు వజ్రాలు లభ్యమైనట్లు సమాచారం. మద్దికెర మండలంలోని పెరవలిలో అదే గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీకి వజ్రం దొరకగా రూ.1.5 లక్షలకు, ఇతర ప్రాంతం నుంచి ఓ వ్యక్తికి దొరికిన వజ్రాన్ని రూ.30 లక్షలకు వ్యాపారులు కొనుగోలు చేసినట్లు సమాచారం. తుగ్గలి మండలంలోని జొన్నగిరిలో ఓ వ్యవసాయ కూలీకి వజ్రం దొరకగా.. రూ.1.3 లక్షలకు అమ్మినట్లు తెలిసింది. మద్దికెర, తుగ్గలి మండలాల్లో వజ్రాలు దొరుకుతున్నాయని చుట్టుపక్కల ప్రాంతాల వారే కాకుండా అనంతపురం, బళ్లారి, నంద్యాల, గుంటూరు, కర్నూలు, విజయవాడ తదితర సూదూర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. ఇలా సుదూర ప్రాంతా ల నుంచి వచ్చే వారికి వ్యాపారులు వసతి కూడా కల్పిస్తున్నారు.

అబద్ధాల కసిరెడ్డి!

- పోలీసు విచారణలో చెప్పిందంతా తప్పే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో జరిగిన మూడున్నర వేల కోట్ల మద్యం కుంభకోణంలో అధికారులు, వ్యాపారులు, వైసీపీ నేతలు, గత ప్రభుత్వ పెద్దలు భాగస్వాములు. నాలుగు నెలలకు పైగా దర్యాప్తు చేసిన సిట్ 33 మంది నిందితులను గుర్తించింది. నోటీసులు, విచారణలు, అవసరం మేరకు సోదాలు, ఆ తర్వాత అరెస్టులు.. జరిగిపోయాయి. విచారణలో నిందితులు చెప్పిన సమాధానాలు ఎంత వరకు నిజం? అందులో అబద్ధాలు ఉన్నాయా? అన్నదానిపై సిట్ అధికారులు ఇప్పుడు క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తున్నారు. ఓ వైపు ఫోరెన్సిక్ ఆధారాలు తీసుకున్న సిట్ అధికారులు.. మరోవైపు ఈ కుంభకోణంపై పూర్తి అవగాహన ఉన్న నిందితుల్ని పిలిపించి మరోమారు స్క్రూటినీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఏ3గా ఉన్న ఎక్సైజ్ అధికారి సత్యప్రసాద్‌ను రెండు రోజులుగా ప్రశ్నించినట్టు సమాచారం. ఈ క్రమంలో ఏ1 కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి చెప్పినదాంట్లో చాలా వరకు అబద్ధాలు ఉన్నట్టు బయటపడింది. అలాగే సజ్జల శ్రీధర్ రెడ్డి (ఏ6) తప్పించుకునే ధోరణిలో సమాధానాలు ఇచ్చారు. విజయసాయిరెడ్డి, చాణక్య, దిలీప్ దాదాపు వాస్తవాలు వెల్లడించగా, ఎంపీ మిథున్ రెడ్డి చెప్పిన వాటిలో ఎక్కువగా తప్పుదోవ పట్టించేలా ఉన్నట్లు తెలిసింది.

మళ్లీ కస్టడీలోకి కసిరెడ్డి!

మద్యం స్కామ్ ప్రణాళికలో తాడేపల్లి ప్యాలెస్‌తో పాటు నాటి ముఖ్యమంత్రి జగన్ ఐటీ సలహాదారు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి(ఏ1), వైసీపీలో అప్పట్లో రెండో స్థానంలో ఉన్న విజయ సాయిరెడ్డి(ఏ5), రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి(ఏ4), సజ్జల శ్రీధర్ రెడ్డి(ఏ6) తదితరులు కీలక భూమిక పోషించారు. ప్రభుత్వమే షాపులు పెట్టి మద్యం విక్రయించాలనే పాలసీని రూపొందించడం నుంచి ముడుపులు ఇచ్చిన వ్యాపారులకే సరుకు ఆర్డర్లు ఇవ్వాలనే వరకూ ప్రతిదీ ప్లాన్ చేయడంలో ఈ బ్యాచ్‌కు ఎక్సైజ్ అధికారి డి.వి.సత్యప్రసాద్ బాగా ఉపయోగపడ్డారు. కడప జిల్లాకు చెందిన ఆయనకు అబ్కారీ శాఖలో లూప్‌హోల్స్ బాగా తెలుసు. సీఐడీ అధికారులు మొదట్లో సత్యప్రసాద్‌తో పాటు ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి(ఏ2)ని కూడా పిలిచి విచారించారు. మద్యం కుంభకోణంలో బీజాల నుంచి ఫలాల వరకూ ప్రతిదీ పూసగుచ్చినట్లు వివరించారు. అంతిమంగా వైసీపీ పెద్దలు మూడున్నర వేల కోట్ల రూపాయల వరకూ ముడుపుల రూపంలో స్వాహా చేసినట్లు వెల్లడించారు. అంతా వీడియో రికార్డు చేసుకున్న సిట్ అధికారులు ఏసీబీ కోర్టులో న్యాయమూర్తి ముందు మరోమారు రికార్డు చేయించారు. చట్టపరంగా ఎవరూ తప్పించుకోకుండా ఉండేందుకు దర్యాప్తు అధికారులు చేసిన ఈ పని ఇప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు పుట్టించింది. మాజీ ముఖ్యమంత్రి రెండు గంటలకు పైగా ప్రెస్‌మీట్ పెట్టే పరిస్థితి తీసుకువచ్చింది. ఆయన చెప్పిన అబద్ధాలు చూసి విస్తుపోయిన సిట్ అధికారులు ఈ కేసులో నిందితుల్ని మరోమారు ప్రశ్నించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకూ అరెస్టైన ఏడుగురిలో నలుగురు వాంగ్మూలాలు ఇచ్చారు. అందులో ఏ1 రాజ్ కసిరెడ్డి చెప్పిన వాటిలో ఎక్కువగా అబద్ధాలు ఉన్నట్లు అధికారులు సందేహించారు. మరోమారు క్రాస్ చెక్ చేసుకునే ప్రయత్నంలో భాగంగా ఏ3 సత్యప్రసాద్‌ను విజయవాడలోని సిట్ కార్యాలయానికి పిలిపించి ప్రశ్నించినట్లు సమాచారం. ఆయన చెప్పినవన్నీ అండర్‌లైన్ చేసుకున్న సిట్ అధికారులు మరో మూడు రోజుల పాటు రాజ్ కసిరెడ్డిని కస్టడీకి తీసుకుని విచారించేందుకు సిద్ధమయ్యారు.

ముందే శిక్షణ

నేరాలు చేసే కేడీలు పోలీసుల నుంచి ఎలా తప్పించుకోవాలి? పట్టుబడినా అబద్ధాలు ఎలా చెప్పాలి? అనే వాటిపై ముందుగానే మానసికంగా సిద్ధమవుతారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన వారు మరింత తెలివిగా ఉంటారు. ముందుగానే రిటైర్డ్ పోలీసు అధికారులు, న్యాయవాదులతో ట్రైనింగ్ తీసుకుంటారు. విచారణలో దర్యాప్తు అధికారులు ఏమేమి అడుగుతారు? సమాధానాలు ఎలా చెప్పాలి? కోర్టులో ఏం చెప్పాలి? అనే వాటిపై పూర్తి కసరత్తు చేస్తారు. ఇక ప్రభుత్వ పెద్దలు, అధికారులతో కలిసి ఇలాంటి కుంభకోణాలకు పాల్పడేవారు మరింత ముదుర్లుగా తయారవుతారు. 11 సీబీఐ కేసులు, ఆరు ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న జగన్ రెడ్డి కేసులు వాదిస్తున్న న్యాయవాదులు, వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలకు సహకరించిన ఖాకీలు హైదరాబాద్‌లో లిక్కర్ నిందితులకు శిక్షణ ఇచ్చారు. తదనుగుణంగానే సిట్ అధికారులు ప్రశ్నించినప్పుడు అబద్ధాలు చెప్పినట్లు తెలిసింది. విజయసాయిరెడ్డి, చాణక్య, దిలీప్ సరైన శిక్షణ తీసుకోలేదేమో దాదాపు వాస్తవాలు వెల్లడించారు.

ఆ ముగ్గురితో నిజాలు కక్కిస్తే..

మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుకు ఒక అడుగు ముందున్న నిందితులు ముగ్గురు. వారే.. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, మాజీ సీఎం జగన్ ఓఎస్‌డీ కృష్ణమోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప. మద్యం సేవించే పేదల నుంచి షాపులకు.. అక్కడి నుంచి బేవరేజెస్ కార్పొరేషన్‌కు.. మూడో దశలో మద్యం వ్యాపారులకు చేరిన సొమ్ము.. నాలుగో దశలో క్యాష్ హ్యాండ్లర్స్ ద్వారా ముడుపుల రూపంలో రాజ్ కసిరెడ్డికి చేరింది. ఆ తర్వాత ఐదో దశలో ఈ ముగ్గురికీ చేరినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఇక అంతిమ లబ్ధిదారుకు చేరిన వైనాన్ని ఛేదించబోతున్నారు. ఆధారాలతో సహా వెలికి తీయడమే ఈ కేసు విచారణలో కీలకం. అందుకు సిట్ అధికారులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తోడైంది. అసలు దోపిడీదారుకు ఉచ్చు బిగుస్తున్నారు. ఐదేళ్ల పాటు తాడేపల్లి ప్యాలెస్‌లో చక్రం తిప్పిన ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డితో పాటు బాలాజీ గోవిందప్పతో నిజాలు కక్కిస్తే కేసు ఓ కొలిక్కి చేరుకుంటుంది.

పార్టీ మీ జాగీరా...

- అక్కకు హక్కులు లేవా?.. కేసీఆర్ కుమార్తె కవితకు మద్దతుగా.. సోషల్ మీడియాలో అత్యంత సన్నిహితుల పోస్టులు



హైదరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు.. ఆయన కుమార్తె కవిత రాసిన లేఖ వ్యవహారం, కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయన్న ఆమె వ్యాఖ్యలు ఆ పార్టీలో రోజురోజుకూ మరింత చర్చనీయాంశంగా మారుతున్నాయి. కవితకు మద్దతుగా వాట్సాప్, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని పోస్టులు ఆమెకు వ్యతిరేకంగా కూడా వస్తున్నాయి. అయితే ఆదివారం.. కవితకు అత్యంత సన్నిహితంగా ఉండే ఒకరు పెట్టిన పోస్టు బీఆర్ఎస్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ ఆ పోస్టు ఉంది. పార్టీ అంతర్గత విషయాలు అంతర్గతంగానే మాట్లాడాలన్న కేటీఆర్.. పార్టీకి వ్యతిరేకంగా బహిర్గతంగా మాట్లాడిందెవరో చెప్పాలని అందులో పేర్కొన్నారు. కవిత రాసిన లేఖను ఎవరు బహిర్గతం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పెద్దవారిపై జరుగుతున్న కుట్రలపైనే స్పందించకపోతే సామాన్య కార్యకర్తల పరిస్థితేంటని నిలదీశారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మీకు ఎలాంటి బాధ్యతలు లేవా? అని ఆ పోస్టులో ప్రశ్నించారు. పార్టీలో కుట్రలు చేసేవారిని, అంతర్గత విషయాలను బహిర్గతం చేసేవారిని వదిలి.. లేఖ రాసిన వారిని, కుట్రలు ఎదుర్కొంటున్న వారిని అనడంలో కేటీఆర్ ఉద్దేశమేంటో చెప్పాలన్నారు. "పార్టీ ఏమైనా మీ జాగీరా? గుత్త పట్టారా? అక్కకు హక్కులు లేవా?" అని నిలదీశారు. ఈ పోస్టును ఉద్యమకారులు, కవితకు అత్యంత సన్నిహితులైన వారందరికీ పంపించారు. కాగా.. తాను రాసిన లేఖపై కవిత స్పష్టత ఇచ్చి రెండు రోజులైనా.. ఈ అంశంపై కేసీఆర్ ఇంతవరకు స్పందించలేదు. కవితకు తండ్రి వద్ద నుంచి పిలుపు కూడా రాలేదు. దీంతో ఈ పరిణామాలు ఎటువైపునకు దారి తీస్తాయోనని గులాబీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.

ఎవరూ స్పందించొద్దు!

- కవిత వ్యవహారంపై కేటీఆర్‌కు కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్/సంగారెడ్డి, మే 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ కవిత వ్యవహారం రాష్ట్రంలో రాజకీయ దుమారం రేపుతుండగా.. ఈ అంశంపై పార్టీ నేతలెవరూ స్పందించవద్దని అధినేత కేసీఆర్ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు సూచించినట్లు తెలిసింది. పార్టీలో వ్యక్తమవుతున్న భిన్నాభిప్రాయాలపై.. అంతర్గత విభేదాలంటూ ప్రచారం జరుగుతోందని, దీనిపై తొందరపడి స్పందించాల్సిన అవసరంలేదని అన్నట్లు సమాచారం. కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ, తదనంతర పరిణామాలపై మూడు రోజులుగా చర్చ జరుగుతున్నా మౌనంగా ఉన్న కేసీఆర్.. ఆదివారం తన కుమారుడు కేటీఆర్‌ను ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు పిలిపించుకున్నారు. మధ్యాహ్నం 2గంటలకు ఫామ్‌హౌస్‌కు చేరుకున్న కేటీఆర్.. నేరుగా పై అంతస్తులో కేసీఆర్ ఉన్న గదికి వెళ్లినట్లు తెలిసింది. వీరి మధ్య దాదాపు 3గంటలపాటు సుదీర్ఘ చర్చ జరిగింది. ప్రధానంగా కవిత వ్యవహారంపైనే చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

కొత్తింట్లోకి చంద్రబాబు




కుప్పం నియోజకవర్గంలోని శివపురంలో నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పూజలు చేస్తున్న సీఎం చంద్రబాబు కుటుంబం, కొత్త ఇంట్లో పాలు పొంగిస్తున్న నారా బ్రాహ్మణి

కుప్పంలో వేడుకగా గృహప్రవేశం

- నియోజకవర్గ ప్రజలే ముఖ్య అతిథులు
- తొలి రోజు నూతన గృహంలోనే ముఖ్యమంత్రి బస

కుప్పం, మే 25(ఆంధ్రజ్యోతి): మూడున్నర దశాబ్దాలుగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ ఇంటివారయ్యారు. శాంతిపురం మండలం శివపురంలో నూతనంగా ఇల్లు నిర్మించుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, ఆయన తనయుడు లోకేశ్, బ్రాహ్మణి దంపతులు నూతన గృహప్రవేశం చేశారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ ఆహ్వానం అందడంతో పెద్దఎత్తున ప్రజలు, టీడీపీ కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. చంద్రబాబు కుటుంబం రాత్రి ఆ ఇంట్లోనే బస చేసింది. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు అమరనాథ రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, గురజాల జగన్మోహన్, మురళీమోహన్ తదితరులు సీఎం దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు



సతీమణికి తిలకం దిద్దుతున్న సీఎం

పెద్దఎత్తున సీఎం దంపతుల్ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గృహ ప్రవేశ కార్యక్రమం పూర్తయ్యాక.. కడ (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ), కుప్పం టీడీపీ సమన్వయ కమిటీ సమావేశాల్లో సీఎం పాల్గొన్నారు.

అందరినీ వరుసలో పంపుతూ..

గృహ ప్రవేశ అనంతరం ఇంటి గుమ్మం బయట చంద్రబాబును అక్కడున్నవారు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారంతా వరుసలో వస్తుండగా.. తండ్రికి ఎదురుగా మంత్రి లోకేశ్ ఉండి.. ఫొటోలు తీసుకునే వారు క్యూలో రావాలని, తీసుకున్న వారు వెంటనే వెళ్లిపోవాలని చెబుతూ వచ్చారు. చంద్రబాబుతో ఫొటోలు తీసుకున్న తర్వాత లోకేశ్ వద్దకు ఫొటోల కోసం వెళ్తే ఆయన సున్నితంగా తిరస్కరించారు. 'నాన్నతో తీసుకుంటే చాలు, నాతో తర్వాత తీసుకోవచ్చు' అని చెప్పారు. ఆ తర్వాత ఆయన అభిమానుల కోసం ప్రత్యేకంగా సెల్ఫీలు తీసుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు.

36 ఏళ్ల తర్వాత సొంతిల్లు

నూతన గృహ ప్రవేశం సందర్భంగా నారా లోకేశ్, బ్రాహ్మణి సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, సమాచారాన్ని పంచుకున్నారు. '36 ఏళ్లుగా మా కుటుంబానికి అండగా నిలుస్తూ, ప్రతి అడుగులోనూ తోడుగా ఉన్న కుప్పం ప్రజల సమక్షంలో నేడు మా సొంతిటి గృహ ప్రవేశం జరిగింది. మీరు చూపించే ప్రేమ, ఆత్మీయతలు మరువలేని అనుభూతిగా మిగిలిపోతుంది. ఇది మా కుటుంబ పండుగ కాదు, మనందరి పండుగ. మీ ఆశీస్సులు ఎల్లప్పుడూ మాకు దీవెనగా నిలుస్తాయి. మీ అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు' అని లోకేశ్ పోస్ట్ పెట్టారు. 'కుప్పం గృహ ప్రవేశానికి నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు వచ్చి తమ సొంతింటి పండుగలా పాల్గొనడం చాలా సంతోషాన్నిచ్చింది. ఇంత మంది ఆత్మీయుల ఆశీర్వాదం అందుకోవడం నిజంగా అదృష్టం. వారి అభిమానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని నారా బ్రాహ్మణి పోస్ట్ చేశారు.

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్!

(మొదటి పేజీ తరువాయి)

ఒంటిచేత్తో నిర్వహించేవారు. రాష్ట్ర విభజన జరిగి 2014లో అధికారంలోకి వచ్చాక ఆయన రాష్ట్ర పునర్నిర్మాణ కార్యక్రమంల్లో తలమునకలైపోయారు. ఇటు రాజధాని అమరావతి, అటు పోలవరం, పెట్టుబడుల ఆకర్షణ, ప్రాజెక్టుల నిర్మాణాల వంటి కీలక పనుల్లో మునిగిపోయారు. చంద్రబాబు దృష్టి అంతా ప్రభుత్వంపైనే కేంద్రీకృతం కావడంతో పార్టీలో ఏం జరుగుతోందో నిశితంగా పరిశీలించే అవకాశం ఆయనకు లేకుండా పోయింది. అచ్చం ప్రభుత్వంపైనే దృష్టి పెడితే పార్టీ దెబ్బతింటుందని, పార్టీ కార్యకలాపాలకు కూడా నిర్ణీత సమయం కేటాయించాలని సన్నిహితులు పదే పదే చెప్పినా.. ఆయన సమయాన్ని కేటాయించలేకపోయారు. ఫలితంగా 2019 ఎన్నికల్లో పార్టీకి అనూహ్యమైన దెబ్బతగిలింది. 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీకి కచ్చితంగా సమయం కేటాయిస్తామని ఆయన చెబుతూ వచ్చారు. అందుకు తగ్గట్లుగా ప్రతి శనివారం పార్టీ కార్యాలయానికి వెళ్లి నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించేవారు. కానీ ఇప్పుడు అది కూడా సాధ్యం కావడం లేదు. జగన్ హయాంలో శిథిలమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు ఆయన నడుం బిగించారు. దేశ విదేశాల నుంచి నిధుల సమీకరణ, అభివృద్ధి ప్రాజెక్టులు, పథకాల రూపకల్పనలో క్షణం తీరిక లేకుండా ఉన్నారు. తరచూ ఢిల్లీ వెళ్లాల్సి రావడం, స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ రూపకల్పన, అమలు, పీ-4 సిద్ధాంతంపై చర్చోపచర్చలు, క్వాంటమ్ వ్యాలీ రూపకల్పన.. ఇలా ఒకదాని వెంట ఒకటి వచ్చి పడుతుండటంతో ఆయన వివిధ శాఖలపై సమీక్షలు కూడా తగ్గించి అచ్చంగా వీటిపైనే దృష్టి పెట్టారు. దీంతో పార్టీకి, ఆయనకు మధ్య మళ్లీ దూరం పెరుగుతోంది. అధికారంలోకి వచ్చామన్న ఒక భరోసాతో కొన్ని జిల్లాల్లో పార్టీ నేతలు బరితెగించి వ్యవహరిస్తున్నారు. పార్టీకి చెడ్డపేరు తెచ్చే వాళ్లూ లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో పార్టీ మీద దృష్టి పెట్టకపోతే 2014-2019 అనుభవాలు పునరావృతమవుతాయని సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అయితే శిథిలమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించాలంటే మహా యజ్ఞమే అవుతోంది. ప్రభుత్వ కార్యకలాపాలు, పార్టీ వ్యవహారాలు కలిపి నిర్వహించడం అసాధ్యమవుతున్నందున టీడీపీ కేడర్ నుంచి సరికొత్త ప్రతిపాదన వస్తోంది. జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న లోకేశ్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్ చేయాలని జిల్లాల నుంచి వస్తున్న డిమాండ్. కడప మహానాడుకు సన్నాహకంగా జిల్లాల్లో మినీ మహానాడులు నిర్వహిస్తున్నారు. ప్రతి జిల్లా నుంచీ ఇదే రకమైన డిమాండ్ వినిపిస్తోంది.

అలా చేస్తే తిరుగుండదు!

మొత్తంగా పార్టీ వ్యవహారాలను చంద్రబాబు పర్యవేక్షిస్తున్నప్పటికీ.. క్రియాశీల వ్యవహారాలన్నీ లోకేశ్‌కు అప్పగిస్తే పార్టీ పటిష్ఠంగా ఉంటుందని.. వైసీపీ నేతల అరాచకాలను సమర్థంగా ఎదుర్కొంటూ పార్టీని నిలబెట్టుకోవచ్చని తెలుగుదేశం నేతలు చెబుతున్నారు. లోకేశ్ కూడా గత కొంతకాలంగా కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా, నేనున్నానంటూ ముందుకొస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయనకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి అప్పగించి పార్టీపై మరింత దృష్టి సారిస్తే.. భవిష్యత్‌లో తెలుగుదేశానికి తిరుగుండదంటూ అన్ని మినీ మహానాడుల్లోనూ ప్రతిపాదించారు. పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నింపడం ఆయనకే సాధ్యమవుతుందని.. నాయకత్వం దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు. కడపలో మూడ్రోజులపాటు జరిగే మహానాడు ఈ అంశంపై లోతుగా చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశాలు కనబడుతున్నాయి.

రేపటి నుంచే మహానాడు

- సీమ నడిబొడ్డున.. తొలిసారి కడపలో నిర్వహణ
- పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసిన టీడీపీ శ్రేణులు
- ప్రతినిధుల నమోదుతో పసుపు పండగ ప్రారంభం
- చరిత్రాత్మక నిర్ణయాలకు వేదిక కానున్న కార్యక్రమం
- తొలి రెండురోజులు వివిధ అంశాలపై చర్చలు.. తీర్మానాలు
- మంత్రి లోకేశ్ ప్రతిపాదించిన ఆరు సూత్రాలపై చర్చ
- కార్యకర్తలకు ప్రాధాన్యం కల్పించడంపై కీలక నిర్ణయం
- 29న మధ్యాహ్నం 2గంటలకు 5లక్షల మందితో భారీ సభ
- ఐదువేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు

అమరావతి, మే 25(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల నడిబొడ్డున కడప వేదికగా తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహణకు సర్వం సిద్ధమైంది. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమం... కార్యకర్తలకు పెద్దపీట వేయడంతో పాటు పలు చరిత్రాత్మక నిర్ణయాలకు వేదికగా నిలవనుంది. తొలిరోజు 27న పార్టీ ప్రతినిధుల సభ, సంస్థాగత నిర్మాణం, భవిష్యత్తు కార్యాచరణతో పాటు టీడీపీ మౌలిక సిద్ధాంతాలు, మంత్రి లోకేశ్ ప్రతిపాదించిన 6 సూత్రాల ఆవిష్కరణ, పార్టీ నియామవళిలో సవరణలపై ప్రధాన చర్చ జరగనుంది. అలాగే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు ప్రతినిధుల నమోదుతో పసుపు పండగ ప్రారంభమవుతుంది. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్, రక్తదాన శిబిరాలు ప్రారంభించనున్నారు. ఉదయం 10.45 గంటలకు పార్టీ జాతీయ అధ్యక్షులు, పొలిట్‌బ్యూరో సభ్యులు, ఇతర ముఖ్య నాయకులు వేదికపైకి చేరుకుంటారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేసి, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తారు. అనంతరం 'మా తెలుగు తల్లికి' గీతాలాపనతో మహానాడు లాంఛనంగా ప్రారంభమవుతుంది. ఆ తర్వాత పార్టీ కోసం పనిచేసి మృతిచెందిన కార్యకర్తలు, నేతలకు సంతాపం తెలియజేస్తారు. తర్వాత ప్రధాన కార్యదర్శి నివేదిక సమర్పిస్తారు. 11.30 గంటలకు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్వాగతోపన్యాసం చేస్తారు. కోశాధికారి పార్టీ జమాఖర్చుల నివేదిక సమర్పిస్తారు. 11.50 గంటలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభోపన్యాసం చేస్తారు. అనంతరం టీడీపీ మౌలిక సిద్ధాంతాలపై చర్చించనున్నారు. స్వర్ణాంధ్ర సాధన, పార్టీ నిర్వహణ, మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ రూపొందించిన 6 సూత్రాల ఆవిష్కరణ, పార్టీ నియమావళిలో సవరణలపై ప్రధానంగా చర్చ జరుగుతుంది. మండల స్థాయిలో మూడు విడతలు ఒకే పదవి చేసిన వారిని అంతకన్నా పెద్ద పదవికి పంపాలన్న నిర్ణయంతో పాటు పలు కీలక అంశాలపై చర్చ జరగనుంది. భోజన విరామం తర్వాత ఆరు సూత్రాల్లో మొదటిదైన 'కార్యకర్తే అధినేత' , రెండోదైన 'యువగళం'లో అంశంపై చర్చ జరుగుతుంది. మై టీడీపీ యాప్‌తో పాటు కార్యకర్తల సంక్షేమం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా చర్చిస్తారు.



మహానాడు వేదికను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే మాధవి, దేవినేని ఉమా, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి తదితరులు

రెండోరోజు కార్యక్రమాలు...

రెండో రోజు బుధవారం ప్రతినిధుల సభతో పాటు పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళి అర్పించనున్నారు. అనంతరం ఆరు సూత్రాల్లో మూడోదైన 'తెలుగుజాతి- విశ్వఖ్యాతి', నాలుగోదైన 'స్త్రీ శక్తి', ఐదో అంశం 'సామాజిక న్యాయం - పేదల ప్రగతి', చివరిదైన 'అన్నదాతకు అండ'గాపై చర్చించి, తీర్మానాలు చేస్తారు. సాయంత్రం 5.30కు పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక, ప్రమాణ స్వీకారం, అధ్యక్షుడి ప్రసంగం ఉంటాయి. మూడో రోజు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు 5 లక్షలమందితో భారీ బహిరంగసభ నిర్వహిస్తారు.

వర్షంతో పనులకు ఆటంకం

ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో మహానాడు పనులకు అంతరాయం ఏర్పడింది. ప్రాంగణమంతా బురదమయంగా మారింది. వేదిక వద్దకు నీరు వచ్చింది. వర్షం ఆగిపోయిన వెంటనే పనులు చేపట్టాలని మంత్రి నిమ్మల ఆదేశించారు.

భారీగా ఏర్పాట్లు

మహానాడు వేదిక దాదాపు పూర్తయింది. సువిశాల మైదానంలో తొలి రెండురోజులు ప్రతినిధుల సభ, చివరిరోజు బహిరంగ సభ, భోజనశాల, ముఖ్యమంత్రి సభ, ఆయన క్యాంపు కార్యాలయం ఇలా అన్నింటినీ సిద్ధం చేశారు. ప్రతినిధుల సభా వేదికపై దాదాపు 450 మంది కూర్చొనే విధంగా 164 అడుగుల వెడల్పున, 510 అడుగుల పొడవుతో నిర్మించారు. కింద 25వేల మంది కూర్చుని చర్చించేలా ఏర్పాట్లు చేశారు.

7.30 గంటల్లోపే పరీక్షా కేంద్రాలకు

- కడపలో ఏపీఈఏపీసెట్ అభ్యర్థులకు సెట్ చైర్మన్ సూచన

జేఎన్టీయూకే, మే 25(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పబ్బాపురంలో రేపటి నుంచి టీడీపీ మహానాడు జరగనున్న దృష్ట్యా ఆ జిల్లాలోని 4 కేంద్రాల్లో ఏపీఈఏపీసెట్‌కు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 7.30 గంటలలోపే చేరుకోవాలని ఈఏపీ సెట్ చైర్మన్ సీఎస్ఆర్కే ప్రసాద్ సూచించారు. కడపలోని కందుల ఓబుల్‌రెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, అన్నమాచార్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, కేఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కేఎల్ఎం కాలేజ్ ఫర్ ఉమెన్స్‌ల్లో ఈఏపీసెట్ ఇంజనీరింగ్ పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందన్నారు.

మోదీ నాయకత్వ ప్రతిభ వల్లే నాలుగో స్థానం

- ఎక్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్

అమరావతి, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ విజనరీ నాయకత్వంలో భారత్ జపాన్ ఆర్థిక వ్యవస్థను దాటి 4.2 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవడం గర్వించదగ్గ విషయమని సీఎం చంద్రబాబు ఎక్స్‌లో ట్వీట్ చేశారు. '2028 నాటికి జర్మనీని కూడా దాటి మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుంది. ఇలాంటి తరుణంలో అన్ని రాష్ట్రాలూ వికసిత్ భారత్-2047 లక్ష్యాల సాధనకు కలిసికట్టుగా కృషి చేయాలి. ఏపీ భారత్‌కు గ్రోత్ ఇంజన్‌లా పనిచేస్తూ స్వర్ణాంధ్ర -2047 సాధనకు కృషి చేస్తోంది' అని పేర్కొన్నారు. మరో ట్వీట్‌లో.. ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో యోగాంధ్ర-2025ని ప్రస్తావించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రధాని దార్శనిక నాయకత్వంతోనే..: డిప్యూటీ సీఎం పవన్

- వికసిత భారత్‌వైపు నడిపించడానికి కీలకమైన అడుగని ట్వీట్
- ఇద్దరు మహారాష్ట్ర డిప్యూటీ సీఎంలతో కలసి మోదీతో భోజనం

అమరావతి/న్యూఢిల్లీ, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ దూరదృష్టి నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద నాలుగో ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ఢిల్లీలో ఆదివారం జరిగిన ఎన్డీయే సీఎంలు, ఉప ముఖ్యమంత్రుల సదస్సులో ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ చారిత్రక విజయం ప్రధాని మోదీ దార్శనిక నాయకత్వం, 2014 నుంచి ఎన్డీయే ప్రభుత్వ ప్రగతిశీల పాలనకు నిదర్శనమని కొనియాడారు. ఎన్డీయే సుపరిపాలనతో భారత్ అనేక రంగాల్లో వృద్ధి సాధించిందన్నారు. 'ఇది కేవలం ఆర్థిక విజయమే కాదు. ప్రపంచంలో నవ భారత్‌కు పెరుగుతున్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తోంది. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి, వికసిత భారత్-2047 వైపు నడిపించడానికి ముఖ్యమైన అడుగు' అని ఎక్స్‌లో చేసిన ట్వీట్‌లో పవన్ పేర్కొన్నారు. అంతకుముందు ఎన్డీయే నేతలతో కలసి 'మన్ కీ బాత్' కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం ప్రధాని ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి హాజరయ్యారు. మోదీతో పాటు మహారాష్ట్ర డిప్యూటీ సీఎంలు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌తో కలిసి భోజనం చేశారు. ఈ సమావేశం అనంతరం పవన్ మీడియాతో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ విజయం పట్ల భారత సైన్యానికి అభినందనలు తెలుపుతూ, జన గణనలో కులగణనకు కేంద్రం నిర్ణయం తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేసినట్లు వివరించారు.

మోదీ సంస్కరణల వల్లే భారత్ ముందడుగు: యామిని

విజయవాడ, మే 25(ఆంధ్రజ్యోతి): భారత్ నాల్గో పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం గర్వంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ త్వరలోనే వికసిత ఆంధ్రాగా మారుతుందన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన ఆర్థిక, పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లోని సంస్కరణలు ఘననీయ ఫలితాలను ఇచ్చాయని పేర్కొన్నారు.

మహానాడుకు సైకిల్ యాత్ర

- పెనుకొండ నుంచి ప్రారంభించిన మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో మంగళవారం నుంచి జరగనున్న 'మహానాడు'కు హాజరయ్యేందుకు శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నుంచి టీడీపీ కార్యకర్తలు సైకిల్ యాత్ర చేపట్టారు. రాష్ట్ర బీసీ శాఖ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే సంజీవరెడ్డిగారి సవిత ఆధ్వర్యంలో ఈ సైకిల్ యాత్ర చేపట్టారు. పెనుకొండలోని టీడీపీ కార్యాలయం వద్ద ఆదివారం జెండా ఊపి మంత్రి సవిత.. యాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి కృష్ణదేవరాయల వైజంక్షన్ వరకు మంత్రి సవిత దాదాపు 4 కిలోమీటర్లు సైకిల్‌తొక్కి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. మంత్రి మాట్లాడుతూ.. కడపలో మూడు రోజులు మహానాడు పండుగలా జరగబోతోందన్నారు. 44 మందితో కూడిన 'యువగళం నారా లోకేశ్' బృందం మహానాడుకు సైకిల్ యాత్రగా బయలు దేరిందని మంత్రి తెలిపారు. కాగా.. వీరు 200 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర నిర్వహించి మహానాడు ప్రాంగణానికి చేరుకుంటారు.



సైకిల్ యాత్రలో పాల్గొన్న మంత్రి సవిత

రంగాతో వంశీకి పోలికా!

- వంశీ ఏమైనా స్వాతంత్ర్య సమరయోధుడా?
- పేర్ని నాని క్షమాపణ చెప్పాలి: బుద్దా వెంకన్న



విజయవాడ(వన్‌టౌన్), మే 25(ఆంధ్రజ్యోతి): 'నీకు అసలు సిగ్గుందా? బియ్యం కుంభకోణంలో తప్పుడు పనులు చేసి, నీ భార్య పేరు పెడతావా? చంద్రబాబుకు ధన్యవాదాలు చెప్పిన నీవు విశ్వాసఘాతకుడిగా మాట్లాడుతున్నావు. వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పు' అని మాజీ మంత్రి పేర్ని నానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న హితవు పలికారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వల్లభనేని వంశీని స్వాతంత్ర్య సమరయోధుడిగా పేర్ని నాని పోల్చారని తప్పుబట్టారు. పేదల కోసం పాటుపడిన వంగవీటి రంగాతో వంశీని పోల్చడం ఏమిటని మండిపడ్డారు. పేదలను అడ్డం పెట్టుకుని డబ్బు దండుకున్న వ్యక్తి వంశీ అన్నారు. పేర్ని నాని మోకాళ్లపై కూర్చుని రంగా అభిమానులకు, ఆయన కుమారుడు రాధాకృష్ణకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు తీసుకెళ్తుండగా వంశీ వాంతులు చేసుకున్నాడని, అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, వంశీ వాంతులు చేసుకోవడం పేర్ని నాని చూశారా అని ప్రశ్నించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.